S TV SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక



సమయం

విలేకరులు కావలెను

ఫోన్ నెం : 99483 13985/ 89789 80131



సంపుటి: 19 | సంచిక: 81 | ఎడిటర్ : విక్రం కుమార్ | మంగళవారం 6 జనవరి 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |



## మహిళా సాధికారితకు
# పెద్దపీట



- మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి
- ఉచిత బస్సుతో మహిళలకు దక్కిన భరోసా
- ప్రతి మహిళను సభ్యురాలుగా చేర్చాలన్నదే లక్ష్యం
- ఇందిరమ్మ క్యాంటీన్ల కోసం వడ్డీలేని రుణాలు
- అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో సీతక్క సమాధానం

మహిళా సాధికారతకు సంక్షేమానికి తమ ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కృషి చేస్తున్నామన్నారు. మహిళా సాధికారత, సంక్షేమమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయాలు తీసుకుంటున్నామని తెలిపారు.

మిగతా 2 లో





## తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు
# సరికాదు

## ప్రపంచంలో తెలుగుజాతి నంబర్ వన్‌గా ఉండాలి

- ఎన్టీఆర్ వచ్చాకనే ఎస్ఎల్బీసీ, ఎస్ఆర్బీసీ ప్రాజెక్టులు రాక
- కాళేశ్వరం కట్టినా తాము అడ్డుచెప్పలేదు
- వృథా జలాలను ఉపయోగిస్తేనే మేలు
- కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు నేనే పూర్తి చేశా
- ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడి

**గుంటూరు :** తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు ఉండకూడదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రపంచంలో తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలని వ్యాఖ్యానించారు. దీనికి తాను కట్టుబడి ఉన్నానని పేర్కొన్నారు. తెలుగు జాతి నెంబర్ వన్‌గా ఉండాలంటే... మనలో ఐకమత్యంగా ఉండాలని చెప్పుకొచ్చారు. తెలుగు ప్రజలకు రెండు రాష్ట్రాలు ఉన్నా... తెలుగే మాతృభాష అని తెలిపారు. రెండు రాష్ట్రాలు కలిసి ఉంటే ఎన్నో సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ఎన్టీఆర్ సీఎం అయ్యాకే... సాగర్ జలాలను ఉపయోగించుకునేలా

మిగతా 5 లో



### ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఏపీ కీలక మైలురాయి

విశాఖపట్నం రిఫైనరీ అందుబాటులోకి కొత్త రెసిడ్యూ అప్‌గ్రేడేషన్

కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పరి ట్వీట్‌కు సీఎం చంద్రబాబు రీ ట్వీట్

### మారిషస్ అధ్యక్షుడితో సీఎం చంద్రబాబు మర్యాద పూర్వక భేటీ...

వివరాలు 5లో

## రాష్ట్రంలో విస్తృతంగా
# సోలార్ పవర్



- వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగం
- పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల్లో స్పందన అంతంత మాత్రమే
- మండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి


2

## వ్యక్తిగా వెళుతున్నా..
# శక్తిగా తిరిగి వస్తా

- బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు
- ప్రశ్నిస్తే.. కారణం లేకుండా బయటకు పంపారు
- హరీష్ రావు అవినీతికి అంతు లేదు
- సిద్దిపేట తదితర కలెక్టరేట్లు ఒక్క వానకే కూలాయి
- ఇదే నాచివరి ప్రసంగం అంటూ మండలిలో కవిత భావోద్వేగం

3





## అమెరికాలో హైదరాబాద్
# యువతి హత్య

చెన్నైలో ఆమె మాజీ ప్రియుడు అర్జున్ అరెస్ట్

2

## సభను తప్పుదోవ పట్టించిన సీఎం

స్పీకర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు

2

## ఓఎన్జీసీ పైపులైన్‌లో
# గ్యాస్ లీక్

### భారీగా ఎగిసిపడ్డ మంటలు
### అప్రమత్తం అయిన అధికారులు



**అంబేడ్కర్ కోనసీమ :** మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ పైపులైన్ నుంచి గ్యాస్ లీకై భారీగా మంటలు ఎగసిపడ్డాయి. గ్యాస్ గాలిలోకి ఎగజిమ్మడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అది చూసి గ్రామస్థులు ప్రాణ భయంతో పరుగులు తీశారు. అధికారులకు సమాచారం ఇవ్వడంతో మండల తహశీల్దార్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గ్యాస్ లీక్ అవుతున్న ప్రదేశాన్ని పరిశీలించి వెంటనే ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న


మిగతా 3 లో

### గ్యాస్ లీక్ ఘటనపై చంద్రబాబు ఆరా

తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశం

3

## వరద జలాల పేరుతో
# అసలుకు ఎసరు



- 480 టీఎంసీలకు మించి వాడుకునేందుకు ఏపీ ప్రయత్నం
- సుప్రీంలో తెలంగాణ వాదనలు

2

# హరీష్ రావుకు ఊరట

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రభుత్వ పిటిషన్ కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం



ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు భారీ ఊరట లభించింది. ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్పీని సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేసింది.

2




# అమెరికాలో హైదరాబాద్ యువతి హత్య

## చెన్నైలో ఆమె మాజీ ప్రియుడు అర్జున్ అరెస్ట్

**హైదరాబాద్, జనవరి 5:** అమెరికాలో హైదరాబాద్ యువతి గోడిశాల నిఖిత హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అనుమానితుడిగా ఉన్న ఆమె మాజీ బాయ్‌ఫ్రెండ్ అర్జున్ శర్మను ఇంటర్‌పోల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఇప్పటికే అతడిపై అమెరికా పోలీసులు అరెస్టు వారెంట్ జారీ చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో నిఘా అధికారుల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో ఇంటర్‌పోల్ పోలీసులు తమిళనాడులో అనుమానితుడిని అరెస్ట్ చేశారు. అతడిని అమెరికాకు అప్పగించేందుకు అధికారిక ప్రక్రియ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. నిఖిత మృతి వార్త తెలియగానే ఆమె తండ్రి ఆనంద్ కన్నీరుమున్నీరయ్యారు. తన కుమార్తె మృతదేహాన్ని స్వదేశానికి తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాయం చేయాలని అభ్యర్థించారు. ఇక, మీడియాలో వస్తున్నట్లుగా అనుమానితుడు అర్జున్ శర్మ.. తన కుమార్తె మాజీ బాయ్‌ఫ్రెండ్ కాదని తెలిపారు. అతడు చాలా మంది నుంచి అప్పులు తీసుకున్నట్లు చెప్పారు. 27 ఏళ్ల నిఖిత మేరీల్యాండ్‌లో అనుమానాస్పద రీతిలో మృతిచెందిన సంగతి తెలిసిందే. డిసెంబరు 31 నుంచి కన్పించకుండా పోయిన ఆమె మృతదేహాన్ని జనవరి 3న అర్జున్ శర్మ అపార్ట్‌మెంట్‌లో గుర్తించారు. ఆమె శరీరంపై కత్తిపోట్లు ఉన్నట్లు అమెరికా పోలీసులు తెలిపారు. అర్జున్ శర్మనే ఆమెను హత్య చేసి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అయితే, నిఖిత అదృశ్యంపై జనవరి 2న అర్జున్ స్వయంగా పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనార్హం. అదే రోజున అతడు భారత్‌కు తిరిగి వచ్చినట్లు అమెరికా పోలీసులు గుర్తించారు. అతడిపై అరెస్ట్ వారెంట్ జారీ చేశారు. అర్జున్ శర్మ ఆచూకీ కోసం యూఎస్ ఫెడరల్ ఏజెన్సీలు భారత అధికారులతో సంప్రదింపులు జరిపాయి.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావుకు ఊరట


## ప్రభుత్వ పటిషన్ కొట్టివేసిన సుప్రీం ధర్మాసనం



**న్యూఢిల్లీ, జనవరి 5:** ఫోన్ ట్యాపింగ్ కేసులో బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుకు సుప్రీం కోర్టులో భారీ ఊరట లభించింది. ఈ కేసుకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన ఎస్ఎల్పీని సుప్రీం ధర్మాసనం డిస్మిస్ చేసింది. ఫోన్ ట్యాపింగ్ కేసులో హరీష్ రావును విచారించేందుకు అనుమతి ఇవ్వాలంటూ సుప్రీం కోర్టులో తెలంగాణ సర్కార్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్దార్థ్ లూథ్రా వాదనలు వినిపించారు. అయితే గతంలోనే తన ఫోన్‌ను ట్యాప్ చేయించా రంటూ మాజీ మంత్రి హరీష్ రావుపై రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ కూడా నమోదు అయ్యింది. దీన్ని సవాల్ చేస్తూ హరీష్ రావు తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా.. సరైన ఆధారాలు లేనందున ఈ కేసును కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. ఈ తీర్పును సవాల్ చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై సోమవారం సుప్రీంలో విచారణ జరుగగా.. తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోబోమని జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం తేల్చిచెప్పింది. ఎస్ఎల్పీలో జోక్యం చేసుకునేందుకు సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. రాధాకిషన్‌రావు, హరీశ్‌రావులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో గతంలో దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసినట్లు జస్టిస్ బీవీ నాగరత్న ధర్మాసనం గుర్తుచేసింది. రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హరీశ్‌రావు, రాధాకిషన్ రావు ఫోన్ ట్యాపింగ్ చేశారని సిద్దిపేటకు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారి చక్రధర్ గౌడ్ 2024లో పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు కూడా చేపట్టారు. అయితే ఈ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేయాలని హరీశ్‌రావు అదే ఏడాది డిసెంబర్ 4న హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఆ ఎఫ్ఐఆర్‌ను క్వాష్ చేస్తూ గత ఏడాది మార్చి 20వ తేదీన ఆదేశాలిచ్చింది. చక్రధర్ గౌడ్ ఫిర్యాదు ఆధారంగా నమోదైన ఎఫ్ఐఆర్‌పై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ జూన్ 18న సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దీనిపై విచారణ జరిపిన సర్వోన్నత న్యాయస్థానం.. ఆ పిటిషన్లను కొట్టివేసింది.

# సభను తప్పుదోవ పట్టించిన సీఎం

## స్పీకర్‌కు బిఆర్ఎస్ ఎమ్మెల్యేల ఫిర్యాదు



**హైదరాబాద్, జనవరి 5 :** సీఎం రేవంత్‌రెడ్డిపై స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు భారత రాష్ట్ర సమితి ఎమ్మెల్యేలు ఫిర్యాదు చేశారు. నదీ జలాలపై చర్చ సమయంలో సభను తప్పుదోవ పట్టించారని పేర్కొంటూ సభాహక్కుల ఉల్లంఘన కింద ఫిర్యాదు చేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశం మినిట్స్, రాయలసీమ ఎత్తిపోతల పనుల నిలిపివేత, కృష్ణా జలాల్లో తాత్కాలిక ఒప్పందంపై సీఎం రేవంత్‌రెడ్డి తప్పుదోవ పట్టించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పీకర్ సూచన మేరకు ఎమ్మెల్యేలు శాసనసభ కార్యదర్శికి నోటీసులు అందజేశారు.

# మహిళా సాధికారితకు పెద్దపీట

**హైదరాబాద్, జనవరి 5:** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నాలుగవ రోజు ప్రారంభమయ్యాయి. సభ మొదలైన వెంటనే స్పీకర్ గడ్డం ప్ర సాద్ కుమార్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఇం దిరా మహిళా శక్తి క్యాంటీన్ ఏర్పాటుపై సభ్యు లు ప్రశ్న లేవనెత్తగా.. మంత్రి సీతక్క సమాధానం ఇచ్చారు. ప్రతి మహిళ ఎస్‌జీహెచ్ సభ్యురాలుగా ఉండాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని వెల్ల డించారు. 15 సంవత్సరాలు దాటిన బాలికల నుంచి పండు ముదుసలి వరకు మహిళా సం ఘం సభ్యులుగా చేర్చుతున్నామని తెలిపారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగులకు ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 250 ఇందిరమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేశామని తెలంగాణ మంత్రి సీతక్క తెలిపారు. క్యాంటీన్ల నిర్వహణ, పెట్టుబడి కోసం స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు 10 రోజులపాటు హైదరాబాద్‌లో శిక్షణ ఇచ్చామ న్నారు. పట్టణ ప్రాంతాల్లో 130 క్యాంటీన్లు చేసినట్లు వివరించారు. కోటిమంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేది సీఎం రేవంత్‌రెడ్డి సంకల్పమని చెప్పారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మ హిళల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి సీతక్క చెప్పారు. మహిళలు స్వయం ఉపాధి సాధించేందుకు అవసరమైన అవకాశాలు, వనరులు కల్పిస్తూ వారి ఆర్థిక బలాన్ని పెంచడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని వివరించారు. కిశోర బాలికలు, వృద్ధులు, దివ్యాంగ మహి ళల కోసం ప్రత్యేక మహిళా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. వీరి అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించి.. వారికి ఆర్థిక, సామాజిక భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అయితే సోమవారం కూడా బీఆర్ఎస్ సభకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. శాసనసభ, శాసనమండలి సమావేశాలకు హాజరుకావొద్దని బీఆర్ఎస్ నిర్ణయం తీసుకుంది. సభలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వటంలేదని.. అందుకు నిరసనగా బీఆర్ఎస్ అసెంబ్లీని బహిష్కరించిన విషయం తెలిసిందే.

# రాష్ట్రంలో విస్తృతంగా సోలార్ పవర్

- వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగం
- పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల్లో స్పందన అంతంత మాత్రమే
- మండలిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి



**హైదరాబాద్, జనవరి 5:** రాష్ట్రంలో సోలార్ పవర్‌ను విస్తృతంగా అందుబాటులోకి తీసుకు రావాలన్న దిశగా ప్రభుత్వం ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గృహ అవసరాలకే కాకుండా వ్యవసాయ రంగానికి కూడా సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలన్న లక్ష్యంతో పలు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. శాసన మండలిలో ఈ అంశంపై మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్య ఘర్ పథకానికి ప్రజల నుంచి అనుకున్నంత స్థాయిలో స్పందన రావడం లేదని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే ఉచిత విద్యుత్ అందిస్తున్న నేపథ్యంలో సోలార్ ప్యానెల్స్ కోసం ఇంటి మీద రూఫ్ ఏర్పాటు చేయాల్సి రావడం కూడా ప్రజలు వెనకడుగు వేయడానికి కారణమవుతోందని చెప్పారు. పీఎం కుసుమ్ పథకాన్ని మరింత ప్రభావవంతంగా అమలు చేయాలనే ఉద్దేశంతో కొడంగల్, బొనకల్ మండలాల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా సోలార్ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని భట్టి విక్రమార్క వెల్లడించారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం నుంచి కొంత సబ్సిడీ అందుతుందని, మొత్తం పథకం వ్యయం సుమారు రూ.519 కోట్ల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి రెడ్కో నోడల్ ఏజెన్సీగా పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 52 లక్షల కుటుంబాలకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, అదేవిధంగా 20 లక్షల విద్యుత్ కనెక్షన్లను పీఎం సూర్య ఘర్ పథకంతో అనుసంధానం చేయాలనే అంశంపై కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి చర్చించామని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు పొలాల్లో సోలార్ యూనిట్లు ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఉన్నప్పటికీ, లీజు భూముల్లో ఈ సదుపాయం కల్పించలేమని కేంద్ర నిబంధనలు స్పష్టం చేస్తున్నాయని డిప్యూటీ సీఎం భట్టి చెప్పారు. ఈ కారణంగా రైతులు కూడా పీఎం కుసుమ్ పథకంపై పెద్దగా ఆసక్తి చూపించడం లేదన్నారు. అయినప్పటికీ సాధ్యమైనంత వరకు ఈ పథకాలను అమలు చేసి సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు. 'ట్రాన్స్ ఫార్మర్స్, వ్యవసాయ పంపు సెట్ల కోసం రైతులు దరఖాస్తు చేసుకున్నారు. 3,48,462 మంది దరఖాస్తు చేసుకున్నారు. 75 పైచిలుకు ట్రాన్స్ ఫార్మర్స్ మంజూరు చేశాం. విద్యుత్ శాఖలో చాలా సంస్కరణలు తీసుకు వచ్చాము. 1912 కు ఫోన్ చేస్తే ఎలక్ట్రికల్ అంబులెన్స్ ద్వారా ఫిర్యాదు చేసిన ప్రాంతానికి వెళ్లి సమస్య పరిష్కారం చేస్తారు. అడిగిన వారికి ట్రాన్స్ ఫార్మర్స్ ఇస్తున్నాం. గత కొంతకాలంగా విద్యుత్ శాఖలో ప్రజా బాట నిర్వహించి సమస్యలు పరిష్కరిస్తున్నాం. గత ఏడాది 56807 బూటఇ పరిధిలో కొత్త కనెక్షన్లు, ఎన్పిడీసీఎల్లో 41 086 కనెక్షన్లు.. మొత్తంగా 97893 కొత్త కనెక్షన్లు ఇచ్చాము. ఈ ఏడాదిలో మరో 20 వేల కొత్త కనెక్షన్లు ఇస్తాం. రాష్ట్రంలో ట్రాన్స్ ఫార్మర్స్ కొరత లేదు' అని డిప్యూటీ సీఎం చెప్పారు.

# పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను వ్యతిరేకిస్తున్నాం

## ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి లేఖ రాశాం

## మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడి



**హైదరాబాద్, జనవరి 5:** పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిస్తున్న లేఖ ఈ ప్రాజెక్టులకు సంబంధించినది కాదని క్లారిటీ ఇచ్చారు. పోలవరం- నల్లమల్ల ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి తామే లేఖ రాశామని ప్రస్తావించారు. తమ అభిప్రాయాన్ని జీఆర్ఎంబీ కూడా సమర్థించిందని గుర్తుచేశారు. సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడారు. పోలవరం- నల్లమల్ల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టులో తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సూచించామని పేర్కొన్నారు. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసిందని తెలిపారు. రిట్ పిటిషన్‌లో కాదని.. సూట్ పిటిషన్‌లో రావాలని తమకు సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ కేసులో స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును వచ్చే సోమవారం కోరుతామని తెలిపారు. వచ్చే విచారణకు తాను కూడా ప్రత్యక్షంగా హాజరవుతానని స్పష్టం చేశారు. ఒకటి, రెండు రోజుల్లో మరోసారి న్యాయవాదులతో సమావేశం అవుతామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేశారని స్పష్టం చేశారు. గతంలో ఈ పథకం ఆగిపోయి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చెప్పలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ఒత్తిడి వల్లే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపేసిందని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణా-గోదావరి జలాల్లో తెలివి ఎక్కువ.. పని తక్కువ అని చెప్పుకొచ్చారు. అతి తెలివితో బీఆర్ఎస్ తెలంగాణకు భారీ నష్టం చేసిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# వరద జలాల పేరుతో అసలు జలాలకు ఎసరు

మొదటి పేజీ తరువాయి

వరద జలాల పేరుతో నీటిని తరలించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 200 టీఎంసీలు తరలించేందుకు ఏపీ ప్రయత్నిస్తు న్నదని చెప్పారు. తెలంగాణ కొత్తగా ఏర్పడిన రాష్ట్రమని, అనేక ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని అన్నారు. వరద జలాలు అనేది ఎక్కడా లేదని అన్నారు. ముఖ్యంగా గోదావరి నదిలో తెలంగాణకు ఉన్న 968 టీఎంసీల నీటి వాటాకు ఈ ప్రాజెక్టు వల్ల ముప్పు పొంచి ఉందన్నారు. కేంద్ర జల సంఘం ఇచ్చిన ఆదేశాలను కూడా ఏపీ పట్టించుకోవడం లేదు అని సింఘ్వీ వాదించారు. ఈ ప్రాజెక్టుపై తక్షణమే స్టే ఇవ్వాలని కోరారు. ఏపీ తరఫున ముకుల్ రోహత్గీ వాదనలు వినిపిస్తూ.. ఈ ప్రాజెక్టు ఇంకాప్రాథమిక దశలోనే ఉందని, కేవలం డీపీఆర్, సర్వేల కోసం మాత్రమే టెండర్లు పిలుస్తున్నా మని ఆయన స్పష్టం చేశారు. నా ఇల్లు నేను కట్టుకుంటే పక్కవారికి అభ్యంతరం ఏంటీ అనే ఆసక్తికరమైన ఉదాహరణతో రోహత్గి తన వాదన వినిపించారు. రాయలసీమ వంటి కరవు ప్రాంతాలకు నీటిని అందించడమే తమ లక్ష్యమని ఇందులో ఎలాంటి ఉల్లంఘనలు లేవని స్పష్టం చేశారు. సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వాడుకోవడమే తమ ఉద్దేశమని తెలిపారు. ఇరు వర్గాల వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకునే అవకాశాలను పరిశీలించాలని సూచిస్తూ తదుపరి విచారణను వచ్చే సోమవారానికి వాయిదా వేశారు. అయితే ఏపీ ఉల్లంఘనలకు పాల్పడటానికి సిద్ధమైందనేది ఆరోపణ అని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. కమిటీ ఏర్పాటు చేశారని మీరే చెబుతున్నారని, అన్ని విషయాలపై నివేదిక ఇవ్వనీయండని తెలంగాణ తరఫు న్యాయవాది అభిషేక్ సింఘ్వీకి సుప్రీంకోర్టు సూచించింది. సివిల్ సూట్‌లో జోక్యం చేసుకుని నిలుపుదల చేసే అధికారం సుప్రీంకోర్టుకు ఉందా? అని సీజేఐ ప్రశ్నించారు. ఈ సందర్భంగా తమకు మధ్యంతర ఉపశమనం కల్పించాలని సింఘ్వీ కోరారు. ఏపీ కేవలం ప్రాజెక్టు నివేదిక కోసమే టెండర్లు పిలవాలని చూస్తోందని సీజేఐ అన్నారు. జాతీయ ప్రాజెక్టుల విషయంలో కేంద్రానికి న్యాయ పరిధి ఉంటుందన్నారు. మధ్యవర్తిత్వం ద్వారా ఎందుకు పరిష్కరించుకోకూడదని సీజేఐ సూచించారు. ఆంధ్రప్రదేశ్ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టు నివేదికపై అభ్యంతరం ఏంటి? నా ఇల్లు - నేను కట్టుకోవాలనుకుంటే మీకు అభ్యంతరం ఏంటి? నా భూభాగంలో చేపట్టే ప్రాజెక్టు నివేదిక తయారు చేసుకుంటే అభ్యంతరం ఎందుకో? సీమలో కరవు ప్రాంతానికి నీటిని తీసుకెళ్లడానికే ప్రాజెక్టు ప్రతిపాదన. ఎక్కడా.. ఏ ఉత్తర్వులు, తీర్పులు ఉల్లంఘనలు ఈ ప్రాజెక్టులో లేవు' అని రోహత్గి వాదించారు. పరివాహక ప్రాంత రాష్ట్రాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోవాలని ఈ సందర్భంగా సీజేఐ సూచించారు. అయితే, ఈ ప్రాజెక్టు వల్ల ఏ ఒక్క రాష్ట్రానికి నష్టం జరగదని ముకుల్ రోహత్గి వాదించారు. తెలంగాణ మాత్రం గోదావరిపై వందల ప్రాజెక్టుల నిర్మిస్తోందని ఏపీ తరఫున మరొక న్యాయవాది జగదీప్ గుప్తా వాదనలు వినిపించారు. ఇరు వాదనలు విన్న సుప్రీంకోర్టు తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. అందరి అభిప్రాయాలతోనే తదుపరి విచారణ కొనసాగిస్తామని సీజేఐ వెల్లడించారు.

# బంగ్లాలో ఆగని హిందువుల హత్య

## మరో యువకుడిని కాల్చి చంపిన దుండగులు

**ఢాకా,జనవరి5 :** బంగ్లాదేశ్‌లో మైనారిటీ హిందువులపై హత్యాకాండలు ఆగడం లేదు. సోమవారం సాయంత్రం 5ప్రాంతంలో అందరూ చూస్తుండగానే మరో హిందూ యువకుడిపై దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతను అక్కడికక్కడే మృతిచెందగా, దుండగులు పరారయ్యారు. బంగ్లాదేశ్‌లోని జస్సోర్ జిల్లా కేశబ్బూర్ ఉపజిల్లా వార్డు నెంబర్-17లోని కొపలియా బజార్‌లో ఈ దారుణం చోటు చేసుకుంది. మృతుని కేశబ్రూర్ ఉపజిల్లాలోని అరువా గ్రామానికి చెందిన రాణాప్రతాప్ (45)గా గుర్తించారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసు వర్గాల సమాచారం ప్రకారం, మార్కెట్‌కు వచ్చిన రాణాప్రతాప్‌పై గుర్తుతెలియని దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన అతను అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. సమాచారం తెలిసిన మణిరాంపూర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని అదుపులోనికి తెచ్చారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం పంపామని, నిందితుల కోసం గాలిస్తున్నామని ఆఫీసర్ ఇన్‌చార్జి రజివుల్లా ఖాన్ తెలిపారు.



కొద్దికాలంగా దేశవ్యాప్తంగా పలు చోట్ల నిరసనలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ఈ తరహా హింసాత్మక ఘటనలు చోటుచేసుకోవడం గత మూడు వారాల్లో ఇది ఐదవది.

# వ్యక్తిగా వెళుతున్నా.. శక్తిగా తిరిగి వస్తా

- బీఆర్ఎస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు
- ప్రశ్నిస్తే.. కారణం లేకుండా బయటకు పంపారు
- హరీష్ రావు అవినీతికి అంతు లేదు
- సిద్దిపేట తదితర కలెక్టరేట్లు ఒక్క వానకే కూలాయి
- కింది నాయకులు దురాగతాలను పట్టించుకోని కేసీఆర్
- ఇదే నాచివరి ప్రసంగం అంటూ మండలిలో భావోద్వేగం
- కొత్త రాజకీయ వేదిక రాబోతోందంటూ కవిత వెల్లడి



**హైదరాబాద్, జనవరి 5:** బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్‌పై కక్షతో బిజెపి నన్ను జైలులో పెట్టించిందని ఆరోపించారు. శాసనమండలిలో ఇదే తన చివరి ప్రసంగం అంటూ మాట్లాడిన ఎమ్మెల్సీ కవిత.. సంచలన కామెంట్స్ చేశారు. ఒక వ్యక్తిగా బయటకు వెళ్తున్నానని.. బలమైన శక్తిగా మళ్లీ చట్ట సభల్లోకి వస్తానంటూ కవిత శపథం చేశారు. తన రాజీనామాను ఆమోదించాలంటూ మండలి ఛైర్మన్‌కు కవిత విజ్ఞప్తి చేశారు. సెప్టెంబర్ 3న ఛైర్మన్ ఫార్మాట్‌లో రాజీనామా చేశానని తెలిపారు. సోమవారం తెలంగాణ శాసనమండలి సమావేశాలకు కవిత హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసంగించిన ఆమె.. ఇదే తన చివరి ప్రసంగం అంటూ కన్నీరు పెట్టుకున్నారు. ఇదే సమయంలో తన రాజకీయ భవిష్యత్‌పై, తాను ఎదుర్కొన్న పరిస్థితులపై, బీఆర్ఎస్ పార్టీపై హాట్ కామెంట్స్ చేశారు. బీఆర్ఎస్ పార్టీపై ఊహించని రీతిలో విరుచుకు పడ్డారు కవిత. తన కింద నాయకులు చేస్తోన్న దురాగతాలను కేసీఆర్ గమనించడం లేదన్నారు. టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చటాన్ని తాను అంగీకరించ లేదన్నారు. తెలంగాణలో ఏం సాధించిందని.. బీఆర్ఎస్ జాతీయ రాజకీయాలకు వెళ్లిందంటూ తీవ్ర వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. బీజేపీ తనను జైలుకు పంపితే.. బీఆర్ఎస్ నాయకులు తనకు అండగా నిలవలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరిగా మూడేళ్లు ఈడీతో తాను పోరాటం చేశానన్నారు. పార్టీ అధినేత కేసీఆర్‌ను విమర్శిస్తే పెద్ద నాయకులు ఎందుకు మాట్లాడటం లేదంటూ కవిత సూటిగా ప్రశ్నించారు. కేసీఆర్‌ను కాపాడుకోలేని పార్టీ ఉంటే ఎంత? పోతే ఎంత? అని అన్నారు. హరీష్ రావు అవినీతి పరుడంటూ కవిత ఉద్ఘాటించారు. బీఆర్ఎస్ పార్టీ రాజ్యాంగం పెద్ద జోక్ అని సెటైర్లు వేశారు. పార్టీ నడిపే పద్ధతి ఇది కాదని.. నైతికత లేని పార్టీ బీఆర్ఎస్ అంటూ శాసనమండలి సాక్షిగా దుమ్మెత్తిపోశారు. కనీసం సంజాయిషీ కూడా అడగకుండా తనను సస్పెండ్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.. 'నా ఇద్దరి కొడుకుల మీద ఒట్టు వేసి చెప్తోన్న.. బీఆర్ఎస్‌తో నాది ఆస్తుల పంచాయితీ కాదు.. ఆత్మగౌరవ పంచాయితీ' అని కవిత స్పష్టం చేశారు. 'ప్రశ్నిస్తే.. బీఆర్ఎస్ పార్టీలోని కొందరు నాపై కక్ష కట్టారు. బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యం లేదు. పదవుల కోసం బీఆర్ఎస్ పార్టీలోకి పోలేదు. పార్టీలో.. ప్రభుత్వంలో అవినీతిని ప్రశ్నించాను. సిద్దిపేట, సిరిసిల్లలో కట్టిన కలెక్టరేట్లు ఒక్క వర్షానికే మునిగిపోయాయి. ఉద్యమకారులకు ఆర్థికసాయం చేద్దామంటే నా మాట వినలేదు. ఇసుక దందాల కోసమే నేరెళ్ల దురాగతం జరిగింది. తెలంగాణ వచ్చాక కూడా బోధన్ షుగర్ ఫ్యాక్టరీ తెరవకపోవటం అవమానకరం. సొంత సంస్థ జాగృతి ద్వారా తెలంగాణ ఉద్యమంలో పనిచేసి గుర్తింపు సంపాదించుకున్నాను. బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్‌లో విలీనం కావాల్సిన పరిస్థితి ఉంది. ఉద్యమకారులు మాటలు కేసీఆర్‌కు చేరనివ్వటం లేదు. నిజామాబాద్ ఎంపీ టికెట్ కోసం బీఆర్ఎస్‌ను అడుక్కోలేదు. ఉద్యమంలో పార్టీలకు అతీతంగా కష్టపడ్డాను. తెలంగాణ జాగృతి సంస్థతో రాజకీయాల్లోకి వచ్చాను. బతుకమ్మ పండుగను ముందుకు తీసుకెళ్ళాను. నీళ్ళ విషంలో గత పాలకులు చేస్తోన్న తప్పునే.. ప్రస్తుత పాలకులు చేస్తున్నారు.' అంటూ సంచలన కామెంట్స్ చేశారు కవిత. ప్రత్యేక రాష్ట్రంగా తెలంగాణ ఏర్పడిన తర్వాత 2014లో జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ నిర్వహించామని.. ఆ తర్వాత నుంచి తనపై ఆంక్షలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కవితఅన్నారు. వ్యక్తి స్వేచ్ఛను ఎలా హరిస్తారనే బాధ, ఆవేదనతో ఈ మాటలు చెబుతున్నట్లు తెలిపారు. శాసన మండలిలో ఆమె మాట్లాడుతూ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. పార్టీ, ప్రభుత్వంలో జరిగిన అవినీతిని ప్రశ్నించా. అమరువీరుల స్తూపం మొదలు కలెక్టరేట్ల వరకు అన్ని నిర్మాణాల్లోనూ అవినీతి జరిగింది. ఒక్క వర్షానికే సిద్దిపేటలో కలెక్టరేట్ కొట్టుకుపోయింది. తెలంగాణ ఉద్యమకారులకు పించను ఇవ్వాలని పార్టీలో కోరాను. అమరవీరులను బీఆర్ఎస్ ఎప్పుడూ గుర్తించలేదు. నీళ్లు, నిధులు, నియామకాలనూ పట్టించుకోలేదు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీని తెరిపించాలని ఎన్నోసార్లు అడిగాను. ఆ పరిశ్రమ తెరిపించలేకపోవడం నాకు అవమానకరం. కేసీఆర్‌ను అడిగే ధైర్యం నాకే ఉందని ఎన్నో విషయాలు అడిగా. కాళేశ్వరం విషయంలో ఆయనపై వచ్చిన ఆరోపణలపై పార్టీలో ఉన్న ఒక్క పెద్ద నాయకుడు కూడా మాట్లాడలేదు. అందుకే ప్రెస్‌మీట్ పెట్టి బలంగా మాట్లాడాను. అవినీతిపరుల పేరు చెప్పాను'అని కవిత అన్నారు. ఈ క్రమంలో కవిత కీలక ప్రకటన చేశారు. రాష్ట్రంలో కొత్త రాజకీయ వేదిక రాబోతోందని చెప్పారు. రాజకీయ పార్టీగా తెలంగాణ జాగృతి మారుతుందని ఆమె ప్రకటించారు. 'ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారింది. రాష్ట్రంలో ఓ కొత్త రాజకీయ వేదిక రాబోతోంది. విద్యార్థులు, నిరుద్యోగులు, అన్నివర్గాల కోసం పనిచేస్తా. అవమానభారంతో పుట్టింటి నుంచి అన్ని బంధనాలు తెంచుకుని మీకోసం వస్తున్నా.. ఆశీర్వదించండి. తెలంగాణ జాగృతి.. రాజకీయ పార్టీగా మారుతుంది. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తాం. కచ్చితంగా గొప్ప రాజకీయ శక్తిగా ఎదుగుతా. వ్యక్తిగా సభ నుంచి వెళ్తున్నా.. రాజకీయ శక్తిగా తిరిగివస్తా' అని కవిత వ్యాఖ్యానించారు.

# ఓఎన్జీసీ పైపులైన్‌లో గ్యాస్ లీక్

మొదటి పేజీ తరువాయి

ఓఎన్జీసీ టెక్నికల్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే పని మొదలు పెట్టారు. మలికిపురం మండలంలో గ్యాస్ లీకేజ్ విషయంపై మంత్రి సుభాష్ ఆరా తీశారు. జిల్లా కలెక్టర్, కంపెనీ ప్రతినిధులతో మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా వెంటనే మంటలను అదుపు చేయాలని ఆదేశించారు. గత ఏడాది ఆగస్టులోనూ ఇదే గ్రామంలో ఓఎన్జీసీ గ్యాస్ పైప్ లీక్ అయ్యింది. ఇక్కడ తరుచూ గ్యాస్ లీక్ అవుతున్న సంఘటనలు జరుగుతుండడంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటికైనా దీని వల్ల తీవ్ర ప్రమాదం జరగొచ్చని, తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలని.. లేదంటే గ్రామ ప్రజల ప్రాణాలకు ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్యాస్ లీక్ ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. జిల్లా కలెక్టర్, ఎస్పీలతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. గ్రామస్థులను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని జిల్లా కలెక్టర్‌కి ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం ఓఎన్‌జీసీ సిబ్బంది ౖ÷ర్ ఇంజన్లతో మంటలు కంట్రోల్ చేస్తున్నారు.



## గ్యాస్ లీక్ ఘటనపై చంద్రబాబు ఆరా

### తక్షణ చర్యలకు అధికారులకు ఆదేశం

**అమరావతి :** అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గం మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ డ్రిల్ సైట్ నుంచి గ్యాస్ లీకేజీపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆరా తీశారు. ఈ విషయంపై మంత్రులు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, అధికారులతో ముఖ్యమంత్రి మాట్లాడారు. తాము ఇప్పటికే లీకేజీ ఘటనపై స్థానిక అధికారులతో మాట్లాడామని.. సహాయ చర్యలను ముమ్మరం చేయాలని సూచించినట్లు సీఎంకు మంత్రులు వివరించారు. గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చూడాలని... సురక్షిత ప్రాంతాలకు తరలించాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మంటలను వెంటనే అదుపులోకి తెచ్చేలా చూడాలన్నారు. జిల్లా అధికారులు, ఓఎన్జీసీ ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని మంత్రులకు, అధికారులకు సీఎం సూచించారు. పరిస్థితిపై తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని అధికారులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. కాగా.. అంబేద్కర్ కోనసీమ జిల్లా మలికిపురం మండలం ఇరుసుమండలో ఓఎన్జీసీ గ్యాస్ లీకేజ్ అవడంతో పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. విషయం తెలిసిన వెంటనే జిల్లా కలెక్టర్ డా.ఆర్.మహేశ్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకుని ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. పరిస్థితిపై అధికారులతో కలిసి సమీక్ష జరిపారు. భద్రతా చర్యలపై అధికారులకు ఆదేశాలు జారీ చేసిన కలెక్టర్.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచనలు చేశారు.

# తెలంగాణలో విద్యావ్యవస్థ చిన్నాభిన్నం

### ఏబీవీపీ మహాసభల్లో బండి సంజయ్




**హైదరాబాద్, జనవరి 5:** బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో, కాంగ్రెస్ రెండేళ్ల పాలన ఫలితంగా తెలంగాణలో ప్రభుత్వ విద్యా వ్యవస్థ చిన్నాభిన్నమైందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పాలనలో 6 వేల స్కూల్స్ మూసివేస్తే కాంగ్రెస్ పాలనలో వాటిని తెరవకపోగా ఒక్క ఏడాదిలోనే 1500 స్కూల్స్ మూసివేశారని చెప్పారు. ప్రతి విద్యార్థికి 5 లక్షల భరోసా కార్డు ఇస్తామని గాలికొదిలేశారని, ఫీజు రీయంబర్స్ మెంట్ రాక కాలేజీలు మూతపడుతున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫీజు రీయంబర్స్ మెంట్ కోసం తాము మద్దతిచ్చినా కొన్ని కాలేజీ యాజమాన్యాలు మాత్రం ప్రభుత్వానికి భయపడి రాజీ పడుతున్నాయన్నారు. ఫీజు రీయంబర్స్ మెంట్ విషయంలో విద్యార్థులను ఇబ్బంది పెడితే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. రాష్ట్రంలో విద్యా సమస్యలపై ఏబీవీపీ చేస్తున్న ఉద్యమాలు ఉధ్రుతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ శంషాబాద్ లోని ఎస్సాస్సార్ కన్వెన్షన్ లో సోమవారం ఏబీవీపీ 44వ రాష్ట్ర మహాసభలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ హాజరయ్యారు. ఈ సభలకు రాష్ట్ర విద్యార్థి పరిషత్ అధ్యక్షులు హెచ్ సీయూ ప్రొఫెసర్ రావుల క్రిష్ణ, కార్యదర్శి రాంబాబు, కర్నె రామచందర్, గీతాసింగ్, భీమనపల్లి శ్రీకాంత్ హాజరైన ఈ కార్యక్రమంలో నల్గొండ జిల్లా పానగల్ కు చెందిన సామాజిక కార్యకర్త, హెచ్ఐవీ బాధితులకు, వారి పిల్లలకు అనేక రకాలుగా సేవలందిస్తున్న భీమనపల్లి శ్రీకాంత్ కు 'జనమంచి గౌరీశంకర్ జీ యువ పురస్కార్ ను' కేంద్ర మంత్రి అందజేశారు. అనంతరం మహాసభలను ఉద్దేశించి బండి సంజయ్ ప్రసంగం చేశారు.



# నిలదీస్తామని పారిపోయారు

## చర్చ పెడితే తోకముడిచారు

### బీఆర్ఎస్ గైర్హాజరుపై మండిపడ్డ భట్టి, శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జనవరి 5:** ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని బీఆర్ఎస్ నాయకులు ఎందుకు అసెంబ్లీ నుంచి జారుకున్నారని శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ప్రశ్నించారు. ప్రభుత్వాన్ని నిలదీస్తామని బీరాలు పలికిన ఎమ్మెల్యేలు.. ఇప్పుడు సభ నుంచి తోకముడిచారని ఎద్దేవా చేశారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సభాపతిని అవమానపరిచేలా వ్యవహరించిన బీఆర్ఎస్ సభ్యులపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు విజ్ఞప్తి చేశారు. బీఏసీ సమావేశంలో యక్ష ప్రశ్నలు వేసిన ఆ పార్టీ నాయకులు.. ఇప్పుడు అసలు కనిపించట్లేదన్నారు. "శాసన సభలో ముఖ్యమైన అంశాలపై చర్చ జరిగే సమయంలో ప్రధాన ప్రతిపక్ష సభ్యులు గైర్హాజరు కావడం సరికాదు. వాస్తవాలను ప్రజల ముందు ఉంచేందుకే ప్రభుత్వం సభలో కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఏర్పాటు చేసింది. దీనిపై అభ్యంతరాలు ఉంటే సభలో చెప్పాలి కానీ, బయట చెప్పడం సమంజసం కాదు'అని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. ఇకపోతే బీఏసీలో అన్ని అంశాలపై చర్చించాలని భారత రాష్ట్ర సమితి పట్టుబట్టిందని, వారి కోరిక మేరకు అన్ని అంశాలపై చర్చ పెడుతున్నట్లు తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. అయితే, పాలమూరు – రంగారెడ్డిపై చర్చ పెడితే బీఆర్ఎస్ నాయకులు అసెంబ్లీ భయపడిపోయారని భట్టి విమర్శించారు. ఇబ్బంది అయిన రోజున వాకౌట్ చేశారంటే ఫర్వాలేదు కానీ.. మిగతా రోజులు ఎందుకు సభకు రాలేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకంపై చర్చ బీఆర్ఎస్‌కు ముఖ్యం కాదా? అని ఎద్దేవా చేశారు. సభ ఎన్ని రోజులు నడపాలనేది స్పీకర్ పరిధిలోని అంశమని తెలిపారు. బీఏసీకి చెందిన ఏ నిర్ణయమైనా స్పీకర్ పరిధిలోనే ఉంటుందన్నారు. మండలిలో ఎమ్మెల్సీ కవిత భావోద్వేగానికి లోనైంది నిజమేనని, ఆమె ఏం మాట్లాడారో రికార్డు అయ్యాయని తెలిపారు.

# బంగ్లా ఘటనలతో క్రికెట్‌కు ముడిపెట్టవద్దు

## అలా అయినే హసీనాను వెనక్కి పంపండి

### ఎంఐఎం అధినేత ఓవైసీ డిమాండ్



**హైదరాబాద్, జనవరి 5:** బంగ్లాదేశ్‌లో హిందువులపై మారణకాండలు జరుగుతున్న నేపథ్యంలో బీసీసీఐ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. కోల్‌కతా నైట్ రైడర్స్ టీమ్ నుంచి ముస్తాఫిజుర్ రెహ్మాన్‌ను రిలీవ్ చేయాలని దాని సహ యజమాని బాలీవుడ్ స్టార్ షారుఖ్ ఖాన్‌కు ఆదేశాలు జారీ చేసింది. బీసీసీఐ తీసుకున్న ఈ నిర్ణయాన్ని కొంతమంది రాజకీయ నాయకులు తప్పుబడుతున్నారు. కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ రాజకీయాలను, క్రీడలను కలపొద్దని హితవు పలికారు. ఇప్పుడు ఎమ్ఐఎమ్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ.. రెహ్మాన్‌కు మద్దతుగా నిలిచారు. అసదుద్దీన్ ఓవైసీ మాట్లాడుతూ.. 'పహల్గామ్ దాడి తర్వాత మనం పాకిస్థాన్‌తో ఏషియా కప్ క్రికెట్ ఆడాము. మీరు బంగ్లాదేశ్ పేసర్‌ను వెనక్కు పంపించేశారు. ఓ బంగ్లాదేశీ మహిళ ఇండియాలో నివసిస్తోంది. ఆమెను కూడా వెనక్కు పంపండి. ఎందుకు ఆమెను ఇండియాలోనే నిలిపి వేశారు? బంగ్లాదేశ్‌లో స్థిరత్వం ఇండియాకు ముఖ్యం. చైనా, పాకిస్థాన్ బంగ్లాదేశ్‌లో యాక్టీవ్‌గా ఉన్నాయి. మనం దాని గురించి కూడా బాగా ఆలోచించాలి' అని అన్నారు. కాగా, బంగ్లాదేశ్‌లో 2024 జులై, ఆగస్టు నెలల్లో జరిగిన మారణహోమానికి కారణం అప్పటి ప్రధాని షేక్ హసీనానేనంటూ ఆమెను ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రిబ్యునల్–1 దోషిగా తేల్చింది. హసీనాకు మరణ శిక్ష విధించింది. హసీనాకు మరణ శిక్ష వేయడాన్ని ఆమె కుటుంబసభ్యులు తీవ్రంగా తప్పుబట్టారు. రాజకీయ కుట్రలో భాగంగానే ఇంతకు తెగించారని మండిపడ్డారు. తన తల్లి ఇండియాలో క్షేమంగా ఉంటుందని ఆమె కుమారుడు సజీబ్ వాజెద్ జోయ్ స్పష్టం చేశాడు.

# కవిత ఆరోపణలపై చర్యలు తీసుకోవాలి

### టీబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు



**హైదరాబాద్, జనవరి 5 :** కల్వకుంట్ల కవిత పార్టీ స్థాపించే అంశం ఆమె వ్యక్తిగతమని టీబీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు మాట్లాడుతూ.. రాజకీయ పార్టీ పెట్టే స్వేచ్ఛ అందరికీ ఉంటుందని పేర్కొన్నారు. బీఆర్ఎస్, హరీష్‌రావు, కేటీఆర్‌పై కవిత ఆరోపణల ఆధారంగా ఎందుకు చర్యలు తీసుకోవట్లేదంటూ సీఎం రేవంత్ రెడ్డిని ఆయన సూటిగా ప్రశ్నించారు. అందుకు సంబంధించిన ఆధారాలు ఇవ్వడానికి కవిత సిద్ధంగా ఉన్నా.. చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య అంతర్గత ఒప్పందం కుదిరిందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్‌ను కాపాడుతోంది.. సీఎం రేవంత్‌రెడ్డేనని బీజేపీ చీఫ్ రాంచందర్ రావు ఆరోపించారు.



## సంపాదకీయం

# సవాళ్లతో ఎంతకాలమీ మోసాలు!

ప్రభుత్వాలు నడపడమంటే సవాళ్లు విసురుకోవడంలా ఉంది. కృష్ణా, గోదావరి జలాలపై తెలంగాణలో రాజకీయం తారాస్థాయికి చేరింది. అసెంబ్లీలో ప్రభుత్వం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తే..దానిని బహిష్కరించి, అసెంబ్లీకి రాకుండాపోయిన బీఆర్ఎస్ ఆదివారం ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఎవరి కోసం అన్నది చెప్పాలి. అసెంబ్లీలో చర్చించాల్సిన విషయంపై పార్టీ ఆఫీసులో కూర్చుని కాకమ్మ కబుర్లు చెప్పడం ఎవరిని మోసం చేయడానికి అన్నదే ప్రశ్న. అదే విషయం అసెంబ్లీలో ఎందుకు చెప్పలేక పోయారు. గత పదేళ్లలో చేసిన దుర్మార్గాలను కప్పిపుచ్చి, తెలంగాణ ప్రజలక చేసిన ద్రోహాన్ని మరచి పోయి, తెలంగాణను దోచుకుని అప్పులకుప్ప చేసిన బిఆర్ఎస్ ముందు.. పదేళ్ల పాపాలపై చర్చించాలి. ప్రజలకు సమాధానం చెప్పాలి. తప్పులు చేయడం, అప్పు లు చేయడం సవాళ్లు విసురుకోవడం అన్నది పరిపాటిగా మారింది. ఇది కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీ వ్యవహారం కాదు. ఇది తెలంగాణ ప్రజల వ్యవహారం. ఇరు పార్టీలు సవాళ్లతో సాగడం వల్ల నష్టపోయేది ప్రజలు తప్ప వీరు కాదని గుర్తించాలి. ఉచిత పథకాలు, సంక్షేమం పేరుతో ఖజానాను లూటీ చేయడంలో ఇద్దరూ పోటీ పడ్డారు. అప్పుడు బిఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ పోటీ పడుతూనే ఉంది. రాష్ట్రంలో కనీసం కొత్తగా రోడ్లు లేకున్నా దెబ్బతిన్న రోడ్డు వేయకుండా చోద్యం చూస్తున్నారు. కాళేశ్వరం, దరణి, ఫోన్ ట్యాపింట్ కేసుల్లో రెండేళ్లు గడిచినా గుండుసూది మొనంత కూడా ముందుకు సాగడం లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఆర్థిక పరిస్థితిపై అవగాహన లేకుండా హామీలు ఇచ్చి, ఇప్పుడు ఆ హామీలను అమలు చేయలేక దిక్కులు చూస్తోంది. దీంతో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై విరుచుకుపడుతున్నారు. అయితే, ఈ విషయంలో ఆ పార్టీని తప్పు పట్టాల్సింది కూడా లేదు. నాడు కేసీఆర్ అయినా, నేడు రేవంత్ రెడ్డి అయినా తమ సొంత ఆస్తులు అమ్మి పథకాలను అమలు చేయడం లేదు. అందుకే హామాలపైనా సవాళ్లు విసురుతున్నారు. ఈ ఇరువురు కూడా అప్పులు చేసి పథకాలను అమలు చేస్తున్న తీరు దారుణం కాక మరోటికాదు. జీతాలకు కూడా సక్రమంగా లేని దుస్థితికి తెలంగాణను తీసుకుని వచ్చారు.. అందుకే ప్రజలు కూడా గత కొన్నేళ్లుగా అమలవుతున్న పథకాలను తమ హక్కుగా భావిస్తున్నారు. ఉచిత పథకాలకు ప్రజలు బానిసలు కావడంతో వీరి ఆటలు సాగుతున్నాయి. అధికారం నిలబెట్టుకోవడమే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రజలను బురిడీ కొట్టిస్తున్నారు. ఎన్నికల రేసులో వెనుకబడి పోకూడదని రాజకీయ పార్టీలు పథకాల ప్రకటనలో పోటీ పడుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఇది చూడవచ్చు. అప్పుల కారణంగా అవసరమైన మౌలిక వసతులు ఏమాత్రం మెరుగుపడ్డం లేదు. రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. తెలంగాణకు అయినా, ఆంధ్రప్రదేశ్‌కు అయినా ఇంతకన్నా తలవంపు మరోటి ఉండదు. ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మాణాలకు నిధులు ఉండవు. సంక్షేమ వసతి గృహాల మెస్ బిల్లులు కూడా సకాలంలో చెల్లించరు. దీంతో ఆహార నాణ్యత లోపిస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో సిబ్బంది కొరత ఉండనే ఉంది. అత్యవసరమైన మందులు ఉండవు. ఇలా చెప్పుకొంటూ పోతే లెక్కలేదు. ఇవన్నీ ఇప్పుడు అధికారం కోల్పోయిన బిఆర్ఎస్, వైకాపాలకు విమర్శల అస్త్రాలకుగా మారాయి. తాము అధికారంలో ఉన్నప్పుడు ఈ రంగాలను ఉద్దరించినట్లు మాట్లాడుతున్నారు. ప్రభుత్వం ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలు కూడా పేరుకుపోతున్నాయి. పదవీ విరమణ సందర్భంగా ఉద్యోగులకు చెల్లించాల్సిన మొత్తాలను చెల్లించలేక పదవీ విరమణ వయసు పెంచుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఇవే పరిస్థితులు దాపురించాయి. సూపర్ సిక్స్ అమలు చేయడం లేదని కూటమిపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి ఒత్తిడి తెస్తున్నారు. నిన్నటిదాకా జగన్‌రెడ్డి అప్పులు చేయడం, తాకట్టు పెట్టడం చేశారు. ఇప్పుడు చంద్రబాబు అదే పని చేస్తారు. అంతిమంగా మునిగిపోయేది రాష్ట్రమే. చంద్రబాబు కంపెనీలుగానీ, జగన్‌రెడ్డి కంపెనీలుగానీ ఆ నష్టాలను భరించవు. ఈ ఇద్దరు తమ వ్యాపారాల నుంచి ప్రజలకు పంచరు. రెండు రాష్ట్రాల్లోనూ ప్రభుత్వాలు చెల్లించాల్సిన బకాయిలు లక్షల కోట్లకు చేరాయి. చిన్నా చితకా పనులు చేసిన వారు సకాలంలో బిల్లులు పొందలేక నలిగిపోతున్నారు. ఇప్పుడు బిల్లులు చెల్లించడానికి కూడా కమిషన్లు తీసుకోవడం ప్రారంభించారన్న విమర్శలు వస్తున్నాయి. ఒకరిద్దరు మంత్రులు అదేపనిగా వసూళ్ల దందాకు తెరలేపారని కేంద్రమంత్రి బండి సంజయ్ ఇటీవల ఆరోపించారు. వారిపై నిఘా పెట్టామన్నారు. సంక్షేమం పేరిట పంపకాలకు పాల్పడుతూ మరో వైపు అవినీతికి గేట్లు ఎత్తుతున్నారు. ఈ అవినీతి సొమ్ములో కొంత మొత్తాన్ని ఎన్నికల సమయంలో ప్రజలకు పంచుతున్నారు. రైతులకు ఉచిత విద్యుత్, ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు అమలు చేసినా ఫలితం దక్కడం లేదు. అన్ని సంక్షేమ పథకాలు అమలు చేసినా, బటన్లు నొక్కినా 2024 ఎన్నికల్లో జగన్‌రెడ్డికి 11 సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణలో కేసీఆర్‌ను గానీ, ఆంధ్రప్రదేశ్‌లో జగన్‌రెడ్డిని గానీ సంక్షేమ పథకాలు కాపాడలేదు. ఈ వాస్తవాన్ని విస్మరించిన ఆంధ్రప్రదేశ్ ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2024లో 'సూపర్ సిక్స్' పేరిట సరికొత్త హామీలు ఇచ్చారు. వృద్ధాప్య పెన్షన్ల మొత్తాన్ని ఏకంగా నాలుగు వేలకు పెంచారు. వాటిని పంచడానికి హెలికాప్టర్లు వేసుకుని ఊరేగుతున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించగా, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తోందని బీఆర్ఎస్ విమర్శిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో కూడా నాడు జగన్మోహన్ రెడ్డి పది లక్షల కోట్లు అప్పులు చేశారని తెలుగుదేశం పార్టీ విమర్శించగా, ఇప్పుడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అప్పులు చూసి జగన్ అండ్ కో గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వాలకు ఆదాయం ఇబ్బడి ముబ్బడిగా పెరిగి నిధులు మూలుగుతుంటే ప్రజలకు పంచి పెట్టడంలో తప్పు లేదు. కానీ అప్పులు చేసి పథకాలు అమలు చేయడం, చేయని వాటిపై సవాళ్లు విసరడం మామూలయ్యింది. సవాళ్ల ప్రజలను మభ్య పెట్టలేరు. ప్రజలు చైతన్యం అయితే తప్ప ఈ దుర్మార్గాల నుంచి బయటపడలేము.

# అమెరికా దాడి.. 40మంది పౌరుల మృతి

- విద్యుత్ వ్యవస్థ దెబ్బతినడంతో పలుచోట్ల అంధకారం
- వెనెజువెలా అధికార వర్గాలు వెల్లడి





**వాషింగ్టన్, జనవరి 5:** వెనెజువెలాపై అమెరికా సైన్యం చేసిన దాడిలో కనీసం 40 మంది ప్రాణాలు కోల్పోయినట్లుగా వెనెజువెలాకు చెందిన ఓ సీనియర్ అధికారి వెల్లడించారు. మృతుల్లో సైనికులతో పాటు సాధారణ పౌరులు కూడా ఉన్నారని చెప్పారు. వెనెజువెలాపై భారీ దాడి అనంతరం అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన సతీమణి సిలియా ఫ్లోరెస్‌ను అదుపులోకి తీసుకున్నట్లుగా పేర్కొన్నారు. కాగా, వెనెజువెలాపై చేసిన దాడిలో తమవైపు ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. కేవలం కొద్దిమంది మాత్రమే గాయ పడ్డారని తెలిపారు. ఇది అత్యంత సంక్లిష్టమైన ఆపరేషన్ అని పేర్కొన్నారు. మనవైపు ప్రాణనష్టం లేకుండా ఇంత పెద్ద ఆపరేషన్ పూర్తి కావడం ఆశ్చర్యకరమని వ్యాఖ్యానించారు. ఈ దాడిలో అనేక విమానాలు, హెలికాప్టర్లు, ఫైటర్ జెట్లు పాల్గొన్నాయని వెల్లడించారు. సాధారణంగా చొరబడలేని ప్రాంతాల్లోకి ప్రవేశించి, ఈ క్లిష్టమైన ఆపరేషన్ నిర్వహించామని చెప్పారు. వెనెజువెలా ప్రజలకు స్వేచ్ఛ కల్పించడమే అమెరికా లక్ష్యమని ట్రంప్ స్పష్టం చేశారు. వెనెజువెలా దేశంపై దాడి చేసి అధ్యక్షుడు నికొలస్ మదురో, అతని భార్య సిలియాను అగ్రరాజ్యం అమెరికా బందీగా పట్టుకుని న్యూయార్క్ నగరానికి తీసుకుపోయిన క్రమంలో ఆ దేశ రాజధాని కారకాస్, పొరుగున ఉన్న నగరాల్లో తీవ్ర భయం, ఆందోళన పరిస్థితులు నెలకొన్నాయి. ఆహారం కోసం పెద్దయెత్తున ప్రజలు బారులు తీరారు. పలు చోట్ల అంధకారం అలముకుంది. ప్రజా రవాణా వ్యవస్థ స్తంభించింది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో అన్న భయంతో చాలామంది ఇండ్లకే పరిమితమై పోయారు. చాలా సూపర్‌మార్కెట్లు మూతపడ్డాయి. తెరిచి ఉంచిన చిన్నచిన్న దుకాణాల వద్ద 500-600 మంది బారులు తీరారు. ముఖ్యంగా ముందు జాగ్రత్తగా బ్రెడ్ దుకాణాల వద్ద జనం పెద్దయెత్తున చేరుకున్నారు. అలాగే మందుల షాపుల వద్ద కూడా ప్రజలు ఎక్కువగా కన్పించారు. ఔషధాలతో పాటు అక్కడ అమ్మే కేన్డ్ ఫుడ్‌ను వారు కొనుగోలు చేయడం కన్పించింది. ప్రజలు తమ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల చార్జింగ్ కోసం ఎగబడ్డారు. కాగా, అక్కడ స్వల్ప సంఖ్యలో ఉన్న భారతీయ కమ్యూనిటీ కోసం భారత ఎంబసీ ఒక వాట్సాప్ గ్రూప్‌ను సృష్టించింది. దాని ద్వారా భారతీయులకు ఎప్పటికప్పుడు సూచనలు, ఆదేశాలు అందజేస్తున్నది. మెరికా దాడుల్లో పవర్ గ్రిడ్స్ దెబ్బ తినడంతో పలు ప్రాంతాల్లో విద్యుత్తు లేక అంధకారం అలముకుంది. కమ్యూనికేషన్ వ్యవస్థకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. అమెరికా దళాలు కారకాస్ ఎయిర్‌పోర్టుపై కూడా దాడి చేయడంతో రాజధాని నుంచి 100 కి.మీ వరకు ఎలాంటి వైమానిక ప్రయాణ సౌకర్యం లేకుండా పోయిందని భారత సంతతికి చెందిన సునీల్ మల్హోత్రా అనే స్థానికుడు తెలిపారు. ప్రజలు ఆహారం కోసం అల్లాడుతున్నారని, షాపుల వద్ద పెద్దపెద్ద క్యూలు ఏర్పడ్డాయని, పౌరుల్లో భయం, అనిశ్చితి, ఆందోళన నెలకొందని చెప్పారు. ఫ్యూర్టే ట్యూయనా వద్ద అధిక నష్టం వాటిల్లిందన్నారు. కాగా, విద్యుత్తు స్తంభాల నుంచి అక్రమంగా వైర్లను లాగి కొందరు ఫోన్లకు చార్జింగ్ చేసే వ్యాపారం ప్రారంభించారు. ప్రస్తుత పరిస్థితులపై స్థానిక సంస్థలు కానీ, ప్రభుత్వం కానీ ప్రజలకు ఎలాంటి ప్రకటనలు, సూచనలు చేయలేదు. అధికారులు కూడా పూర్తి అనిశ్చితి పరిస్థితుల్లో ఉన్నారు. అయితే అక్కడక్కడ పోలీసులు పరిస్థితులను నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో పౌరులు బయటకు రావడానికే భయపడుతున్నారని మల్హోత్రా తెలిపారు.

## వెనెజువెలాపై అమెరికా బలప్రయోగం

### తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన చైనా

**బీజింగ్, జనవరి 5:** వెనెజువెలా అధ్యక్షుడు నికోలస్ మదురో, ఆయన భార్యను అమెరికా నిర్బంధించడంపై చైనా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇలాంటి ఏకపక్ష వేధింపులు ఈ మధ్యకాలంలో ఎక్కువయ్యాయని అగ్ర రాజ్యంపై మండిపడింది. ప్రపంచ పోలీస్ లేదా అంతర్జాతీయ న్యాయమూర్తిగా వ్యవహరించేందుకు ఏ దేశానికీ అధికారం లేదని పేర్కొంది. ప్రస్తుతం అంతర్జాతీయంగా పరిస్థితులు అస్థిరంగా ఉన్నాయి. వెనెజువెలా పరిణామాలపై అంతర్జాతీయ సమాజం దృష్టిసారించింది. బలప్రయోగాన్ని చైనా ఎప్పుడూ వ్యతిరేకిస్తుంది. ఓ దేశం తమ ఇష్టాలను ఇంకో దేశంపై బలవంతంగా రుద్దకూడదు. అంతర్జాతీయ న్యాయమూర్తినంటూ తమను తాము సమర్థించుకోడం సరికాదు. అంతర్జాతీయ చట్టాలు దేశాల సార్వభౌమత్వాన్ని రక్షించాలి. అన్నిదేశాల సార్వభౌమత్వాన్ని గౌరవించినప్పుడే ప్రపంచ శాంతి సాధ్యమవుతుంది. అని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ వెల్లడించారు. గత రెండు దశాబ్దాలుగా వెనెజువెలాకు అతి పెద్ద చమురు కొనుగోలుదారుగా చైనా ఉంది.

# రూ.1, 37,400

### మళ్లీ పెరిగిన బంగారం ధరలు

### వెండి కిలో మరో ఆరువేలు పెరుగుదల

**హైదరాబాద్, జనవరి 5:** నాలుగు, ఐదు రోజులుగా కాస్త స్థిరంగా కొనసాగుతున్న బంగారం, వెండి ధరలు సోమవారం మళ్లీ దూ కుడు పెంచాయి. ఒక్కసారిగా భారీ పెరుగుదల నమోదు చేశాయి. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల నేపథ్యంలో పెట్టుబడిదారులు సురక్షిత ఆస్తుల వైపు మొగ్గు చూపుతుండడంతో బంగారం, వెండికి డిమాండ్ కొనసాగుతోంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి క్షీణిస్తుండడం కూడా బంగారం, వెండి ధరల పెరుగుదలకు కారణంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం 11 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర 1,37,400కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే 1,580 రూపాయలు పెరిగింది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,25,950కి చేరింది. నిన్నటితో పోల్చుకుంటే రూ.1,450 పెరిగింది. ఇక, దేశ రాజధాని ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ. 1,37,550కి చేరుకోగా, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,26,100కి చేరుకుంది. మరోవైపు వెండి కూడా జోరు చూపిస్తోంది. గతం రోజుతో పోల్చుకుంటే కిలోకు ఏకంగా రూ.6 వేలు పెరిగింది. హైదరాబాద్‌లో ప్రస్తుతం కిలో వెండి ధర రూ. 2.65 లక్షలకు చేరుకుంది. దేశ రాజధాని ఢిల్లీలో కిలో వెండి ధర రూ. 2.47 లక్షలకు చేరింది. బంగారం, వెండిలో లాభాల స్వీకరణ జరిగి ధరలు తగ్గొచ్చు అనే అంచనాలు వినిపించిన నేపథ్యంలో ఇలా పెరగడం చాలా మంది నిపుణులకు షాకిస్తోంది.

# హిందూ మహిళపై లైంగిక దాడి

- చెట్టుకు కట్టేసి, జుట్టు కత్తిరించి దారుణం..
- వీడియో చిత్రీకరణ.. సోషల్‌మీడియాలో అప్‌లోడ్
- బంగ్లాదేశ్‌లో మరో ఘటన



**ఢిల్లీ, జనవరి 5:** బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై దాడులు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇప్పటికే పలువురు హిందువులను కొట్టి చంపిన ఉదంతాలు మరువక ముందే తాజాగా ఓ హిందూ మహిళపై సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఘోరం వెలుగులోకి వచ్చింది. జాతీయ మీడియాలో వచ్చిన కథనం ప్రకారం బంగ్లాదేశ్‌లోని జ్హైనైదా జిల్లా కలిగంజ్ ప్రాంతంలో 40 ఏళ్ల హిందూ వితంతు మహిళపై ఇద్దరు స్థానికులు శనివారం లైంగికదాడికి పాల్పడ్డారు. అంతటితో ఆగకుండా ఆమెను చెట్టుకు కట్టేసి, జుట్టును కత్తిరించి, తీవ్రంగా హింసించారు. ఈ దారుణాన్ని వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మీడియాలో వెలువడిన కథనాల ప్రకారం.. బాధితురాలు కాలిగంజ్ మున్సిపాలిటీలోని వార్డు నంబర్ 7లో షాహిన్, అతని సోదరుడి నుంచి కొంత భూమిని, ఇంటిని కొనుగోలు చేసింది. ఈ కొనుగోలు తర్వాత షాహిన్ ఆమెకు అసభ్యకరమైన ప్రతిపాదనలు చేస్తూ వేధింపులకు గురి చేస్తున్నాట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. అతడి వేధింపులను మౌనంగా భరిస్తూ అతడి ప్రతిపాదనను నిరాకరించానని అయితే గత శనివారం సాయంత్రం తన ఇంటికి ఇద్దరు బంధువులు వచ్చిన సమయంలో షాహిన్ అతడి సహచరుడు హసన్ ఇంట్లోకి ప్రవేశించి తనపై అత్యాచారానికి ఒడిగట్టారని పేర్కొంది. ఆ తర్వాత ఆమె నుంచి రూ. 37 వేలు డిమాండ్ చేశారని డబ్బు ఇవ్వడానికి నిరాకరించడంతో ఆమె బంధువులను దాడి చేసి తరిమికొట్టారని ఫిర్యాదు చేసింది. వారి చర్యలతో కేకలు వేయడంతో తనను చెట్టుకు కట్టేసి ఆమె జుట్టును కత్తిరించి చిత్రహింసలకు గురి చేశారని పేర్కొంది. ఈ ఘటనలో స్పృహకోల్పోయిన బాధితురాలిని స్థానికులు రక్షించి జునైదా సదర్ ఆసుపత్రిలో చేర్చారు. కాగా ఆమెపై దాడి చేసిన దురాగతానంతటిని నిందితులు వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్టు చేసినట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది.

# మరోమారు భారత్‌పై ట్రంప్ అక్కసు

### మరిన్ని టారిఫ్‌లు విధిస్తానంటూ హెచ్చరికలు




**వాషింగ్టన్, జనవరి 5:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి భారత్‌ను టార్గెట్ చేశారు. రష్యాతో భారత్ స్నేహంగా ఉండటాన్ని.. మరీ ముఖ్యంగా చమురు దిగుమతి చేసుకోవటాన్ని ట్రంప్ జీర్ణించుకోలేకపోతున్నారు. ఎలాగైనా రష్యా నుంచి భారత్‌ను దూరం చేయాలని భావిస్తున్నారు. అధిక సుంకాలు విధిస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నారు. ఇప్పటికే భారత్‌నుంచి అమెరికాకు దిగుమతి అవుతున్న చాలా వస్తువులపై 50 శాతం టారిఫ్‌లు విధించారు. భారత వ్యాపారాన్ని దెబ్బ తీసేలా దారుణంగా వ్యవహరిస్తున్నారు. మరోసారి భారత్, రష్యా వాణిజ్య ఒప్పందాలపై ఆయన ఫైర్ అయ్యారు. మేరకు వైట్ హౌస్.. అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు సంబంధించిన ఆడియోను సోమవారం మీడియాకు విడుదల చేసింది. ఆ ఆడియోలో ఏముందంటే..' అమెరికాతో భారత్ వాణిజ్య లావాదేవీలు కొనసాగిస్తోంది. భారత్ వాణిజ్య లావాదేవీలపై త్వరలో సుంకాలు పెంచుతా. భారత్ నన్ను సంతోషపెట్టాలని కోరుకుంటోంది. ప్రధాని మోదీ చాలా మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ప్రధాని మోదీకి తెలుసు. నన్ను సంతోషపెట్టడం భారత్‌కు చాలా ముఖ్యం' అని చెప్పుకొచ్చారు. కాగా, గతంలో భారత్‌పై అమెరికా 50 శాతం టారిఫ్‌లు విధించింది. ఇందులో 25 శాతం టారిఫ్‌లు కేవలం రష్యాతో ఆయిల్ దిగుమతి చేసుకుంటున్న కారణంగా విధించింది. డొనాల్డ్ ట్రంప్ చెబుతున్న దాని ప్రకారం అమెరికా అత్యధిక టారిఫ్‌లు వేసిన దేశాల్లో భారత్ ముందు వరుసలో ఉంది. రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటున్న నేపథ్యంలో బైలెటెరల్ ట్రేడ్ అగ్రిమెంట్స్ (బీటీఏ) చేసుకోవాలని ఇండియా చూస్తోంది. అతి త్వరలో ఇందుకు సంబంధించిన అప్‌డేట్ వచ్చే అవకాశం ఉంది. భారత్‌పై మరిన్ని టారిఫ్‌లు విధించనున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. రష్యా నుండి భారత్ చమురు కొనుగోళ్లు కొనసాగిస్తుండటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ.. భారత్‌పై టారిఫ్‌లను మరింత పెంచనున్నట్లు తెలిపారు. ఎ÷-లోరిడా నుండి వాషింగ్టన్ డిసికి వెళ్లే మార్గంలో ఎయిర్‌ఫోర్స్ వన్ విమానంలో ఆదివారం మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ప్రధాని మోడీ మంచి వ్యక్తి. నేను సంతోషంగా లేనని ఆయనకు తెలుసు. నన్ను సంతోషపెట్టడం ముఖ్యం. రష్యాతో వ్యాపారం కొనసాగిస్తే.. మేము మరిన్ని టారిఫ్‌లను విధిస్తాం' అని పేర్కొన్నారు. ట్రంప్ భారత్‌పై విధించిన టారిఫ్‌ల కారణంగానే భారత్ ఇప్పుడు రష్యన్ చమురు కొనుగోళ్లను గణనీయంగా తగ్గించిందని అమెరికా సెనెటర్ లిండ్సే గ్రాహం పేర్కొన్నారు. ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్‌తో పాటు లిండ్సే గ్రాహం కూడా ఉన్నారు. రష్యన్ చమురు కొనుగోలు చేసే దేశాల దిగుమతులపై 500శాతం టారిఫ్‌లు విధించే టారిఫ్ బిల్లు గురించి గ్రాహం వెల్లడించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించాలంటే, రష్యా భాగస్వామ్యులపై ఒత్తిడి తీసుకురావాలని గ్రాహం పేర్కొన్నారు. ఆంక్షలు రష్యాను తీవ్రంగా దెబ్బతీస్తాయని అన్నారు. రష్యా చమురును కొనుగోలు చేసినందుకే భారత్‌పై అమెరికా 25శాతం సుంకం విధించిందని అన్నారు.

# తెలుగు రాష్ట్రాల మధ్య విభేదాలు సరికాదు

మొదటి పేజీ తరువాయి

ఎస్ఎల్బీసీ, ఎస్ఆర్బీసీ ప్రాజెక్టులు తెచ్చారని ప్రస్తావించారు. సోమవారం గుంటూరు జిల్లాలో జరిగిన తెలుగు మహాసభ లో పాల్గొని ప్రసంగించారు సీఎం చంద్రబాబు. కల్వకుర్తి లిఫ్ట్, ఏఎమ్మార్ ఎత్తిపోతల, నెట్టెంపాడు వంటి ప్రాజెక్టులను తాను పూర్తి చేశానని స్పష్టం చేశారు. కృష్ణా డెల్టా మోడరైజేషన్ పేరుతో నీటిని పొదుపు చేసి... ఆ నీటిని తెలంగాణకు కేటాయించి బీమా లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేశామని వెల్లడించారు. గోదావరి నదిపై గుత్ప, అలీసాగర్, దేవాదుల ఎత్తిపోతల వంటి పథకాలను చేపట్టామని వివరించారు. ఆంధ్ర ప్రాంతంలో చాగల్‌నాడు, పుష్కర, తాటిపూడి వంటి లిఫ్ట్ ప్రాజెక్టులు తీసుకువచ్చామని తెలిపారు. పట్టిసీమ ప్రాజెక్టుతో కృష్ణా డెల్టాకు నీరిచ్చామని అన్నారు. విభజన తర్వాత కేంద్ర ప్రభుత్వం పోలవరానికి ప్రత్యేక నిధులు ఇచ్చిందని వివరించారు, ప్రత్యేక చట్టం రూపొందించిందని స్పష్టం చేశారు సీఎం చంద్రబాబు. గతేడాది సుమారు కృష్ణా, గోదావరి నదుల నుంచి 6,282 టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్లాయని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి నీళ్లు పుష్కలంగా ఉన్నాయని అన్నారు. గోదావరి నీళ్లను తెలంగాణ వాడుకున్నా తాను ఏనాడు అడ్డు చెప్పలేదని స్పష్టం చేశారు. విభజన తర్వాత కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినా అభ్యంతరం చెప్పలేదని అన్నారు. ప్రతి ఏడాది గోదావరి నుంచి సముద్రంలోకి మూడువేల టీఎంసీల నీళ్లు వృథాగా పోతున్నాయని చెప్పుకొచ్చారు. కృష్ణా-గోదావరి నదులు అనుసంధానం జరుగుతుందని వెల్లడించారు. ఏపీలోని నదులన్నింటినీ అనుసంధానించాలని సూచించారు. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు ఉండకూడదని అన్నారు. ఇది రాజకీయ వేదిక కాదు కాబట్టి... అన్ని మాట్లాడటం లేదని అన్నారు..ఐక్యత గురించే తాను మాట్లాడతానని చెప్పుకొచ్చారు. నీటి విషయంలోనైనా, సహకారం విషయంలోనైనా తెలుగువారంతా కలిసి ఉండాలని సీఎం చంద్రబాబు సూచించారు.కాళేశ్వరం ప్రాజెక్ట్ కట్టినప్పుడు తాను అడ్డుపడలేదని అన్నారు. తెలుగు రాష్ట్రాల మధ్య విద్వేషాలు కాదు.. సమైక్యత అవసరమని చెప్పుకొచ్చారు. నీటి విషయంతో పాటు ఇతర అంశాల్లో తెలుగువారు కలిసే ఉండాలని సూచించారు. గంగా-కావేరి కలవాలని.. దేశంలో నీటి సమస్య పూర్తిగా తీరాలని.. అదే తన కోరిక అని చెప్పుకొచ్చారు. గోదావరి-పెన్నా నదుల అనుసంధానం కావాలని అన్నారు. గోదావరి నీటిని తెలంగాణ వాడుకుంటే ఎప్పుడూ అడ్డుచెప్పలేదని వ్యాఖ్యానించారు. కృష్ణా డెల్టా అభివృద్ధి పేరుతో నీటిని తెలంగాణకు అందించామని వివరించారు. ఉమ్మడి రాష్ట్రంలో తన హయాంలో.. తెలంగాణలో ఎన్నో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.




## ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఏపీ కీలక మైలురాయి

### కేంద్రమంత్రి హర్దీపు సింగ్ పరి ట్వీట్‌కు సీఎం చంద్రబాబు రీ ట్వీట్

ఆత్మనిర్భర్ భారత్ దిశగా ఏపీ కీలక మైలురాయి సాధించిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. విశాఖపట్నం రిఫైనరీ ఆధునీకీకరణ ప్రాజెక్టు లో కొత్త రెసిడ్యూ అప్‌గ్రెడేషన్ సదుపాయం అందుబాటులోకి వచ్చిందని పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద మూడు రియాక్టర్లలో ఒకటిగా ఏర్పాటు అయిందని వెల్లడించారు. ప్రాంతీయ ఇంధన అవసరాలకు ఇది సమగ్ర పరిష్కారమని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. సామాజిక, ఆర్థిక అభివృద్ధికి మరింత ఊతమిస్తోందని తెలిపారు. దేశ ఇంధన భద్రత బలోపేతమే లక్ష్యంగా పని చేస్తోందని వివరించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ దూరదృష్టి, నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తూర్పు తీర ప్రాంతం ప్రపంచస్థాయి రి÷ల్ల÷నింగ్ హబ్‌గా అవతరించనుందని పేర్కొన్నారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి పెట్టిన ట్వీట్‌ను రీట్వీట్ పెట్టారు సీఎం చంద్రబాబు. విశాఖపట్నం రి÷నైరీలో రెసిడ్యూ అప్‌గ్రెడేషన్ ఫెసిలిటీ విజయవంతంగా ప్రారంభమైందని కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి వ్యాఖ్యానించారు. దేశ ఇంధన భద్రత దిశగా భారత్ మరో కీలక మైలురాయి సాధించిందని పేర్కొన్నారు. ఆంధప్రదేశ్‌లోని ఈ కీలక మౌలిక వసతి ప్రాజెక్టు ఆత్మనిర్భర్ భారత్‌కు బలమైన అడుగని చెప్పుకొచ్చారు. ఈ మేరకు సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా స్పందించారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, సీఎం నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి నాయకత్వంలో ఈ ప్రాజెక్టు అమలు అయిందని వివరించారు. పూర్తిగా దేశీయ సాంకేతికతతో నిర్మితమైన రెసిడ్యూ అప్‌గ్రెడేషన్ ఫెసిలిటీ అత్యాధునిక ఇంజినీరింగ్ అద్భుతమని హర్దీప్ సింగ్ పూరి చెప్పుకొచ్చారు. ప్రపంచంలోనే అత్యంత భారీ ఇంజినీరింగ్ బ్లాక్స్‌లో ఒకటని వెల్లడించారు. రియాక్టర్ల తయారీ, అసెంబ్లింగ్ పూర్తిగా భారత్‌లోనే జరిగిందని వివరించారు. సంవత్సరానికి 3.55 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో పనిచేస్తుందని తెలిపారు. ఆధునిక రెసిడ్యూ హైడ్రోక్రాకింగ్ టెక్నాలజీ ద్వారా 93 శాతం దిగువ స్థాయి చమురును విలువైన ఉత్పత్తులుగా మారుస్తుందని అన్నారు. ప్రతి బ్యారెల్‌ను పూర్తిస్థాయిలో వినియోగించి దేశ అభివృద్ధికి ఇంధనంగా వినియోగించవచ్చని తెలిపారు. తూర్పు తీరాన్ని ప్రపంచ స్థాయి రిఫైనింగ్ హబ్‌గా నిలబెట్టే కీలక ప్రాజెక్టు ఇదని వెల్లడించారు.

## మారిషస్ అధ్యక్షుడితో సీఎం చంద్రబాబు మర్యాద పూర్వక భేటీ



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్‌తో సోమవారం మర్యాదపూర్వకంగా సమావేశమయ్యారు. గుంటూరులో జరుగుతున్న 3వ ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమం ముగిసిన అనంతరం వీరి భేటీ జరిగింది. ఈ సమావేశంలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు. మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ నేడు ప్రపంచ తెలుగు మహాసభల కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సమావేశంలో ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు.. ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మారిషస్ అధ్యక్షుడికి వివరించారు. అలాగే, మారిషస్‌లో నివసిస్తున్న తెలుగు ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. దీనికి స్పందించిన ధరమ్ బీర్ గోకుల్, గతంలో చంద్రబాబు మారిషస్‌లో పర్యటించిన సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. ప్రపంచ తెలుగు మహాసభలకు హాజరయ్యేందుకే మారిషస్ అధ్యక్షుడు ధరమ్ బీర్ గోకుల్ ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తున్న విషయం తెలిసిందే. ఈ పర్యటనలో భాగంగానే ఆయన ముఖ్యమంత్రితో సమావేశమయ్యారు.

## మాతృభాషే మన శ్వాస కావాలి

మొదటి పేజీ తరువాయి



చదువుకొనే ఉన్నత స్థానాలకు చేరుకున్నారని వెంకయ్యనాయుడు తెలిపారు. రామాయణ కాలంలోనూ తెలుగు భాష ఉందని ఇటీవల కొన్ని ఆధారాలను గుర్తించారని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. 'నన్నయ్య, తిక్కన్న, వేమన, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు, గిడుగు రామ్మూర్తి, ఉన్నవ లక్ష్మీనారాయణ, సురవరం ప్రతాపరెడ్డి, ఎన్టీ రామారావు, రామోజీరావు.. ఇలా చాలా మంది మహనీయులు తెలుగు భాష ఉన్నతి కోసం శ్రమించారు. తెలుగువారు అయ్యుండి తెలుగు మాట్లాడకపోతే ఏదో లోపం ఉన్నట్లే లెక్క. అమ్మ అంటే అంతరాళం నుంచి వస్తుంది. అదే మమ్మీ అంటే నోటి నుంచి మాత్రమే వస్తుంది. మాతృభూమిని, మాతృదేశాన్ని, మాతృమూర్తిని మరచినవారు పరిపూర్ణ మానవుడు కాదు. ఈతరంలో తెలుగు భాష నేర్చుకోవాల్సిన అవసరం లేదని తల్లిదండ్రులు భావిస్తున్నారు. గుడి, బడి, అమ్మ ఒడిలో మాతృభాషనే మాట్లాడాలన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ కూడా మాతృభాషలోనే చదువుకున్నారు. మాతృభాషను మరిచిపోతే శ్వాస పోయినట్టే. తెలుగు భాషను కాపాడుకోవాలంటే తెలుగులో మాట్లాడితే చాలు. తెలుగు భాషాభిమానులు, కవులు, రచయితలు, కళాకారులు చేసిన త్యాగాన్ని గుర్తించాలి. ఇతర దేశాల్లో సాంకేతిక విద్య, ఇతర విద్యా కోర్సులు వారి మాతృభాషలోనే ఉంటున్నాయి. మన దేశంలోనూ ప్రధాని మోదీ మాతృభాషలోనే సాంకేతిక కోర్సులు అందుబాటులోకి తీసుకురానున్నారు. స్థానిక ప్రభుత్వాలు కూడా మాతృభాషలోనే ఉత్తర్వులు ఇవ్వాలి. తెలుగు రాష్ట్రాల్లో పరిపాలనా భాషగా తెలుగు అమలు చేయాలి. న్యాయస్థానాల్లో తెలుగు భాషను అమలు చేస్తే చాలా బాగుంటుందని వెంకయ్య నాయుడు తెలిపారు.

## మాతృభాష పరిరక్షణ మనందరి బాధ్యత

### ఇంగ్లీష్ మోజులో అమ్మభాషను మరవరాదు

### సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ



**గుంటూరు :** మాతృభాష పరిరక్షణ మనందరి బాధ్యత అని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. మన భాషను మనమే కలసి రక్షించుకోవాలన్నారు. ఇందుకోసం దీర్ఘకాల పోరాటం చేయాలని, ఈ ఉద్యమంలో పార్టీలు, స్వచ్ఛంద సంస్థలు కలిసి రావాలని జస్టిస్ ఎన్వీ రమణ పిలుపునిచ్చారు. గుంటూరులో జరుగుతోన్న మూడో ప్రపంచ తెలుగు మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలుగు భాషతో మనకు సామాజిక బంధం, సాంస్కృతిక అనుబంధం ఉంది. ప్రస్తుతం ఆంగ్లభాష మాట్లాడితేనే గొప్ప అనే పరిస్థితి ఉంది. మన సాహిత్యాన్ని మనమే తక్కువ చేసుకుంటున్నాం. సంస్కృతి, చరిత్ర, నాగరికతను మనమే బలోపేతం చేసుకోవాలి. భాష అంతరిస్తే ఆ జాతి అంతరించినట్లేనని భావించాలి. తెలుగును రక్షించుకోవడం మన మౌలిక బాధ్యత, సాంస్కృతిక అవసరం. మన విద్యా విధానం వల్లే తెలుగు భాషకు కష్టాలు వచ్చాయి. మాతృభాష రాకుంటే మన పద్యం, గేయం, సాహిత్యాన్ని ఆస్వాదించలేం. మన సామెతలు, చతురోక్తులు మరిచిపోకూడదు. అభివృద్ధి చెందిన దేశాలన్నీ వారి భాషలోనే పనులు చేసుకుంటున్నాయి. చైనా, రష్యా, జపాన్, జర్మనీని చూసి అందరూ నేర్చుకోవాలి. ఆంగ్ల భాష వల్లే ఉద్యోగాలు వస్తాయన్న అపోహలు వీడాలి. తెలుగులో చదువుకున్న వారు కూడా ఉన్నతస్థితికి వెళ్లారు. పిల్లలకు మాతృభాషను దూరం చేయొద్దని తల్లిదండ్రులను కోరుతున్నా. ఆంగ్ల భాష వినియోగం పెరిగితే మళ్లీ మనం బానిసలమవుతాం అని జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. మన మూలాలను మరచిపోతామని అన్నారు. అమ్మభాష కమ్మదనం గుర్తించి మనమంతా తెలుగును పరిరక్షించుకోవాలన్నారు.

## ఎంపీపీ ఎన్నికల్లో సైతం ప్రజాస్వామ్యం ఖూనీ

### కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం



**అమరావతి :** వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి జగన్, కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సాధారణ ఎంపీపీ ఎన్నికల్లో సైతం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ, ఎన్నికలను బలప్రదర్శన వేదికగా మార్చారని ఆయన తీవ్ర ఆరోపణలు చేశారు. ఉదయగిరి, రాయదుర్గం నియోజకవర్గాల్లో జరిగిన ఎంపీపీ ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న ఘటనలను ఉదాహరిస్తూ, కూటమి ప్రభుత్వ దురహంకారాన్ని, ప్రమాదకర స్వభావాన్ని ఈ పరిణామాలు బట్టబయలు చేస్తున్నాయని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయగిరి నియోజకవర్గంలోని వింజమూరు మండలంలో ఎంపీపీ ఎన్నికలో ఓటు వేసేందుకు వెళుతున్న తమ పార్టీ ఎంపీటీసీలను నడిరోడ్డుపై అడ్డగించి, దాడులకు పాల్పడ్డారని జగన్ ఆరోపించారు. cఈ దాడిలో ఒక మహిళా ఎంపీటీసీ తీవ్రంగా గాయపడ్డారు. ఒక సభ్యుడిని కిడ్నాప్ చేశారు. మరొకరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీటన్నింటి వెనుక ఉన్న ఏకైక ఉద్దేశం, వారు ఓటు వేయకుండా అడ్డుకోవడమే. భయాందోళనలు సృష్టించి, బలప్రయోగంతో వారి ఓటు హక్కును కాలరాయడం ద్వారా ప్రజాస్వామ్య స్ఫూర్తిని పాతేయడానికి పథకం ప్రకారం ప్రయత్నించారుc అని జగన్ వివరించారు. ఈ అప్రజాస్వామిక చర్యల సమయంలో పోలీసులు టీడీపీకి కీలుబొమ్మల్లా వ్యవహరిస్తూ, అధికార పార్టీకి మద్దతు పలికారని ఆయన విమర్శించారు. రాయదుర్గం నియోజకవర్గంలోని బొమ్మనహాల్ మండలంలో కూడా ఇదే తరహా పరిస్థితి చోటుచేసుకుందని జగన్ పేర్కొన్నారు. cఅక్కడ కూడా మా వైసీపీ ఎంపీటీసీలను నిర్బంధించి దూరంగా ఉంచారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, ఎన్నికల అధికారులు మూగ ప్రేక్షకుల్లా ఉండిపోయారు. వారి అండతోనే అక్కడ ఎంపీపీ ఎన్నికను బలవంతంగా పూర్తి చేశారుc అని ఆయన మండిపడ్డారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులను కిడ్నాప్ చేయడం, వారిపై దాడులు చేయడం, పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేయడం వంటి చర్యలు కూటమి ప్రభుత్వంలో సర్వసాధారణమైపోయాయని జగన్ విమర్శించారు. cదేశానికి ప్రజాస్వామ్యం గురించి నీతులు చెప్పే చంద్రబాబునాయుడు, రాష్ట్రాన్ని అరాచక, ఆటవిక రాజ్యంగా మార్చినందుకు సమాధానం చెప్పాలి. ఒక చిన్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనే పరిస్థితి ఇంత దారుణంగా ఉందంటే, ఈ ప్రభుత్వం ఎంతగా అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందో, ఎంత ప్రజాస్వామ్య వ్యతిరేకంగా మారిందో స్పష్టమవుతోందిc అని జగన్ వ్యాఖ్యానించారు.

## విద్యాశాఖ ఉన్నతాధికారుల తీరుపై సీరియస్

### కోర్టులతో ఘర్షణ పడాలని చూస్తున్నారా? : హైకోర్టు తీవ్ర ఆగ్రహం

**అమరావతి :** విద్యాశాఖలోని ఉన్నతాధికారుల వ్యవహారశైలిపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు సీరియస్ అయింది. కోర్టు ఉత్తర్వులంటే విద్యాశాఖ అధికారులకు కనీస మర్యాద లేకుండా పోయిందంటూ కాస్తా ఘాటుగా వ్యాఖ్యానించింది. పవర్ ఫుల్ వ్యక్తుల కింద పనిచేస్తునందున ఎవరు ఏమి చేయలేరనే భావనతో ఉన్నట్లు ఉన్నారని ఉన్నతాధికారుల తీరుపై హైకోర్టు అభిప్రాయపడింది. ప్రస్తుత ప్రభుత్వంలోని ఉన్నతాధికారులు.. కోర్టుతో ఘర్షణ పడాలని ఆశిస్తున్నారా? అంటూ నిలదీసింది. ఆలోచన అదే అయితే.. ఎలా డీల్ చేయాలో తమకు తెలుసునంటూ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో తదుపరి విచారణ నాటికి కోర్టుకు హాజరు కావాలంటూ ఐఏఎస్ అధికారి బి.శ్రీనివాసరావును ఆదేశించింది. సదరు ఐఏఎస్ అధికారికి సోమవారం హైకోర్టు నోటీసులు జారీ చేసింది. సింగిల్ జడ్జి ఉత్తర్వులను అమలు చేయకపోవడంపై ఏపీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సర్వశిక్ష అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌పై కోర్టు ధిక్కరణ కేసును సుమోటోగా తీసుకుంది. కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లో పార్ట్ టైమ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లుగా పనిచేస్తున్న తమను అర్ధాంతరంగా తొలగించడాన్ని సవాల్ చేస్తూ బాధితులు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వారిని కొనసాగించాలని సింగిల్ జడ్జ్ ఇచ్చిన ఆదేశాలను 2024 జనవరిలో ధర్మాసనం ముందు అధికారులు అప్పీల్ చేశారు. ఈ ఉత్తర్వులను అమలు చేస్తామని గత విచారణ సందర్భంగా ప్రభుత్వ న్యాయవాది హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని కోర్టుకు పిటిషనర్ల తరఫు న్యాయవాది గుర్తు చేశారు. దాంతో హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇక విజయనగరం అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ చేసిన తప్పునకు స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను బాధ్యుడిగా చేయడం సరికాదని ప్రభుత్వం తరఫు న్యాయవాది రామచంద్రరావు కోర్టులో తన వాదనలు వినిపించారు. ఉన్నతాధికారి ఆదేశాలు ఇవ్వడమే కాదు... వాటిని అమలు చేయాల్సిన అవసరం కూడా ఉందని ఈ సందర్భంగా హైకోర్టు వ్యాఖ్యానించింది. అనంతరం ఈ కేసు విచారణను నెల రోజులకు ఏపీ హైకోర్టు వాయిదా వేసింది.

## పరకామణిపై హైకోర్టుకు టీటీడీ నివేదిక

### అన్నీ పరిశీలించాకే ఉత్తర్వులు ఇస్తామన్న కోర్టు

**అమరావతి :** తిరుమల శ్రీవారి పరకామణిలో వెంటనే చేపట్టనున్న సంస్కరణల నివేదికను పరిశీలించిన తరవాతనే ఉత్తర్వులు జారీ చేస్తామని ఏపీ హైకోర్టు స్పష్టం చేసింది. పరకామణిలో వెంటనే చేపట్టాల్సిన సంస్కరణలపై ఏపీ హైకోర్టుకు టీటీడీ సోమవారం నివేదిక అందజేసింది. ఈ సందర్భంగా ఏపీ హైకోర్టు పై విధంగా స్పందించింది. ఇక ఈ పరకామణి వ్యవహారంలో కేసుల నమోదు విషయంలో సుప్రీంకోర్టు తీర్పులను పరిశీలించి రావాలని సీఐడీ, ఏసీబీ డీజీలను హైకోర్టు ఆదేశించింది. శ్రీవారి పరకామణిలో హుండీ సీలింగ్, రవాణా, లెక్కింపు విషయంలో తక్షణం చేపట్టనున్న సంస్కరణలపై హైకోర్టుకు టీటీడీ నివేదిక అందజేసింది. ఈ కేసు విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.సీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల పరకామణిలో నగదు చోరీ వ్యవహారానికి సంబంధించిన వీడియోలు వైరల్ అయినాయి. ఈ వ్యవహారంపై కూటమి ప్రభుత్వం విచారణకు ఆదేశించింది. అలాంటి వేళ.. ఈ కేసులో కీలకమైన టీటీడీ మాజీ ఎస్‌వీఓ అధికారి.. విచారణకు వస్తూ అనుమానాస్పద రీతిలో మరణించాడు. ఈ వ్యవహారంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇక పరకామణిలో సంస్కరణలు తీసుకు రావడం కోసం టీటీడీ పటిష్టమైన చర్యలు చేపట్టింది. అందుకు సంబంధించిన నివేదికను హైకోర్టుకు సమర్పించింది. దీనిపై హైకోర్టు పైవిధంగా స్పందించింది.

## గవర్నర్ నజీర్‌కు లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు

**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్‌కు రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మంచి ఆరోగ్యం ఆరోగ్యంతో మరింత కాలం జీవించాలన్నారు. దేశానికి మరిన్నీ ఏళ్ల పాటు సేవా చేయాలన్నారు. గవర్నర్ జస్టిస్ నజీర్ మరింత కాలం ప్రజా సేవలో కొనసాగాలని ఆకాంక్షించారు. రాజ్యాంగంపై లోతైన అవగాహన, జ్యూడిషియరీలో విశేష అనుభవం ఆయనకు ఉందన్నారు. గవర్నర్ గారి స్థిరమైన నాయకత్వంలో రాష్ట్రంలో సాధికారతతోపాటు ప్రజాస్వామిక సంస్థలు బలోపేతం అవుతాయని మంత్రి నారా లోకేశ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఎక్స్ ఖాతా వేదికగా గవర్నర్‌కు లోకేశ్ జన్మదినం శుభాకాంక్షలు తెలియజేశారు.

## బొంరాస్పేట్ మండల కేంద్రంలో రోడ్డు విస్తరణ పేరుతో పేదల జీవనోపాధి దెబ్బతినకూడదు

- తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కకింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ వసీమ్,
- వికారాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెట్రరీ మొహమ్మద్ ముస్తఫా వినతి




**బొంరస్ పేట మండలం, జనవరి,05(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా బొంరస్ పేట మండల కేంద్రానికి వెళ్లే నూతన రోడ్డు పనుల ద్వారా గ్రామ అభివృద్ధి జరుగుతుందని తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి స్వాగతిస్తున్నది. అయితే, గ్రామంలో రోడ్డు ఇరువైపులా గత 30 సంవత్సరాలుగా నిర్మించబడిన ఇండ్లను మరియు వ్యాపార స్థలాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ప్రాంతంలో నివసిస్తున్నవారు ప్రధానంగా మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు. వారు ఎంతో కష్టపడి చిన్న చిన్న వ్యాపారాలు నిర్వహిస్తూ తమ జీవనోపాధిని కొనసాగిస్తున్నారు. ఈ నిర్మాణాలన్నీ గ్రామ పంచాయతీ పరిధిలో ఉండగా, రోడ్డు సెంటర్ నుండి 25 అడుగుల దూరంలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం రోడ్డు విస్తరణను రోడ్డు మధ్యనుండి ఇరువైపులా 25 అడుగుల మేర మాత్రమే చేపడితే మొత్తం 50 అడుగుల వెడల్పు రోడ్డు సరిపోతుందని సమితి సూచించింది. కానీ ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న విధంగా 100 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తే, దాదాపు 100 కుటుంబాలు తమ ఇండ్లు కోల్పోయి రోడ్డున పడే ప్రమాదం ఉంది. ఇది అభివృద్ధి కాకుండా ప్రజల జీవితాలను నాశనం చేసే పరిస్థితికి దారి తీస్తుంది. కాబట్టి ఈ విషయంపై మా స్వంత నియోజకవర్గానికి చెందిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, బాధిత కుటుంబాలకు తగిన న్యాయం చేయాలని, రోడ్డు విస్తరణను రోడ్డు మధ్యనుండి 25 అడుగుల మేరకే పరిమితం చేయాలని తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మహమ్మద్ వసీమ్ మరియు వికారాబాద్ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ మహమ్మద్ ముస్తఫా పత్రికా ముఖంగా వినతిచేశారు.

## కౌన్సిలర్ గా భరిలో ఉంటా... !

- స్థానిక ప్రజల సహకారంతో ముందుకు -ఎస్ గోపాల్



**తాండూరు (జనవరి 05)సమయం :** రానున్న పురపాలక సంఘం ఎన్నికలలో వికా రాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ పరిధిలోని 6వ నెంబర్ వార్డ్ కౌన్సిలర్ గా భరిలో ఉంటానని ఎస్ గోపాల్ చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా జర్నలిస్టుగా పనిచేస్తున్న తాను ప్రజాసేవ చేసేందుకు ముందుకు వస్తున్నానని,మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి నాయకత్వంలో తనకు బిఆర్ఎస్ పార్టీ అవకాశం కలిపిస్తే ఇందిరానగర్ లోని 6వ వార్డ్ నెంబర్ వార్డు నుండి పోటీలో ఉంటానని చెప్పారు. ప్రజాసేవలో నిరంతరం ఉండడంతోనే తనకు ప్రజల సహకారం కూడా ఉందని తెలిపారు.

## లూయిస్ బ్రెయిలీ ఘనంగా జయంతి వేడుకలు.



**మహబూబ్ నగర్ జనవరి5( సమయం న్యూస్). :**అంధుల కోసం లిపిని సృష్టించి వారి జీవితంలో వెలుగులు నింపిన మహానీయుడు లూయిస్ బ్రెయిలీ అని కలెక్టర్ విజయే ందిర బోయి పేర్కొన్నారు. ఆదివారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రం మెట్టుగడ్డ లోని శిశు గృహ లో లూయిస్ బ్రెయిలీ 217 వ జయంతి వేడుకల ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మహిళా, శిశు, దివ్యాంగుల, వయో వృద్ధుల సంక్షమ శాఖ అధికారిని జరీనా బేగం తో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంధులు సామాన్యులతో సమానంగా అన్ని రం గాల్లో ముందుండేలా ఆలోచించి లూయిస్ బ్రెయిలీ ఆరు చుక్కలతో కూడిన లిపిని తయారు చేశార న్నారు. దివ్యాంగులు సమావేశంలో సలహాలు,సూచనలు,ఇబ్బందులను ప్రస్తావనకు తీసుకువచ్చారని తెలిపారు. జిల్లా యంత్రాంగం ప్రతి నెల మొదటి బుధవారం దివ్యాంగులు,సీనియర్ సిటిజన్ లకు ప్రత్యేక ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రత్యేక ప్రజావాణిలో వచ్చిన సమస్యలు పరిష్కారం కు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా, శిశు,దివ్యాంగుల,వయో వృద్ధుల శాఖ సంక్షమ అధికారిణి జరీనా బేగం, అంధుల పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ రాములు,డాక్టర్ రమ్య, దివ్యాంగులు, వయో వృద్ధులు పాల్గొన్నారు

## పొలిటికల్ పార్టీలతో ఓటర్ లిస్ట్ పై సమావేశం

- మద్దూరు మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్



**మద్దూరు మున్సిపల్, జనవరి, 05(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లా మద్దూరు మున్సిపాలిటీలో స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం మద్దూర్ పట్టణంలోని పొలిటికల్ పార్టీలతో ఓటర్ లిస్ట్ పై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఇట్టి కార్యక్రమంలో ఐ ఎన్ సి నుంచి పిఏసీఎస్ చెర్మెన్ గుళ్ల నరసింహ,మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, జంగం బాబూరావు, జనార్దన్,బిజెపి శంకర్, టిఆర్ఎస్ మహిపాల్, నర్సింలు,ఆఫీస్ సిబంది రాజ్ కుమార్,రాము పాల్గొనడం జరిగింది

# ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కావాలి

- స్పష్టం చేసిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నిజామాబాద్, జనవరి 05( సమయం న్యూస్).** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఈ కార్యక్రమానికి ఉన్న ప్రాధాన్యతను గుర్తెరిగి జిల్లా అధికారులే స్వయంగా ప్రజావాణిలో పాల్గొనాలని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ లతో కలిసి కలెక్టర్ ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 70 వినతులు అందగా, వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ప్రజావాణి వినతుల స్వీకరణ పూర్తయిన అనంతరం అధికారులకు కలెక్టర్ ఇలా త్రిపాఠి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను వెంటవెంటనే పరిశీలించి, పరిష్కారానికి అనువుగా ఉన్న వాటిని తక్షణమే పరిష్కరించాలని సూచించారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న తరహాలోనే జిల్లా ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం ప్రగతిని పర్యవేక్షించేందుకు ఆన్లైన్ విధానాన్ని అవలంభిస్తామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అర్జీదారులు పదేపదే కార్యాలయాల చుట్టూ తిరగకుండా సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలని హితవు పలికారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా ఆయా శాఖల జిల్లా అధికారులు ప్రజావాణికి గైర్హాజరు కాకూడదని, కార్యస్థానాల్లో అందుబాటులో ఉండాలని సూచించారు. తమ సమస్యలు పరిష్కారం అవుతాయనే నమ్మకంతో ప్రజలు తరలివచ్చి ప్రజావాణిలో వినతులు, ఫిర్యాదులు అందిస్తారని, జిల్లా అధికారులు అందుబాటులో ఉంటూ పరిష్కరించేందుకు అనువుగా ఉన్న వాటిని అప్పటికప్పుడే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయా శాఖలకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా క్షేత్ర స్థాయిలో ఏమి జరుగుతోందనే విషయాలను తెలుసుకునేందుకు, శాఖా పరమైన అంశాలను గమనించేందుకు ప్రజావాణి కార్యక్రమం వేదికగా ఉపయోగపడుతుందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని జిల్లా అధికారులు తప్పనిసరిగా ప్రజావాణిలో పాల్గొనాలని, ప్రజలు సమర్పించే అర్జీలను పరిష్కరించేందుకు అంకిత భావంతో కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. కాగా, మండల ప్రత్యేక అధికారులు జిల్లా ప్రగతిలో క్రియాశీలక పాత్ర పోషించాలని, క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ఆయా కార్యక్రమాలు, పథకాల అమలు తీరును నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ప్రతి శాఖ పనితీరు సమర్థవంతంగా ఉండాలన్నారు. మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఉన్నందున, సంబంధిత అధికారులు అన్ని విధాలుగా సన్నద్ధం కావాలని అన్నారు. ముఖ్యంగా ఓటరు జాబితాలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఎలాంటి ప్రలోభాలు, ఒత్తిళ్లకు తావులేకుండా పారదర్శకంగా ఎన్నికల విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ఫాం-6, ఫాం-7 పరిష్కారంలో స్పష్టమైన ప్రగతి కనిపించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, నిజామాబాద్ ఏసీపీ రాజావెంకట్ రెడ్డి తదితరులు ఫిర్యాదులు స్వీకరించగా, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు

# నాగోబా జాతరకు పటిష్ట ఏర్పాట్లు

- జిల్లా కలెక్టర్ రాజార్షి షా



**ఇంద్రవెల్లి జనవరి05( సమయం న్యూస్).:**ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌లోని చారిత్రక నాగోబా దేవాలయంలో ఈ నెల 18 నుంచి 25 వరకు నిర్వహించనున్న నాగోబా జాతరకు పటిష్టమైన ఏర్పాట్లు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ రాజార్షి షా తెలిపారు. సోమవారం నాగోబా దేవాలయాన్ని జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మర్మాట్ లు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నాగోబా జాతర, దర్బార్ ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం ఈ నెల 18 నుంచి 25 వరకు నాగోబా జాతర నిర్వహించనున్న నేపథ్యంలో, సోమవారం కేస్లాపూర్ నాగోబా ఆలయంలో జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ లకు ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వాన పత్రిక అందజేసి అధికారికంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా లక్షలాది మంది భక్తులు నాగోబా జాతరకు తరలివస్తారని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని మౌలిక సదు-పాయాలు కల్పించేందుకు జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేస్తోందని తెలిపారు. గతంలో మంజూరైన తాత్కాలిక, శాశ్వత నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రభుత్వం నుంచి నిధులు విడుదలైనట్లు చెప్పారు. జాతర ప్రారంభానికి ముందే అన్ని పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాగోబా జాతరలో శాశ్వతంగా ఏర్పాటు చేసే మౌలిక సదుపాయాల నిర్మాణాలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ తెలిపారు. తాత్కాలికంగా భక్తులకు అవసరమైన ఏర్పాట్లు, అలాగే శాశ్వత నిర్మాణ పనుల కోసం విడుదలైన నిధులను సకాలంలో, లక్ష్యలకు అనుగుణంగా వినియోగించి పనులను వేగవంతం చేయాలని సూచించారు. నాగోబా జాతర ఏర్పాట్లు, భక్తుల మౌలిక సదుపాయాలపై రాష్ట్ర ముఖ్యమంత్రి కార్యాలయం పర్యవేక్షణ కొనసాగుతోందని పేర్కొన్నారు. జాతరకు వచ్చే భక్తుల కోసం తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా, తాత్కాలిక మరుగుదొడ్లు, విశ్రాంతి కేంద్రాలు పటిష్టంగా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. జాతర ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడంతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఐటిడిఏ, పోలీస్, వైద్యారోగ్య శాఖ, ఆర్ అండ్ బీ, పంచాయతీ రాజ్ తదితర శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఐటీడీఏ పీఓ మాట్లాడుతూ, గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన నాగోబా జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ నెల 18న మహాపూజ, 22న దర్బార్ నిర్వహణ నేపథ్యంలో జాతర ప్రాంగణం, దర్బార్ హాల్, గోవాడ్, కోనేరు ప్రాంతాలను కలెక్టర్, పీఓ పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మెస్రం ఆనంద్ రావు, సభ్యులు దేవురావు, వెంకట్ రావు, తుకారాం, సర్పంచ్ మెస్రం శేకు, పూజారి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




## 7 వ చిన్న నీటి వనరుల గణన జనవరి 15 లోగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి

**మహబూబ్ నగర్ జనవరి5( సమయం న్యూస్). :** 7 వ చిన్న నీటి వనరుల గణన ఈ నెల 15 లోగా పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి, తహశీల్దార్ లు, ఎం.పి.డి. ఓ లను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరం లో ప్రజావాణి కార్య క్రమం అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశం లో చిన్న నీటి వనరుల గణన పై కలెక్టర్ సూచనలు జారీ చేశారు. చిన్న నీటి వనరుల గణన లో మహబూబ్ నగర్ జిల్లా ప్రగతి ఆశించిన స్థాయిలో లేదని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో కేవలం 20 శాతం గ్రామాల్లో మాత్రమే గణన జరిగిందని,జనవరి 15 లోగా నూరు శాతం సర్వేను ఆన్ లైన్ లోక్షేత్ర స్థాయి లో సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు,జి.పి. ఓ.లు,ఫీల్డ్ అసిస్టెంట్ లో గణన పూర్తి చేసేలా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి,ఎం.పి.డి. ఓ.లను,తహశీల్దార్ లను వెబెక్స్ ద్వారా ఆదేశించారు. మండలం లో సమావేశం నిర్వహించి గణన పై సమీక్షంచి తగు ఆదేశాలు జారీ చేయాలని ఆమె ఆదేశించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి రవీందర్,జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేష్,జడ్.పి. సి. ఈ.ఓ వెంకట రెడ్డి,డి.ఆర్.డి.ఓ నర్సింహులు,ఆర్.డి. ఓ నవీన్,తదితరులు పాల్గొన్నారు



## మహిళల రక్షణే షీ టీమ్స్ ప్రధాన లక్ష్యం

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్.ఐపీఎస్

**నారాయణపేట,జనవరి,05(సమయం న్యూస్) :** మహిళలు, యువతులు, బాలికలు ఆకతాయిల వల్ల గానీ, ఇతర ఏవిధమైన వేధింపుల వల్ల గానీ ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లయితే భయపడకుండా నిర్భయంగా పోలీసులను సంప్రదించాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు. నారాయణపేట జిల్లాలో మహిళల రక్షణ కోసం ‹షీ› టీమ్స్,యాంటీ ఉమెన్ ట్రాఫికింగ్ టీంలు నిరంతరం పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థినులు, మహిళలు అన్యాయానికి గురైనప్పుడు భయ పడవద్దని, గృహహింసకు గురైన వారు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై చట్టప్రకారం ఖచ్చితమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కళాశాలలు, పాఠశాలల విద్యార్థినులు బస్టాండ్లు, గ్రామాలు, కాలనీల్లో ర్యాగింగ్, ఈవ్ టీజింగ్‌కు గురైనప్పుడు, ఉద్యోగ మహిళలు పని చేసే ప్రదేశాల్లో వేధింపులకు గురైనప్పుడు, అలాగే బాలికలపై లైంగిక వేధింపులు జరిగినప్పుడు వెంటనే ‹షీః టీమ్ పోలీసులను సంప్రదిస్తే సత్వర న్యాయం అందిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. జిల్లా వ్యాప్తంగా ‹షీ› టీమ్స్ ద్వారా అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, మహిళలు సోషల్ మీడియా అయిన ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్ వంటివి వినియోగించే సమ యంలో అప్రమత్తంగా ఉండాలని, ఫొటోలు, వీడియోలు పోస్టు చేసే వేళ వ్యక్తిగత భద్రతకు సంబంధించిన జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. నేరుగా ఫిర్యాదు చేయలేని వారు ‹షీ› టీమ్ ఫోన్ నెంబర్ 8712670398 కు లేదా డయల్ 100 కు సమాచారం అందించాలని, ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచి, నిందితులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ తెలిపారు.

# జిల్లాలోనే అత్యధిక స్థానాల్లో తాండూర్‌లో బీసీ సర్పంచుల విజయం

- వారిని సన్మానించడం చాలా గర్వంగా ఉంది
- తాండూర్ నియోజకవర్గ బీసీ సంఘం కన్వీనర్ కందుకూరి రాజ్ కుమార్
- ప్రతి సర్పంచ్ రాజ్యాంగం కల్పించిన హక్కులను తెలుసుకోవాలి
- అడిషనల్ ఎస్పీ జి. మధుసూదన్ రావు
- తాండూర్‌లో 67 మంది బీసీ సర్పంచులకు ఘన సన్మానం



**తాండూర్,మున్సిపల్ (మం)జనవరి,05(సమయం న్యూస్)** తాండూర్ నియోజకవర్గం బీసీ సంఘం ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బీసీ సర్పంచులకు ఘన సన్మాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు, తాండూర్ నియోజకవర్గ కన్వీనర్ కందుకూరి రాజ్ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో తాండూర్, యాలాల్, బషీరాబాద్, పెద్దెముల్ మండలాల నుండి ఎన్నికైన బీసీ సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు మెంబర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ జి. మధుసూదన్ రావు హాజరయ్యారు. అలాగే ప్రముఖ వైద్యులు డాక్టర్ జయప్రసాద్, విద్యావేత్త పర్యట రామకృష్ణ తదితరులు అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, రాజకీయాలకు అతీతంగా వివిధ కులాల వారీగా ఉన్న బీసీలను ఒక్క తాటిపైకి తీసుకువచ్చి ఇంత పెద్ద కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన బీసీ సంఘం నాయకులను అభినందించారు. రాబోయే రోజుల్లో సర్పంచ్‌లకే కాకుండా జడ్పిటిసి, ఎంపిటిసి, మున్సిపల్ కౌన్సిలర్ స్థానాల్లో కూడా బీసీలు పోటీ చేసి, జనరల్ వార్డుల్లో గెలుపు సాధించాలని ఆకాంక్షంచారు. కందుకూరి రాజ్ కుమార్ మాట్లాడుతూ, తాండూర్ నియోజకవర్గంలో కేవలం 20 శాతం సర్పంచ్ స్థానాలు మాత్రమే బీసీలకు రిజర్వ్ అయినప్పటికీ, అదనంగా 26 శాతం బీసీ అభ్యర్థులు జనరల్ స్థానాల్లో గెలవడం వికారాబాద్ జిల్లా మాత్రమే కాకుండా తెలంగాణ రాష్ట్ర చరిత్రలోనే ఒక ఘనతగా నిలిచిందన్నారు. ముఖ్య అతిథి రిటైర్డ్ అడిషనల్ ఎస్పీ జి. మధుసూదన్ రావు మాట్లాడుతూ, భారత రాజ్యాంగం ద్వారా సర్పంచులకు ప్రత్యేకమైన హక్కులు కల్పించబడ్డాయని, ప్రతి సర్పంచ్ ఆ హక్కులను పూర్తిగా తెలుసుకుని, గ్రామాభివృద్ధి కోసం సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచిం చారు. తాండూర్ నియోజకవర్గంలోని అన్ని మండలాలను కలిపి మొత్తం 67 మంది బీసీ సర్పంచులు విజయం సాధించారని, వారందరినీ శాలువాలు, మోమెంటోలతో ముఖ్య అతిథులు మరియు బీసీ సంఘం నాయకులు ఘనంగా సన్మానించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ నాయకులు సయ్యద్ సుకుర్ గడ్డం వెంకటేష్ విజయేందర్ కేవన్ రాజు అనిత మంజుల న్యాయవాదులు గోపాల్ దిలీప్ సింగ్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచులు పండరి రాజ్ కుమార్ భార్గవి బీసీ సంఘం మండలాల అధ్యక్షులు నరేందర్ లక్ష్మణ చారి శ్రవణ్ కుమార్ బసంత్ కుమార్ బీసీ సంఘం యువ నాయకులు బసవరాజ్, రాము ముదిరాజ్, పరమేష్, దుబాయ్ వెంకట్, హరి ప్రసాద్, పండు గౌడ్, మహిళా ప్రతినిధులు అనిత, మంజుల, నరసమ్మ జగదీశ్వరి మధులత శ్రీనివాస్ చారి, శివ లీల, విజయలక్ష్మి, జగదీశ్వరి, కుల సంఘాల ప్రతినిధులు రాజు యాదవ్ పరమేష్ నాయి రజక కృష్ణ కమలాకర్ అరుణ్ రాజ్ ఏలేటి శ్రీనివాస్ నవీన్ టేలర్ రమేష్ గోపాల్ డాక్టరేట్ నర్సింలు దవులయ్య తదితరులు పాల్గొని సర్పంచ్లను ఘనంగా సన్మానించారు

# నూతన ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతిపై మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పర్యవేక్షణ

- రోడ్లు, మౌలిక సదుపాయాల పనులను పరిశీలించాలంటూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్‌కు ఆదేశాలు
- భూసేకరణ, నాలా పనులు, రోడ్డు అనుసంధానంపై ఉన్నత స్థాయి సమీక్ష



**హైదరాబాద్ జనవరి5( సమయం న్యూస్).:** గోషామహల్‌లో నిర్మిస్తున్న నూతన ఉస్మానియా జనరల్ హాస్పిటల్ పనులను వేగవంతం చేయడంపై ముఖ్యమంత్రి శ్రీ ఏ. రేవంత్ రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. ఈ నేపథ్యంలో నిర్మాణ పనుల పురోగతి, రోడ్డు మౌలిక సదుపాయాల పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీ వికాస్ రాజ్‌కు ఆదేశాలు జారీ చేశారు. ఆదేశాల మేరకు సోమవారం ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ ప్రాజెక్టు స్థలాన్ని సందర్శించి, సంబంధిత అన్ని శాఖల అధికారులతో విస్తృతంగా చర్చలు నిర్వహించారు. ప్రాజెక్టు పరిధిలో గుర్తించిన 56 నిర్మాణాలను ఫిబ్రవరి చివరి నాటికి పూర్తిగా తొలగించనున్నట్లు జీహెచ్ఎంసీ అధికారులు తెలిపారు. దీనివల్ల ఆసుపత్రి నిర్మాణ పనులకు ఎలాంటి అడ్డంకులు లేకుండా కొనసాగుతాయని వెల్లడించారు. ఇంతకు ముందు పోలీస్ శాఖ పరిధిలో ఉ ండి, అనంతరం వైద్య విద్యా సంచాలకత్వ శాఖ (డీఎంఈ)కి బదిలీ అయిన భూమికి సంబంధించి భూఉ పయోగ మార్పు అంశంలో, ఎంఏ అండ్ యూడీ శాఖ నుంచి అవసరమైన నో అబ్జెక్షన్ సర్టిఫికేట్ (ఎన్ఓసీ) జారీ పెండింగ్‌లో ఉందని అధికారులు వివరించారు. ప్రాజెక్టు కన్సల్టెంట్లు, 2026 జనవరి 10 నాటికి పూర్తి డ్రాయింగుల షెడ్యూల్‌ను సమర్పిస్తామని, ఆమోదించిన కాలపరిమితి ప్రకారం పనులు కచ్చితంగా చేపడతామని హామీ ఇచ్చారు.

ఇరిగేషన్ ఒ కాడ్ శాఖ సమర్పించిన ప్రస్తుత నాలా డిజైన్‌ను సమీక్షించిన అనంతరం, రోడ్లు భవనాల శాఖ చీఫ్ ఇంజినీర్ (బిల్డింగ్స్)కు వెంటనే పనులు ప్రారంభించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదేశించారు.

రోడ్డు మౌలిక సదుపాయాల విషయంలో ప్రతిపాదిత రోడ్ ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ)కు తక్షణమే డిజైన్ సిద్ధం చేయాలని, ఆసుపత్రి ప్రవేశ రోడ్డులో ట్రాఫిక్‌కు ఆటంకంగా మారిన మ్యాన్‌హోల్‌ను సరిచేయాలని, పరిసర రోడ్ల అభివృద్ధి పనులను జీహెచ్ఎంసీ వేగంగా చేపట్టాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రాజెక్టు నిర్ణీత కాలపరిమితిలో పూర్తి అయ్యేలా పెండింగ్‌లో ఉన్న అన్ని పనులను సమాంతరంగా చేపట్టాలని సంబంధిత శాఖలకు స్పష్టమైన సూచనలు ఇచ్చారు.




# తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరన

- ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా.సంపత్ కుమార్, డిప్యూటీ సూపరిండెంట్ డా.ఆదిత్య గౌడ్

**నారాయణపేట,జనవరి,05(సమయం న్యూస్):**తెలంగాణ నర్సింగ్ ఆఫీసర్స్ అసోసియేషన్ క్యాలెండర్ను నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి మరియు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. సంపత్ కుమార్ సింగ్,డిప్యూటీ సూపరిండెంట్ డాక్టర్ ఆదిత్య గౌడ్, సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఆసుపత్రికి వచ్చి పేద, మధ్యతరగతి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకుండా మెరుగైన వైద్య సేవలు అందిస్తున్న నర్సింగ్ సిబ్బంది అభినందించారు. రాబోయే రోజుల్లో ప్రజలకు మరింత మంచి వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో డాక్టర్ బాలాజీ, డా. రాఘవేందర్, మెడిసిన్ హెచ్ ఓ డి నజ్మ, పాథలజీ ఊణ సుందరీ దేవీ, నర్సింగ్ సూపరినింటెండేట్ కల్పన, యూనియన్ ప్రెసిడెంట్ కవిత, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండి షబ్బీర్, జనరల్ సెక్రటరీ రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, సోషల్ మీడియా ఇంచార్జ హనుమంతు, విజయ్ కుమార్, ఈసీ మెంబర్స్ అనసూయమ్మ,నారాయణమ్మ, అచ్యుత్ రెడ్డి, పల్లవి, కిరణ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, ముస్తఫా, దీక్షత్ , ఆంజనేయులు, వినోద్, పర్వీన్ ,జమున తదితరులు పాల్గొన్నారు.




# బిక్నూర్ మోడల్ సోలార్ విలేజ్ గా ఎంపిక.

**కామారెడ్డి జనవరి5( సమయం న్యూస్).:** పీ సూర్యఘర్ ముఫ్తీ బిజిలి యోజన – మోడల్ సోలార్ విలేజ్ పథకంలో భాగంగా, కామారెడ్డి జిల్లాలో భిక్నూర్ గ్రామం మోడల్ సోలార్ విలేజ్ గ్రామంగా గత అక్టోబర్, 2025లో జిల్లా స్థాయి కమిటీ ౹పీ సూర్యఘర్ మార్గదర్శకాల ప్రకారం ఎంపిక చేయడం జరిగింది .దీనిలో భాగంగా జిల్లా కలెక్టర్, జిల్లా స్థాయి కమిటీ, ఆదేశాలనుసారం, టిజి రెడ్కో, ౧+చీూణజూ పంచాయతి అధికార్లు క్షేత్ర స్థాయిలో భిక్నూర్ గ్రామంలో పర్యటించి అవసరమైన ప్రభుత్వ భవనాలకు, వివిధ స్థలల్లో సోలార్ సిస్టంలను ఏర్పాటుకోసం వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను (ఴూ=) తయారు చేసి జిల్లా స్థాయి కమిటీకి సమర్పించడం జరిగింది. దీనిలో భాగంగా సోమవారం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ సమావేశం, కలెక్టరేట్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో మోడల్ సోలార్ విలేజ్ అయిన భిక్నూర్ గ్రామంలో గల వివిధ రకాల ప్రభుత్వ భవనాలపై 116ఖఔ సామర్థ్యం గల 28 ప్రభుత్వ భవనాలపై సోలార్ గ్రిడ్ కన్టెడ్ సోలార్ పవర్ సిస్టంలు ఏర్పాటు కోసం,28 గ్రామంలోని గుర్తించిన వివిధ స్థలల్లో 20అశీం సోలార్ వీధి దీపాలు ఏర్పాటు కోసం, 1500ౡాణ గల సోలార్ వాటర్ హీటర్ గ్రామంలో గల రెసిడెన్షియల్ హాస్టల్లో ఏర్పాటుకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదికను (ఴూ=) ను కలెక్టర్, జిల్లా స్థాయి కమిటీ పరిశీలించి పలు సూచనలు చేయడం జరిగింది. ఈ సమావేశం లో సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# బేటి బచావో బేటి పడావోతో బాలికలకు బంగారు భవిష్యత్‌జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య

- విద్యా క్రీడా రంగాల్లో ప్రతిభ చూపిన బాలికలకు అవార్డులు అందజేసిన జిల్లా కలెక్టరు




**సంగారెడ్డి, జనవరి 05( సమయం న్యూస్).:**బేటి బచావో బేటి పడావో కార్యక్రమంతో బాలికల బంగారు భవిష్యత్ కు పునాది పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు.

జిల్లా మహిళా శిశు సంక్షమ శాఖ, జిల్లా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో విద్యా మరియు క్రీడా రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య కిట్లు, అవార్డు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,"బాలికలు అన్ని రంగాలలోనూ ముందంజలో నిలుస్తూ జిల్లాకు గర్వకారణంగా మారుతున్నారని, ప్రభుత్వం బాలికల సాధికారతకు అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు. విద్యతో పాటు క్రీడల్లో కూడా బాలికలు రాణిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆమెఆకాంక్షంచారు. కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి ఒక బ్యాగ్, ట్రాక్ సూట్, వాటర్ బాటిల్, మోటివేషనల్ పుస్తకం, టీ-షర్ట్‌తో పాటు అవార్డు సర్టిఫికెట్‌ను అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకున్న విద్యార్థులు: ఎం. రంజన్ కుమారి, భావన, మాల్విక, అశ్విని, ఋత్విక రెడ్డి, వైష్ణవి, ఎం. శైలజ, పి. గౌతమి, భూమిక, ప్రవళిక. అదనపు కలెక్టర్లు మాధురి, పాండు , సబ్ కలెక్టర్ ఉమా హారతి,జిల్లా సంక్షమ అధికార్ి. లలిత కుమారి, జిల్లా సమన్వయకర్త పల్లవి, అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# బ్యాంకులు సరైన భద్రతను ఏర్పాటు చేసుకోవాలి

- జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్ రాజు



**కొత్తగూడెం జనవరి05( సమయం న్యూస్).:** ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని అన్ని బ్యాంకుల అధికారులతో సోమవారం ఎస్పీ రోహిత్ రాజు సమావే శమయ్యారు. ముఖ్యంగా ఏటిఎంలలో జరుగుతున్న చోరీలు బ్యాంకులలో జరుగుతున్న దొంగతనాలను ఉద్దేశించి ఈ సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. అలాంటి సంఘటనలు జిల్లాలో జరగకుండా బ్యాంకు అధికారులు తమ తమ బ్యాంకుల కు సం బంధించి పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బ్యాంకుల లోపల మరియు వెలుపల అన్ని ప్రదేశాలలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుని,నిరంతర పర్యవేక్షణ ఉండేలా చూసుకోవాలని సూచించారు. బ్యాంకులలో ఉండే సెక్యూరిటీ అలా రం యొక్క ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు.ాూవీ లలో నగదును లోడ్ చేసేటప్పుడు సరైన జాగ్రత్తలు తీసుకోవాలని,అక్కడ సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకోవాలని సూచించారు.ాూవీ ల వద్ద సెక్యూరిటీ గార్డులను ఏర్పాటు చేసుకోవడం ఉత్తమమని తెలిపారు. సామాజిక బాధ్యతలో భాగంగా సైబర్ క్రైమ్స్ పై బ్యాంకుల తరఫునుండి కూడా జిల్లా ప్రజలకు నిత్యం అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో భాగంగా కరపత్రాలను,పోస్టర్లను తయారుచేసి ముఖ్యమైన ప్రదేశాల్లో అతికించాలని సూచించారు. సైబర్ నేరాల బారిన పడి నగదును కోల్పోయిన బాధితులకు నేరగాళ్ల అకౌంట్లలో ఫ్రీజ్ చేయబడిన నగదును త్వరితగతిన వారికి అందేలా పోలీస్ శాఖతో సమన్వయం పాటిస్తూ చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.

# ప్రజావాణికి 22 ఫిర్యాదులు.

- ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి- అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీనివాస్



**నారాయణపేట, జనవరి,05(సమయం న్యూస్):** ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యత నిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అధికా రులకు సూచిం చారు. ప్రజావాణి సమావేశ మందిరంలో సోమ వారం నిర్వహిం చిన ప్రజావాణి కార్యక్రమానికి 22 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను అదనపు కలెక్టర్ కు విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటిక ప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలపై బిజెపి రాజీలేని పోరాటాలు

- బిజెపి ఖమ్మం వన్ టౌన్ అధ్యక్షులు గడిల నరేష్



**ఖమ్మం, జనవరి 5 : ( సమయం న్యూస్ ):** ప్రజల సమస్యలపై బిజెపి నిరంతరం రాజీ లేని పోరాటాలు చేస్తూ ప్రజల హృదయాలలో స్థానం సంపాదించుకుంటూ బలోపేతం అవు తుందని బిజెపి ఖమ్మం వన్ టౌన్ అధ్యక్షులు గడిల నరేష్‌మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం వన్ టౌన్ పరిధిలో ఉ న్న 14 డివిజన్లకు గాను రాబోవు ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో పోటీ చేసేందుకు సన్నద్ధంగా ఉన్నదన్నారు. రానున్న నూతన సంవత్సరం , సంక్రాంతిశు భాకాంక్షలు ప్రకటిసూ,భారత ప్రధానినరే ంద్ర మోదీపాలనను ముందుకు తీసుళ్లేక్రమం లోపూర్తి స్థాయి బూత్ కమిటీ లను వేయటమే కాకుండా అధికారపార్టీఇచ్చిన హామీలను ప్రశ్నిస్తూ , ప్రజలకు గత బి ఆర్ ఎస్‌ప్రభుత్వం చేసిన పనులనే ఇప్పుడున్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తూప్రజల కు ఇచ్చిన హామీల అమలుపైపోరాడనుందన్నారు .ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎలక్షన్ లో సుమారు 100 పైగా వార్డు మెంబెర్స్ గెలవటం, 5 ఉప సర్పంచ్ లను గెలవటం, అలాగే 5 నుండి 10 చోట్ల స్వల్ప తేడాతొ సర్పంచ్ లను ఓడిపోవటం జరిగిందని ,రాష్ట్రంలో బిజెపి సత్తా ఏమిటో చూపించిందన్నారు. ఖమ్మం టౌన్ లో గడప గడప కి బీజేపీ నినాదంతో ఇప్పటికే జన జాగరణ చేయటం జరిగింది. ప్రజల్లో నరేంద్ర మోదీ పైన ఉన్న నమ్మకంసరాగాన్ టౌన్ లో నిర్వహిస్తున్న కార్యక్రమాలు జయప్రదం అవుతు న్నాయన్నారు . అదేవిధంగా ఈ కార్యక్రమాల లోగతం లో ఎన్నడు లేని విధంగా పార్టీలో యువహాౕనాయకత్వం పెరుగుతోందని , ఫలితంగా పార్టీ మరింత బలపడుతుందని అన్నారు. ఈ క్రమంలో ఖమ్మం వన్ టౌన్ ప్రాంతంలో పార్టీ కార్యాలయాన్ని కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



**ఖమ్మం, జనవరి 5: ( సమయం న్యూస్ )** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డిలతో కలిసి ప్రజల అర్జీలను స్వీకరించారు.సత్తుపల్లి పట్టణం కాకర్లపూడి సర్కిల్ దాటిన తర్వాత ఉన్న ఆర్ఆర్ చైన్ సెంటర్ వల్ల చుట్టుపక్కల నివసించే ప్రజలకు దుర్గంధంతో అనేక ఇబ్బందులు ఎదురవు తున్నాయని, అక్కడి నుంచి చైన్ సెంటర్ తరలించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ పరిశీలించి నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ధంసలాపురం గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్వాసితులు రాంప్ 3 ఎంట్రీ, ఎగ్జిట్ దగ్గర ఉన్న ప్లాట్ లకు దారి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, పిడి ఎన్.హెచ్.ఏ.ఐ. కు రాస్తూ నిబంధనల ప్రకారం అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.వైరా మండలం రెబ్బవరం గ్రామానికి చెందిన సాధన సుబ్బమ్మ తన కుమారుడు మోసం చేసి చివరిగా మిగిలి ఉన్న 30 గుంటల భూమి బలవంతంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడని, పొలం తిరిగి ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, డి.ఎల్.ఎస్.సి. సెక్రటరీ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ ఏడవ డివిజన్ శ్రీకృష్ణ నగర్ లో పందుల బెడద తీవ్రంగా ఉందని, తగు చర్యలు తీసుకోవాలని శ్రీకృష్ణ నగర వాసులు దరఖాస్తు చేసుకోగా మున్సిపల్ కమీషనర్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.ఖమ్మం అర్బన్ మండలం 16వ డివిజన్ కు చెందిన ఎం. నర్సింహా రెడ్డి ధంసలాపురం గ్రామం దగ్గర కొత్తగా నిర్మిస్తున్న గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కనే ఉన్న తన పొలంలోకి వెళ్ళే దారి ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ, జెడ్పీ సీఈఓ దీక్ష రైనా, డీఆర్డిఓ సన్యాసయ్య, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏఓ_. శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

## సబ్ స్టేషన్ ఏర్పాటుకు స్థల పరిశీలన

● జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల జనవరి 5,( సమయం న్యూస్).:** వినియోగదారులకు ఎలాంటి అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు సబ్ స్టేషన్ ఏర్పాటు కొరకు స్థలాన్ని పరిశీలి ంచడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని హాజీపూ ర్ మండలం రాపల్లి ప్రాంతంలో సబ్ స్టేషన్ ఏర్పాటు కొరకు మండల తహసిల్దార్ శ్రీని వాస్ రావు దేశ్ పాండే తో కలిసి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## మండలం వారీగా జిల్లాలో ఉన్న యూరియా నిల్వలు (బస్తాలలో )

**నారాయణపేట జిల్లా, జనవరి,05(సమయం న్యూస్)**

దామరగిద్ద - 1199
ధన్వాడ - 1582
కోస్గి - 2731
కృష్ణ - 1714
మద్దూరు - 1780
మాగనూర్ ఉ 4149
మక్తల్ఉ 7413
మరకలు - 2219
నారాయణపేట - 3376
నర్వా- 2691
ఉట్కూర్ - 1089

మొత్తం - 29943 (మార్క్ఫెడ్ లో మరో 38045 యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయి. )వచ్చే మూడు నెలలకు జిల్లాకు అవసరమైన యూరియా కొరకు పై అధికా రులకు నివేదిక పంపడమైనది ప్రతి వారం జిల్లాకు అవసరమైన మేర యూరియా కేటాయి ంచబడుతుంది. మండలాల్లో వేసిన పంటల ఆధారంగా యూరియా పంపిణీ చేయడం జరుగుతుంది.రైతులు యూరియా గురించి ఆందోళన చెందకుండా, అవ సరం మేరకు యూరియా కొనుగోలు చేయాలి. డీలర్లు అధికారుల ఆదేశాలు పాటిస్తూ రైతులకు యూ రియా పంపిణీ చేయాలి . అధికారులు సరైన ప్రణాళికలు వేస్తూ అర్హులైన రైతులకు సరి పడా యూరియా అందేలా చర్యలు తీసుకోవాలి.జిల్లా వ్యవసాయ అధికారి నారాయణపేట

## జిల్లా జడ్జి, సీ.పీ లను కలిసిన కలెక్టర్



**నిజామాబాద్, జనవరి 5( సమ యం న్యూస్).** నిజామాబాద్ జి ల్లా పాలనాధికారిగా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం జిల్లా న్యాయమూర్తి జీ.వీ.ఎన్.భరత లక్ష్మని, పోలీస్ కమిషనర్ సాయి చైతన్యలను మర్యా దపూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయస్థానాల సముదాయ భవనంలోని జిల్లా జడ్జి ఛాంబర్లో ఆమెకు పూల మొక్కను అందించారు. జిల్లా స్థితిగతులపై, న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే కార్యక్రమాలపై వారు కొద్దిసేపు చర్చించారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సీ.పీని కలిసి పూల బొకే అందించారు.

## సింగూర్ డ్యాం మరమ్మత్తుల నేపథ్యంలో ముందస్తు చర్యలపై కలెక్టర్ సమీక్ష



**సంగారెడ్డి, జనవరి 05( సమయం న్యూస్).:** సింగూర్ డ్యాం మరమ్మత్తుల నేపథ్యంలో ప్రజలకు తాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ముందస్తు కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల అధికా రులకు సూచించారు.సింగూర్ డ్యాం మరమ్మత్తులలో భాగంగా సింగూర్ జలాశయం నుండి నీటిని 517.5 లెవెల్ వరకు ఖాళీ చేయనున్న నేపథ్యంలో ఏర్పడే పరిణామాలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, తాగునీటిపై ప్రభావం చూపే గ్రామాలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, నీటిని వదలడంతో ప్రభావితమయ్యే ఇంటెక్ వెల్స్ వివరాలు, బల్క్ నీటి సరఫరాకు ప్రత్యామ్నాయ మార్గాలు, సింగూర్ కింద ఉన్న ఆయకట్టు ప్రాంతాలు, ఆయా ప్రాంతాల రైతులకు ముందస్తు సమాచారం అందించే అంశాలపై సోమవారం కలెక్టర్ ఛాంబర్లో జిల్లా కలెక్టర్ నీటిపారుదల, మిషన్ భగీరథ, హెచ్ఎండబ్ల్యూఎస్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించి సమగ్రంగా సమీక్షించారు.ఈ సందర్భంగా నీటిపారుదల శాఖ ఎస్.ఈ. రఘునాథ్ రావు మాట్లాడుతూ, సింగూర్ జలాశయం నుండి 517.5 లెవెల్ వరకు సుమారు 40 రోజులపాటు దశలవారీగా (ఫేస్డ్ మేనర్) పవర్ హౌస్ ద్వారా నీటిని విడుదల చేయనున్నట్లు తెలిపారు. అయినప్పటికీ జలాశయంలో 8.17 టీఎంసీల నీటి నిల్వ మిగులు తుందని, అందులో సుమారు 8 టీఎంసీల నీటిని తాగునీటి అవసరాలకు వినియోగించవచ్చని కలెక్టర్‌కు వివరిం చారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, సింగూర్ నీటిని 517.5 లెవెల్ వరకు ఖాళీ చేయనున్న నేపథ్యంలో మిగిలిన 8.17 టీఎంసీల నీటిని, ఎగ్జిస్టింగ్ సోర్స్‌ల ద్వారా ప్రజలకు తాగునీటి అవసరాలకు సరఫరా చేసేలా సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని అధికా రులను ఆదేశించారు.ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు.డ్యాం మరమ్మత్తుల సమయంలో ఆయా గ్రామాల రైతులకు ముందస్తు సమాచారం తప్పనిసరిగా అందించాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో అడిషనల్ కలెక్టర్ పాండు, మిషన్ భగీరథ ఎస్ ఈ రఘువీర్, ఈఈ లు, నీటిపారుదల శాఖ ఈఈ భీమ్, హెచ్ఎం డబ్ల్యూ ఎస్ అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు రోడ్ సురక్ష అభియాన్ ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు జనవరి5 నుండి 9 వరకు




**సంగారెడ్డి, జనవరి 05( సమయం న్యూస్).:** జిల్లాలో రోడ్డు ప్రమాదాలను నివారించి ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రోడ్ సురక్ష అభియాన్ ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని జనవరి 5 నుంచి 9 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య తెలిపారు.ఈ ప్రత్యేక ప్రచార కార్యక్రమంలో భాగంగా సోమవారం సంగారెడ్డిలోని పయనీర్స్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి. సౌజన్య మాట్లాడుతూ, రోడ్డు నియమాలను తప్పనిసరిగా పాటించడం ద్వారా అనేక ప్రమాదాలను నివారించ వచ్చ న్నారు.హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రతి ఒక్కరికీ తప్ప నిసరి అని, ట్రాఫిక్ సిగ్నల్స్, జీబ్రా క్రాసింగ్‌లు, రోడ్డు గుర్తులను పాటించడం ఎంతో ముఖ్యమని విద్యార్థులకు వివరించారు. వాహనాలు నడుపుతున్న సమయంలో మె-ుబైల్ ఫోన్ వినియోగం అత్యంత ప్రమాదకరమని, అతి వేగం ప్రాణాంతకమని హెచ్చరించారు.ఈ అవగాహన శిబిరంలో జిల్లా రవాణా అధికారి అరుణ, సంగారెడ్డి రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్, ప్రొబేషనరీ అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొని రోడ్డు భద్రతపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించి, వారు తమ కుటుంబ సభ్యులకు, సమాజానికి రోడ్డు భద్రతా సందేశాన్ని విస్తృతంగా చేర వేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పయనీర్స్ పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సాగు రంగంలో నిజామాబాద్ ఘనతను మరింతగా ఇనుమడింపజేయాలి

● కలెక్టర్ ఇలా త్రిపాఠి
● జిల్లా అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు ఉన్నాయని వెల్లడి




**నిజామాబాద్, జనవరి 05( సమయం న్యూస్).** వ్యవసాయ రంగంలో తనదైన ప్రత్యేకతను కలిగి ఉన్న నిజామాబాద్ జిల్లా ఘనతను మరింతగా ఇనుమడింపజేసేలా సాగు రంగానికి ఎనలేని ప్రాధాన్యతను ఇవ్వాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులకు సూచించారు. జిల్లా కేంద్ర సహకార బ్యాంకు సమావేశ మందిరంలో సోమవారం జరిగిన జిల్లా స్థాయి సాంకేతిక కమిటీ సమావేశానికి పర్సన్ ఇంచార్జి హోదాలో కలెక్టర్ అధ్యక్షత వహించారు. నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులు, అభ్యు దయ రైతులు పాల్గొన్నారు. సహకార బ్యాంకు ద్వారా రైతులకు అందిస్తున్న తోడ్పాటు గురించి, వివిధ కార్యక్ర మాల అమలు తీరుతెన్నుల గురించి కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ, ఆధునిక సేద్యం దిశగా రైతులను ప్రోత్సహిస్తూ, అవసరమైన వారికి తగిన తోడ్పాటు అందేలా చూడాలన్నారు. ముఖ్యంగా జిల్లాలో పసుపు పండించే రైతులకు పంట సాగు విషయంలో వెన్నుదన్నుగా నిలుస్తూ, ఆధునిక యంత్ర సామాగ్రిని వినియోగిస్తూ పెట్టుబడి ఖర్చు లు తగ్గించుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కాగా, జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా యూరియా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమైన పక్షంలో మరిన్ని నిల్వలు తెప్పించే బాధ్యత జిల్లా యంత్రాంగానిదేనని, ఈ విషయ ంలో రైతులు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవ సరం లేదని భరోసా కల్పించారు. యూరియా విషయంలో అక్కడక్కడా రైతులలో నెలకొని ఉన్న అపోహలను దూరం చేసేందుకు అభ్యుదయ రైతులు కృషి చేయాలని సూచించారు. మోతాదు మేరకే యూరియా వినియోగిం చేలా విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. యూరియా ఎరువుల పంపిణీలో అక్రమ రవాణా, బ్లాక్ మార్కెటింగ్, దళారుల ప్రమేయం వంటి అవకతవకలకు అడ్డుకట్ట వేసేందుకు వీలుగా ప్రభుత్వం యూరియా బుకింగ్ యాప్ ను అందుబాటులోకి తెచ్చిందని అన్నారు. రైతులు ఈ యాప్ ను వినియోగించుకునేలా చూడాల న్నారు. డీసీసీబీ జనరల్ మేనేజర్ అనుపమ, సీఈఓ నాగభూషణం, లీడ్ బ్యాంకు జిల్లా మేనేజర్ సునీల్, ఉ మ్మడి జిల్లాకు చెందిన వ్యవసాయ, ఉద్యానవన, మత్స్య, సహకార తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్య సంస్థల్లో సి స్సి మెరా లు పనిచేసే చర్యలు.

● జిల్లా కలెక్టర్ కే హైమావతి.



**సిద్దిపేట జనవరి5( సమయం న్యూస్).:** అన్ని ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల విద్యాలయాలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, సంక్షమ హాస్టల్లో సీస్సీ_మెరాలు పనిచేసేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్_. హైమావతి ఆదే శించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమానికి ముందు ఐడిఓసి కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో సీస్సీ_మెరాలు కచ్చితంగా పని చేసే స్థితిలో ఉండాలని అన్నారు. ఇప్పటి వరకు సీస్సీ_మెరాలు ఏర్పాటు చేయని విద్యా సంస్థలలో వెంటనే ఏర్పాటు చేయాలని, ఇప్పటికే సీస్సీ_మెరాలు ఉ ండి పనిచేయని వాటికి వెంటనే రిపేర్లు చేసి ఉపయో గంలోకి తీసుకురావాలని జిల్లా విద్యాశాఖ అధికా రిని మరియు వివిధ గురుకులాల జిల్లా కోఆర్డినేటర్లను ఆదేశించారు. సత్యసాయి సేవా ట్రస్ట్ వారి సహకారంతో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని వైద్య, ఆరోగ్య మరియు విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల సౌకర్యార్థం ఆర్టీసీ బస్సులు ఆగేల చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా కాలేజీలు, స్కూల్ ల టైములకు ఆర్టీసీ బస్సులు నడిచేలా చర్యలు తీసుకోవాలని టిజిఎస్ ఆర్టిసి సిద్దిపేట డిపో మేనేజర్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవిన్యూ అబ్దుల్ హమీద్, డిఆర్ఓ నాగరాజమ్మ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏవో తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛకు ప్రతీకలు..పక్షులు మీర్జాపూర్ లో పక్ష సంరక్షణ దినోత్సవం

**కోస్గి మండలం, జనవరి,05(సమయం న్యూస్) :** స్వేచకు ప్రతీకలు.. పక్షులు మీర్జాపూర్ లో పక్ష సంరక్షణ దినోత్సవం.అందమైన రెక్కలతో ఆకాశంలో విహరించే పక్షలు స్వేచ్ఛకు ప్రతీకలని జాతీయ హరిత దళ సమన్వయకర్త వార్ల మల్లేశం అన్నారు.జాతీయ పక్షల సంరక్షణ దినోత్సవం పురస్కరించుకొని సోమవారం నారాయణ పేట జిల్లా కోస్గి మండలం మీర్జాపూర్ గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, పర్యావరణ పరిరక్షణలో పక్షల పాత్ర.... అనే అంశంపై విద్యార్థుకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్ల మల్లేశం మాట్లాడుతూ అంతరించిపోతున్న పక్ష జాతులను రక్షంచుకోవడం కోసం అందరిలో అవగాహన పెంచేందుకు ప్రతి ఏటా జనవరి 5న జాతీయ పక్షల సంరక్షణ దినోత్సవం జరుపుకుంటున్నామని అన్నారు. పర్యావరణ సమతుల్యత కాపాడంతో పాటు క్రిమి కిటకాలను తింటూ పంటలకు ఆశించే చీడ పురుగుల సంఖ్యను పరిమితి చేస్తాయని అన్నారు. విత్తనాల వ్యాప్తి, అడవుల విస్తరణ, పరాగసంపర్కంలోపక్షలు కీలక పాత్ర వహిస్తాయని అన్నారు. పక్షలు స్వేచ్ఛగా ఆకాశం ఎగిరే నైపుణ్యశీలో సైన్స్ దాగి ఉందని, ఏరో డైనమిక్ సూత్రాలను పాటిస్తుందని గుర్తించి విమానాల తయారీ ఆలోచన మానవులకు కలిగిందని గుర్తు చేశారు. మూఢనమ్మకాలు, ఆహారం,అక్రమ రవాణా తోపాటు రసాయన మందుల ప్రభావం, అడవుల నరికివేత,



పట్టణీకరణ,ఆవాసాల విధ్వంసం, వంటి చర్యల వల్ల ఇప్పటికే 12% శాతం పక్ష జాతులు అంతరించి పోయాయాని అన్నారు. సెల్ టవర్స్ వల్ల చిన్న చిన్న పక్షలు దిశా నిర్దేశం కోల్పోతూ సంతానోత్పత్తి సామర్థ్యం పోగొట్టుకుంటున్నాయని అన్నారు. గాలి, నీరు, నేల, కాలుష్యాలు వాతావరణ మార్పులు, పక్షల మనుగడ పై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని అన్నారు. పక్షలను కాపాడాడమంటే మనల్ని మనం కాపాడుకోవడమే అనే విషయాన్ని గుర్తించి తగు చర్యలు తీసుకోవడం ద్వారా పక్ష జాతులు అంతరించిపోకుండా కాపాడుకోవచ్చు అని అన్నారు. అంతకుముందు విద్యార్థులకు నీకు నచ్చిన పక్ష అనే అంశం పై చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రమాద స్థాయిలో ఉన్న వివిధ రకాల పక్షల విరాలకు సంబంధించిన డాక్యుమెంటరీలు తిలకించారు. అనంతరం తమ చుట్టూ ఉన్న పక్షలు రక్షంచుకుంటామని వాటి స్వేచ్ఛకు భంగం కలిగించబోమని విద్యార్థులు ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి ఉపాధ్యాయులు సిద్రాములు, త్రిగుణ భీమయ్య,సంతోష్, మల్లయ్య, అహ్మద్ పాషా,రాజమణి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్.

**వికారాబాద్, జనవరి,05(సమయం న్యూస్) :** జిల్లా పోలీస్ కార్యాలయంలో ఈరోజు జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా,ఐపీఎస్ వికారాబాద్ జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌హెచ్‌ఓలు మరియు ఇతర పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన నేరాల పరిస్థితి, కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల స్థితిగతులను ఎస్పీ సమగ్రంగా సమీక్షంచారు. ముఖ్యంగా ఎక్కువకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, వాటిని త్వరితగతిన పరిష్కరించేలా అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్ కేసుల విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం చేయకుండా డీఎస్పి మరియు ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులు పర్యవేక్షణ చేస్తూ దర్యాప్తును వేగవంతం చేయాలని ఆదేశించారు. కోర్టుల్లో కేసుల ప్రాసిక్యూషన్ బలంగా ఉండేలా సాక్ష్యధారాల సేకరణలో లోపాలు ఉండకుండా చూడాలని, ఛార్జ్‌షీట్లను గడువులోగా దాఖలు చేయాలని సూచించారు.జిల్లాలో రోడ్డు ప్రమాదాలకు ప్రమాదాలకు దారితీసే బ్లాక్ స్పాట్లను గుర్తించి, సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ట్రాఫిక్ నియమాల అమలులో ఎలాంటి రాజీ లేకుండా నిరంతర వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని స్పష్టం చేశారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీటీవీ మెరాల ఏర్పాటు, నిర్వహణ పకడ్బందీగా ఉండేలా చూడాలని, మట్కా, జూదం, గంజాయి మరియు ఇతర అక్రమ కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతూ, ఎన్ఫోర్స్‌మెంట్ చర్యలను మరింత పెంచాలని, అలాంటి కార్యకలాపాల్లో పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని



సూచించారు.పోలీస్ స్టేషన్లలో 5ూ విధానాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని, రికార్డుల నిర్వహణ పారదర్శకంగా ఉండాలని, ప్రతి కేసు వివరాలను సకాలంలో ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నాన్-బైలబుల్ వారెంట్లు (చీదీఔలు) పెండింగ్ లేకుండా అమలు చేయాలని, కోర్టులతో సమన్వయం పెంచుకోవాలని సూచించారు .ఫిర్యాదుదారులకు తక్షణ స్పందన అందించి నమ్మకం పెంపొందించాలని పేర్కొన్నారు.మహిళల భద్రత, పిల్లల రక్షణ, ఎస్సీ/ఎస్టీ అట్రాసిటీ కేసుల విషయంలో అత్యంత సున్నితంగా మరియు కఠినంగా వ్యవహరించాలని ఎస్పీ ఆదేశించారు. పాత నేరస్థులు, రౌడీ షీటర్లు, అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని, గ్రేవ్ కేసులలో పక్కా ఆధారాలతో దర్యాప్తు పూర్తి చేసి నిందితులకు శిక్ష పడేలా చూడాలని స్పష్టం చేశారు.గుడ్ వర్క్ చేసిన అధికారులకు క్యాష్ రివార్డ్స్ :గత నెలలో జిల్లాలో గుడ్ వర్క్ చేసిన పోలీస్ అధికారులు ధరూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రఘురాములు,పరిగి సర్కిల్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ సిబ్బంది నరేష్, రామకృష్ణ, పాండురంగం, మున్నయ్య, దస్తప్ప, ప్రతాప్ సింగ్, జమీల్ మరియు అనిల్ కుమార్ లను ఎస్పీ క్యాస్ రివార్డ్స్ లు ఇవ్వడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో జిల్లా అదనపు ఎస్పీ బి. రాములు నాయక్, డీసీఆర్బి డీఎస్పీ జానయ్య, వికారాబాద్ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, తాండూర్ డీఎస్పీ ఎన్. యాదయ్య, పరిగి డీఎస్పీ శ్రీనివాస్,ఎఆర్ డీఎస్పీ వీరేష్,ఏఓ ఖాజామోహినొద్దీన్, సీఐ లు,ఆర్ ఐ లు,ఎస్సై లు, ఆర్ ఎస్సైలు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది

# మున్సిపల్ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగరవేస్తాం

- నూతన మున్సిపాలిటీనీ అభివృద్ధి మార్గంలో తీర్చిదిద్దుతాం
- ప్రజాక్షత్రంలో పోరాడుతాం.. సమస్యలను ఎండగడుతాం
- పార్టీ కోసం కష్టపడ్డ కార్యకర్తలకు అండగా నిలుస్తాం
- బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి
- వివిధ పార్టీలో నుంచి 300 మంది యువకుల చేరిక
- పార్టీ క్యాడర్లో నూతన ఉత్సాహం



**పటాన్ చెరు, గుమ్మడిదల, జనవరి 5(సమయం న్యూస్):** రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో తెలంగాణ సమృద్ధి, అభివృద్ధికి ప్రతీకగా గులాబీ జెండా ఎగరవేయడం ఖాయమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చిమ్ముల గోవర్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. నూతన మున్సిపాలిటీనీ అభివృద్ధి మార్గంలో తీర్చిదిద్దేందుకు పార్టీ ప్రజాక్షత్రంలో బలంగా పోరాడుతుందని తెలిపారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిని ఎండగడుతూ పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. గుమ్మడిదల మున్సిపాలిటీ కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మండల పార్టీ అధ్యక్షుడు కొత్తపల్లి ప్రభాకర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, యువకులు వివిధ పార్టీలో నుంచి 300 మంది యువకుల చేరిక పార్టీలో చేరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చిమ్ముల గోవర్ధన్ రెడ్డి నూతన సభ్యులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ చేరికలతో పార్టీ క్యాడర్‌లో నూతన ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గత రెండు సంవత్సరాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. అభివృద్ధి పనులు చేయడంలో పూర్తిగా విఫలమైందని పేర్కొన్నారు. గ్రామాల్లో సమస్యలు పేరుకుపోతున్నా వాటి పరిష్కారానికి సరైన చర్యలు లేకపోవడం ఆందోళన కలిగించే అంశమని తెలిపారు. ఎన్నికల సమయంలో మహిళలకు రూ.2500, పెన్షన్లు, తులం బంగారం, పంట బోనస్ వంటి హామీలు ఇచ్చి వాటిని అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.ముఖ్యంగా రైతులకు చెందిన భూములను అన్యాయంగా స్వాధీనం చేసుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికే గుమ్మడిదలకు చెందిన 109 సర్వే నంబర్ భూమిని స్వాధీనం చేసుకున్నారని, త్వరలో నల్లవల్లి, దోమడుగు, అన్నారం గ్రామాలకు సంబంధించిన భూములను కూడా లాక్కోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.గ్రామాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేసి ప్రజలపై అధిక పన్నుల భారం మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.గత బీఆర్ఎస్ పాలనలో ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు సంక్షమ పాలన అందిందని గుర్తు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు జిల్లా ప్రజల సమస్యలపై నిరంతరం స్పందిస్తూ పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ప్రతి గ్రామంలో తాగు నీరు, రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వంటి మౌలిక వసతులతో పాటు సంక్షమ పథకాలు అమలు చేశామని వివరించారు. రైతులకు సంక్షమ పథకాలు అందించి 24 గంటలు ఉచిత కరెంట్‌తో ప్రతి పంటకు అండగా నిలిచామని స్పష్టం చేశారు.రానున్న మున్సిపల్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలను గెలిచి భారీ మెజారిటీతో గుమ్మడిదల గడ్డపై గులాబీ జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. పార్టీ బలోపేతానికి కృషి చేసిన ప్రతి కార్యకర్తకు భవిష్యత్తులోనూ పూర్తి మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కుమార్ గౌడ్, విజయభాస్కర్ రెడ్డి, హుస్సేన్, సర్పంచ్ కొమ్ము శీను, మాజీ సర్పంచ్ లు రాజశేఖర్,వేణు, మురళి, నాయకులు రాజేష్, బాల కృష్ణ రెడ్డి, దేవేందర్ రెడ్డి, నరేందర్ రెడ్డి, వెంకట్రాంరెడ్డి,మొగులయ్య సంజీవరెడ్డి, రామ్ రెడ్డి, కుమార్, నరహరి, రాజు,పొన్నాల శ్రీనివాస్ రెడ్డి, సత్యనారాయణ, రుక్మారెడ్డి, ఆంజనేయులు, గోపాల్, అశోక్, మురళి, చక్రపాణి, భాస్కర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యక్తిత్వ వికాసం పై అవగాహన



**బొంరస్ పేట మండలం, జనవరి,05(సమయం న్యూస్) :** కొడంగల్ ప్రభుత్వ డీగ్రీ కళాశాల ఎన్. ఎస్. యూనిట్ -1, 2 ల సంయుక్త ఆధ్వర్యంలో శీతాకాల ప్రత్యేక శిబిరం నాల్గవ రోజు కార్యక్రమం లో భాగంగా రేగడి మైల్వార్ గ్రామంలో సోమవారం వ్యాయామం,యోగ నిర్వహణ, స్వచ్ఛ భారత్, బడి మానివేసిన విద్యార్థులు పై సర్వే నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగానే NSS వాలంటీర్లు బడి మానివేసిన స్వాతి,7, తరగతి విద్యార్థిని తిరిగి పాఠశాలలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో రేగడి మైల్వేర్ గ్రామానికి చెందిన గోవింద్ గౌడ్, 1969 లో ప్రారంభం అయిన తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తో ముఖా ముఖి సమావేశంNSS వాలంటీర్లు చేశారు. దీనితో పాటు రేగడి మైల్వేర్ గ్రామ ప్రజల కు అపరిశుభ్రత వలన కలిగే వివిధ రకాల వ్యాధులు,వాటి నివారణ చర్యలు అవగాహన ను కల్పించారు. మధ్యాహ్న భోజనం తర్వాత ఉపాధ్యాయుడు సర్దార్,వ్యక్తిత్వ వికాసం పై వాలంటీర్లకు నైతిక విలువలు, సామాజిక సేవ, మానవతా విలువలు,ఆత్మవిశ్వాసం, ప్రవర్తన, సామాజిక నైపుణ్యాలు, క్రమశిక్షణ, భావోద్వేగ మేధస్సు వంటి అంతర్గత లక్షణాలను పెంపొందించుకోవడం గూర్చి వాలంటీర్లు కు వివరించారు. ఈ నాటి కార్యక్రమం లోNSS యూనిట్ I,II ప్రోగ్రామ్ ఆఫీసర్ లు డా. ఆర్. శ్రీనివాస్,డా. ఈ. సొమ్లు, డా.జైపాల్, మల్లేశం ,గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.


# గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ లో కౌన్సిల్ సంఖ్య పెంచండి



**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 5 :** గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలోని వార్డుల సంఖ్యను పెంచాలని బిఆర్ఎస్ పట్టణ మున్సిపల్ అధ్యక్షుడు నవాజ్ మీరా మున్సిపల్ కమిషనర్ కి ఫిర్యాదు చేయడం జరిగింది గతంలో వార్డుల ప్రక్రియ 20 వార్డులను ఏర్పాటు చేయడం జరిగింది గత రెండు పర్యాయాలు ఇదేవిధంగా పాలకవర్గం ఏర్పాటు చేయడం జరిగింది కాలేశ్వరం ప్రాజెక్టు లోని ముంపు గ్రామాలను గజ్వేల్ ప్రజ్ఞాపూర్ లో కలపడం వల్ల ఓటర్ల సంఖ్య పెరిగి వార్డులను సంఖ్యను పెంచాలని తెలియజేశారు గతంలో 32000 సంఖ్య సుమారుగా ఉండెను ఇప్పుడు ముంపు గ్రామాలు కలుపుకొని 46740 గా ఓటర్ల జాబితాను తయారుచేసి ప్రకటించబడినది విషయంలో 20 వార్డుల లోనే వార్డు ఒక్కంటికి సుమారు 2000 నుండి 2570 వరకు కేటాయించి ఓటర్ జాబితా ప్రకటించినారు వార్డు భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రీయంగా ఓటర్ జాబితాలు పూర్తిస్థాయిలో పరిశీలించి ప్రభుత్వంకు నివేదించి గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ 30 లేక 32 వార్డులుగా విభజించి ఎన్నికలు జరిపించాలని తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ కి విజ్ఞప్తి చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి ఊడెం కృష్ణారెడ్డి స్వామి చారి బొగ్గుల సురేష్ పుల్ల బీరయ్య శీలసారం ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు

# ఆటో డి కొని వ్యక్తి మృతి

- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం ఎస్సై విట్టాల్ రెడ్డి



**యాలాల మండలం, జనవరి 05, (సమయం న్యూస్):** గిరిజాపూర్ గ్రామానికి చెందిన్. సురేష్ స/శీ గంగప్ప వయసు:30 సంవత్సరాలు అనే వ్యక్తి తన యొక్క మోటార్ సైకిల్ూ 08 2759వాహనంపై తాండూరు వెళుతుండగా చెన్నారం గేటు సమీపంలో 34 2748 గల ఆటో డ్రైవరు అతివేగంగా అజాగ్రత్తగా నడుపుకుంటూ వచ్చి బైక్ ను డి కొట్టడంతో సురేష్ కు రక్త గాయాలు కాగా వారి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు. కేసునమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు యాలాల ఎస్సై విట్టాల్ రెడ్డి తెలిపారు.

# కొమురవెల్లి ఆలయ డైరెక్టర్ నంగునూరి సత్యనారాయణ కు సన్మానం



**సమయం న్యూస్ గజ్వేల్ జనవరి 5:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ మాజీ ఉప సర్పంచ్ నంగునూరి సత్యనారాయణ ఇటీవల కొమురవెల్లి డైరెక్టర్ గా ఎన్నిక అయిన సందర్భంగా వారిని బాలల సంక్షమ సమితి చైర్మన్, జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ దేశబోయిని నర్సింహులు యువజన ప్రతినిధులతో కలిసి సన్మానించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ఉపసర్పంచ్ గా కౌన్సిలర్ పనిచేసి సామాజిక సేవలో దార్మిక సేవలో ముందువరుసలో ఉండే నంగునూరి సత్యనారాయణ కొమరవెల్లి ఆలయ డైరెక్టర్ గా నియామకమవ్వడం గజ్వేల్ కు గర్వకారణం అన్నారు వారు రాబోవు రోజుల్లో మహోన్నతస్థితి కీ చేరుకోవాలని కోరుకుంటున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో యువజన నాయకులు ఇంద్రాగౌడ్, సాధుల్ తదితరులు పాల్గొన్నారు

# పొలిటికల్ పార్టీలతో ఓటర్ లిస్ట్ పై సమావేశం

- కొడంగల్ మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్



**కొడంగల్ మున్సిపల్, జనవరి,05(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణ కేంద్రంలోని మున్సిపాల్ కార్యాలయంలో స్టేట్ ఎలక్షన్ కమిషన్ ఆదేశానుసారం కొడంగల్ పట్టణంలోని పొలిటికల్ పార్టీలతో ఓటర్ లిస్ట్ పై సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొనడం జరిగింది

# నీటి సరఫరా పాక్షకంగా/మొత్తంగా నిలిపివేత

● డి.శ్రీనివాస్ మిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్ మహబూబ్ నగర్

**మహబూబ్ నగర్,జనవరి,05(సమయం న్యూస్) :** తేదీ 07-01-2026 ఉదయం 9:00 గంటల నుండి 10-01-2026 అర్ధరాత్రి 12:00 గంటల వరకు (మొత్తం 90 గంటలపాటు) నీటి సరఫరా పాక్షకంగా / మొత్తంగా నిలిపివేయబడుతుంది.

కారణం:ఎల్లూరు, నాగర్కర్నూల్ దగ్గర బటర్ఫ్లై వాల్వ్ గాస్కెట్ డ్యామేజ్ ఏర్పడినది. అట్టి పనినీ రిపేర్ చేయడానికి నీటి సరఫరా పాక్షకంగా/మొత్తంగా నిలిపివేయబడుతుంది.

ఈ మరమ్మత్తు పనుల కారణంగా నీటి సరఫరా నిలిచే ప్రాంతాలు:మహబూబ్నగర్ జిల్లాలో నీ 13 మండలలోని 518 గ్రామాలకు, 4 మున్సిపాలిటీలకు, నారాయణపేట జిల్లాలోని 8 మండలలోని 184 గ్రామాలకు, 2 మున్సిపాలిటీలకు మరియు నాగర్కర్నూల్ జిల్లాలోని తిమ్మాజీపేట మండలంలోని 8 గ్రామాలకు.మున్సిపాలిటీలు: మహబూబ్నగర్ జిల్లాలో మహబూబ్నగర్, జడ్చర్ల, బూత్పూర్ మరియు దేవరకద్ర.

నారాయణపేట జిల్లాలో మక్తల్, నారాయణపేట.మొత్తంగా 710 గ్రామాలు మరియు 6 మున్సిపాలిటీలు ఈ ప్రభావిత పరిధిలోకి వస్తాయి.కావున ప్రజలందరూ సహకరించగలరని మనవి.డి. శ్రీనివాస్కార్యనిర్వాహక అభియంతమిషన్ భగీరథ గ్రిడ్ డివిజన్మహబూబ్నగర్

# ప్రజావాణి కార్యక్రమము లో వచ్చిన ప్రజా ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

● జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు సూచించారు.



**వికారాబాద్, జనవరి,05(సమయం న్యూస్) :** సోమవారము సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశము హాలు నందు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 85 ఫిర్యాదులు వచ్చాయని, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు ఇంచార్జి అదనపు కలెక్టర్ రాజేశ్వరి, అదనపు కలెక్టర్ సుదీర్, ట్రైని కలెక్టర్ హర్స్ చౌదరి, ఆర్ డి ఓ మంగీ లాల్, ఆర్ డి ఓ వాసు చంద్ర,డి ఆర్ డి ఓ శ్రీనివాస్ లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు.పెన్షన్, వ్యవసాయం, గృహనిర్మాణ శాఖ, భూ సమస్యలకు సంబంధించిన పిర్యాదులు వచ్చాయని, అట్టి ఫిర్యాదులను సంబంధిత అధికారులు దరఖాస్తు లను పెండింగ్ లో ఉంచ కుండా ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించెందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.ప్రజావాణి కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

# టిజీవో సేవలు అమోఘం

● జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జనవరి5( సమయం న్యూస్).:** సోమవారం కలెక్టర్ కార్యాలయంలో టిజిఓస్ యూనియన్ తరపున జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా టీజీవో అధ్యక్షులు విట్టల్ సెక్రటరీ నాగభూషణం ట్రెజరర్ శ్రీనివాస్ అసోసియేట్స్ ప్రెసిడెంట్ ఎల్లయ్య వైస్ ప్రెసిడెంట్ వేణు జాయింట్ సెక్రటరీ నాగ రాజు ఆర్గనైజర్ సెక్రటరీ సుదర్శన్ ఆఫీస్ సెక్రటరీ బాల్ రెడ్డి డి పి ఆర్ ఓ రాజు మరియు లింగేశ్వర్ వారితో పాటు వివిధ శాఖలకు చెందిన హెచ్వోడీస్ దేవకుమార్ ఎల్లయ్య శ్రీనివాస్ అనిల్ కుమార్ మొదలగున్నవారు ఈ కార్యక్రమంలో పాల్గొని జిల్లా కలెక్టర్ గారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియపరిచినారు .జిల్లా కలెక్టర్ మంచిగా పని చేసి ముందు వరుసలో మెదక్ జిల్లాను తీస్కుళ్లాలని ఆదేశాలు ఇచ్చినారు.

# నారాయణపేట జిల్లా నర్వ మండల ఎంపీడీఓగా ట్రైనీ కలెక్టర్ . ప్రణయ్ కుమార్



**నర్వ మండలం, జనవరి,05(సమయం న్యూస్) :** (తేది: 05.01.2026 నుండి 02.02.2026 వరకు) నాలుగు వారాల కాలపరిమితికి గాను నేడు అధికారికంగా విధులు స్వీకరించారు. Aspirational block Programme లో భాగంగా నర్వ మండలాన్ని ఎన్నికైన సందర్భంగా నర్వ మండల అభివృద్ధి కొరకై District Administration Asst. Collector ని నర్వ మండలానికి ఎంపీడీఓ గా నాలుగు వారాల కాలపరిమితికి గాను నియమించడం జరిగింది. అందుకు గాను ట్రైనీ కలెక్టర్ మాట్లాడుతూ, నర్వ మండలంలో పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల పర్యవేక్షణ, ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు ప్రభుత్వ సంక్షమ పథకాల సమర్థవంతమైన అమలుపై ప్రత్యేక దృష్టి సారిస్తానని తెలిపారు. నాలుగు వారాల వ్యవధిలో మండల పరిపాలనను సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.మండల అధికారులు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, నర్వ మండల అభివృద్ధి కార్యక్రమాలలో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

# జాతీయ భద్రతా మాసోత్సవాలు విద్యార్థులకు అవగాహన



**సిద్ధిపేట జనవరి 5( సమయం న్యూస్). :** జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల్లో భాగంగా సిద్దిపేట ప్రవేట్ స్కూల్స్ అసోసియేషన్ సంఘాల ప్రతినిధులతో సిద్దిపేట జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీ వి.లక్ష్మణ్ సోమవారం స్థానిక రవాణా శాఖ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యానికి పలు రహదారి భద్రత సూచనలు చేయడం జరిగింది.అందులో భాగంగా ప్రతి పాఠశాల బస్సులో ఫస్ట్-ఎయిడ్ బాక్స్, ఫైర్ ఎక్స్టింగ్విషర్ తప్పనిసరిగా కలిగి ఉండాలని కిటికీలకు అడ్డంగా గ్రిల్స్,అత్యవసర ద్వారం ఉండాలని ,ప్రతి బస్సులో తప్పనిసరిగా అటెండర్ అవసరం ,అని డ్రైవర్లు సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడుపుతున్నారా లేదా అతివేగం తో నడుపుతున్నారా అన్న విషయాన్ని పిల్లల నుండి ప్రతి రోజు సమాచారం సేకరించి డ్రైవర్స్ కి తగు సూచనలను చేయాలని పేర్కొన్నారు. పిల్లల భద్రతకు సంబంధించి ప్రతి యాజమాన్యం అన్ని రహదారి భద్రతా ప్రమాణాలను ,నిబంధనలను పాటించడం ద్వారా విద్యార్థుల భద్రతను పెంచవచ్చు మరియు ప్రమాదాలను నివారించవచ్చు. అని సూచించారు.ప్రభుత్వ ఆదేశాను సారము పాఠశాల యాజమాన్యం ద్వారా ప్రతి పాఠశాల విద్యార్థి తల్లి తండ్రులకు రహదారి భద్రతకు సంబంధించి ప్రమాణ పత్రం మరియు ప్రతిజ్ఞ పత్రం అందించడం జరిగింది .ఈ కార్యక్రమం లో ఋూ శ్రీ లక్ష్మణ్ గారి తో పాటు,ఎం వి ఐ శ్రీ పి శంకర్ నారాయణ,ఏ ఎం వి ఐ శ్రీకాంత్ రెడ్డి మరియు ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్సభ్యులు ు=ూూపీూ ప్రెసిడెంట్ శ్రీనివాస్ బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ ప్రెసిడెంట్ జే మల్లారెడ్డి ,ూూూ ప్రెసిడెంట్ భగవాన్ రెడ్డి మరియు ఇతర సభ్యుల పాల్గొన్నారు..సిద్దిపేట మోటార్ వెహికల్స్ ఇన్స్పెక్టర్ శ్రీ పి శంకర్ నారాయణ గారు సాయంత్రం పలు పాఠశాల బస్ లను తనికి చేయడం జరిగింది..ఇందులో భాగంగా డ్రైవర్స్ లకి అతి వేగంగా బస్ నడపవొద్దని,పరిమితికి మించి పిల్లలను ఎక్కిం చుకోవొద్దని,సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవొద్దని,విధిగా డ్రైవర్ యూనిఫార్మ్ ధరించాలని,సమయానుసారం లైసెన్స్ రెన్యువల్ చేసుకోవాలని బస్ కి సంబంధించిన ఫిట్నెస్, ఇన్స్యూరెన్స్, పర్మిట్ వంటి పత్రాలను వెంటే ఉంచుకోవాలని సూచించారు..

# రోగులకు ప్రభుత్వ ఆసుపత్రులలో మెరుగైన వైద్యం అందించేలా కృషి

● జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

● వైద్య ఆరోగ్యశాఖ పని తీరు పై సమీక్షంచిన జిల్లా కలెక్టర్



**పెద్దపల్లి, జనవరి -05:( సమయం న్యూస్).:** జిల్లాలోని రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందేలా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో వైద్యారోగ్య శాఖ పని తీరుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య కొంత తగ్గిందని, ప్రసవాల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ తెలిపారు. ఏ.ఎన్.ఏం రిజిస్ట్రేషన్ నుంచి టీకాలు వేయించడం, రెగ్యులర్ చెకప్, ప్రసవం ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే లోపం ఉండాలని కలెక్టర్ తెలిపారు. ప్రసవం తర్వాత కూడా బాలింత, శిశువు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ రెగ్యులర్ ఫాలో అప్ చేయాలని అన్నారు. ఆర్.బీ.ఎస్.కే బృందాలు రెగ్యులర్ గా ప్రభుత్వ స్కూల్స్ ను తనిఖీ చేస్తూ పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించాలని అన్నారు. ఆర్.బి.ఎస్.కే బృందాలు సందర్శించినట్లుగా పాఠశాలల కు సర్టిఫికెట్ జారీ చేయాలని, సదరు వివరాలు ఆన్ లైన్ లో నమోదు జరిగేలా విద్యాశాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

ఎన్.సి.డీ సర్వే 82% జరిగిందని ఆ వివరాలు ఆన్ లైన్ లో నమోదు చేయాలని అన్నారు. మార్చి నెలాఖరు వరకు 100% ఎన్.సి.డి సర్వే పూర్తి చేయాలని, ఎన్.సి.డి సర్వేలో మధుమేహం బిపి ఉన్నవారికి ప్రభుత్వం తరఫున అవసరమైన మెడికల్ కిట్ లు రెగ్యులర్ గా అందించాలని అన్నారు. ప్రతి వారం ఎం.ఎల్.హెచ్.పి లు 50 ఎన్.సి.డి సర్వే శాంపిల్స్ ర్యాండం గా క్రాస్ చెక్ చేయాలని కలెక్టర్ సూచించారు.జిల్లాలో పాజిటివ్ గా తేలిన టిబి కేసుల వ్యాధిగ్రస్తులకు న్యూట్రిషన్ కిట్, అవసరమైన చికిత్స, ప్రభుత్వ సహాయం అందేలా చూడాలని అన్నారు. క్షత్రస్థాయిలో పర్యటనలు చేస్తూ టీబీ వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. రోగులకు డయాగ్నొస్టిక్ హబ్ ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి ఫలితాలు అందించడంలో పెద్దపెల్లి జిల్లా ముందు ఉందని అన్నారు. పీ.హెచ్.సి లో మరమ్మత్తు గురైన వైద్య పరికరాలను బాగు చేసేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యశ్రీ పరిధిలో స్పెషలిస్ట్ వైద్య సేవలు ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో అధికంగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల రోగులు మంచి అభిప్రాయంతో ఉండేలా మన పని తీరు ఉండాలని అన్నారు. వైద్యులు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులను నిరాకరించడానికి వీలు లేదని అన్నారు.రోగులతో ప్రవర్తించే తీరు పట్ల సిబ్బంది, నర్సులను ఎప్పటికప్పుడు ట్రైన్ చేయాలని అన్నారు.జిల్లాలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో నిబంధనల మేరకు పారిశుధ్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.ఈ సమావేశంలో జిల్లా అదనపు ఆరోగ్యశాఖ అధికారి వాణిశ్రీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీధర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు




# కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయండి

● నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి

● 63 వ డివిజన్ లో క్షత్ర స్థాయి లో సందర్శన...

**వరంగల్ జనవరి 5( సమయం న్యూస్).:** కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నగర మేయర్ శ్రీమతి గుండు సుధారాణి ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

సోమవారం బల్దియా పరిధి లోని 63 వ డివిజన్ లో క్షత్ర స్థాయిలో సందర్శించి స్థానికంగా ఉన్న సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భం గా డివిజన్ లో జామా మసీదు వద్ద పైప్ లైన్ లీకేజీ నీ గమనించిన మేయర్ వెంటనే సమస్యను పరిష్కరించి నీటి సరఫరా లో ఆటంకాలు లేకుండా చూడాలని ఏ ఈ నీ ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ విజ్ఞప్తి మేరకు డివిజన్ లోని రోమన్ క్యాథలిక్ చర్చి ప్రాంతం లో కల్వర్టు నిర్మించాలని కోరగా స్పందించిన మేయర్ ఇంజనీరింగ్ అధికారులతో ఫోన్ లో మాట్లాడి వెంటనే అంచనాలు తయారు చేయాలని ఆదేశించారు. అనంతరం డివిజన్ లో గల కమెలా తో పాటు చేపల మార్కెట్ ప్రాంతం ను మేయర్ ప్రత్యక్షం గా పరిశీలించారు. ఈ కార్యక్రమం లో డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలే ఏ ఈ విజయ లక్ష్మి స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు



# ప్రభుత్వ హాస్టళ్లను ప్రత్యేక అధికారులు తనిఖీ చేయాలి

● హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

**హనుమకొండ: జనవరి5( సమయం న్యూస్)** ప్రభుత్వ వసతి గృహాలను ప్రత్యేకాధికారులు నెలలో రెండు సార్లు తప్పని సరిగా తనిఖీ చేయాలని, టీచర్లు లేకుండా విద్యార్థులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను వినాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మండల ప్రత్యేకాధికారులను ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాలులో ప్రజావాణి కార్యక్రమం అనంతరం మండల ప్రత్యేక అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఫిర్యాదుల పెట్టె (కంప్లైంట్ బాక్స్) తప్పనిసరిగా ఉండాలని దానికి సంబంధించిన తాళం ప్రత్యేక అధికారి వద్ద మాత్రమే ఉండాలన్నారు. వసతి గృహాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్య సమస్యలను పర్యవేక్షం చాలన్నారు. వసతి గృహాల్లో ప్రధానంగా విద్యా, ఆరోగ్యం, శానిటేషన్ పట్ల ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదా పరిశీలించాలన్నారు. వసతి గృహాల తనిఖీ సందర్భంలో మండల ప్రత్యేక అధికారులు విద్యార్థులతో కలిసి బోజనం చేయాలన్నారు. వారి సమస్యలను విని అక్కడికక్కడే పరిష్కరించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## టెన్నిస్ అసోసియేషన్ నుంచి వైదొలిగిన జకోవిచ్

సెర్బియన్ టెన్నిస్ దిగ్గజం నొవాక్ జకోవిచ్ సంచలన నిర్ణయం తీసుకున్నాడు. తాను ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ నుంచి వైదొలుగుతున్నట్లు తాజాగా ప్రకటించాడు. అయితే ఈ అసోసియేషన్?ను నొవాక్ ఆరేళ్ల కిందట వాసెక్ పోస్పిసిల్?తో కలిసి స్థాపించాడు. టెన్నిస్ ప్లేయర్లకు ౕరీర్ పరంగా మద్దతుగా నిలుస్తూ, సహాయం చేయాలన్న ఉద్దేశంతో ఇది స్థాపించారు. అయితే ఇప్పుడు అసోషియేషన్‌లో పారదర్శకత లోపించిందని సెన్సేషనల్ కామెంట్స్ చేశాడు. అందుకే ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపాడు. ఈ మేరకు సోషల్ మీడియా ఎక్స్‌లో పోస్ట్ షేర్ చేశాడు. ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్ల్ అసోసియేషన్? నుంచి పూర్తిగా తప్పుకోవాలని అనుకుంటున్నాను. చాలా ఆలోచించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నా. టెన్నిస్ ప్లేయర్లకు మద్దతు, ఇండిపెండెంట్ వాయిస్ ఇచ్చేందుకు వాసెక్?తో కలిసి నేను ఈ ఆర్గనైజేషన్ స్థాపించినందుకు గర్విస్తున్నా. కానీ, అసోసియేషన్?లో పారదర్శకత లోపించింది. ప్రస్తుతం సంస్థ నడుస్తున్న విధానాలతో నేను ఇకపై ఏకీభవించలేనని అర్థమైపోయిందిః అని జకోవిచ్ పోస్ట్?లో రాసుకొచ్చాడు. అలాగే ఇకపై తన పూర్తి దృష్టంతా టెన్నిస్ ౕరీర్?, కుటుంబంపైనే ఉంటుందని చెప్పుకొచ్చాడు. ःఇకపై నా ఫోకస్ మొత్తం టెన్నిస్ ౕరీర్?, నా కుటుంబం, నా విలువలను ప్రతిబింబించే క్రీడలకు నా వంతు సహకారం అందిస్తాను. ఇందులో కొనసాగుతున్న క్రీడాకారులు అందరికీ శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. కానీ ఈ అసోసియేషన్‌తో నా ప్రయాణం మాత్రం ఇక్కడితో ముగిసిందిః అని జకోవిచ్ పేర్కొన్నాడు. తన తోటి ఆటగాడు వాసెక్? పోస్పిసిల్?తో కలిసి జకోవిచ్ 2019లో ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్‌ను స్థాపించారు. ప్రొఫెషనల్ టెన్నిస్‌ను నిర్వహిస్తున్న తీరుపై ఆటగాళ్లలో అసంతృప్తి పెరగడంతో దీనికి స్థాపించారు. ఈ ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్ అనేది పురుష, మహిళా టెన్నిస్ ఆటగాళ్ల సంఘం. ఈ సంస్థ క్రీడా పాలక సంస్థలతో సంబంధం లేకుండా ఆటగాళ్లకు స్వేచ్ఛనివ్వడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో ఉమెన్స్ టెన్నిస్ అసోసియేషన్, ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్ , ఇంటర్నేషనల్ టెన్నిస్ ఇంటిగ్రిటీ ఏజెన్సీ ఉన్నాయి. ప్రొఫెషనల్ టెన్నిస్ ప్లేయర్స్ అసోసియేషన్‌ను ప్రారంభానికి ముందు, ఆటగాళ్లు ప్లేయర్ కౌన్సిల్ ద్వారా ప్రాతినిధ్యం వహించేవారు. ఇది పర్యటన నిర్మాణంలో ఒక సలహా సంస్థగా ఉండేది. అయితే ఆటగాళ్లు తమ స్వరాన్ని, ఆందోళనలను వ్యక్తపరిచేందుకు ఒక బలమైన, స్వతంత్ర వేదిక అవసరమని జకోవిచ్ భావించాడు. దీంతో 2019లో వైదొలిగి ఈ అసోసియేషన్?కు ప్రారంభించాడు. తాజాగా ఇందులో నుంచి కూడా బయటకు వచ్చేశాడు.

## ఇకపై వైట్‌వాష్‌లు ఉండవు.. టెస్టుల్లో సర్జికల్ స్ట్రైకులే..

భారత టెస్టు క్రికెట్‌లో గత కొంతకాలంగా ఎదురవుతున్న పరాజయాలకు అడ్డుకట్ట వేయాలని టీమిండియా టెస్ట్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ నడుం బిగించారు. సొంతగడ్డపై సౌతాఫ్రికాతో జరిగిన టెస్ట్ సిరీస్‌లో 0-2తో వైట్‌వాష్‌కు గురైన తర్వాత, భవిష్యత్తులో ఇలాంటి పరిస్థితులు రాకూడదని గిల్ ఒక మాస్టర్ ప్లాన్ సిద్ధం చేశారు. దీని కోసం ఆయన ఏకంగా బీసీసీఐ ముందు ఒక భారీ డిమాండ్ ఉంచారు. గిల్ తీసుకున్న ఈ నిర్ణయం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గత 13 నెలల కాలంలో టీమిండియా సొంతగడ్డపై రెండుసార్లు టెస్ట్ సిరీస్‌లలో ఘోరంగా ఓడిపోయింది. ముఖ్యంగా సౌతాఫ్రికా చేతిలో ఎదురైన ఓటమి బీసీసీఐని ఆలోచనలో పడేసింది. ఈ నేపథ్యంలో సెలెక్టర్లు, టీమ్ లీడర్‌షిప్ గ్రూప్‌తో బోర్డు నిర్వహించిన సమీక్ష సమావేశంలో శుభ్‌మన్ గిల్ తన మనసులోని మాటను బయటపెట్టారు. కేవలం నాలుగు రోజుల ముందు ప్రాక్టీస్ చేసి మైదానంలోకి దిగడం వల్ల ఫలితాలు రావడం లేదని, అందుకే ఇకపై ప్రతి టెస్ట్ సిరీస్‌కు ముందు కనీసం 15 రోజుల ట్రైనింగ్ క్యాంప్ ఉండాలని గిల్ డిమాండ్ చేశారు. గతేడాది ఆసియా కప్ ముగిసిన కేవలం 4 రోజులకే టీమిండియా వెస్టిండీస్‌తో టెస్ట్ మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. అలాగే దక్షణాఫ్రికాతో సిరీస్ ముందు కూడా గిల్, ఇతర టెస్ట్ స్పెషలిస్ట్ ఆటగాళ్లు ఆస్ట్రేలియా నుంచి వచ్చిన 4 రోజులకే మ్యాచ్‌లోకి దిగారు. ఇలాంటి బిజీ షెడ్యూల్ వల్ల ఆటగాళ్లకు రెడ్ బాల్ క్రికెట్‌కు అలవాటు పడే సమయం దొరకడం లేదని గిల్ వాదిస్తున్నారు. టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక ప్రకారం.. గిల్ ప్లానింగ్ పట్ల బీసీసీఐ, సెలెక్టర్లు చాలా సంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. గిల్ విజన్, క్లారిటీ చూసి బోర్డు కూడా అతనికి మద్దతుగా నిలిచే అవకాశం ఉంది. భారత జట్టు బిజీ షెడ్యూల్ మధ్య 15 రోజుల క్యాంప్ నిర్వహించడం కత్తి మీద సామే. అయితే, దీని కోసం బెంగళూరులోని నేషనల్ క్రికెట్ అకాడమీ (ఇప్పుడు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్)ను వాడుకోవాలని బోర్డు భావిస్తోంది. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ పరిమిత ఓవర్ల సిరీస్‌లలో బిజీగా ఉంటే, ఈ రెడ్ బాల్ క్యాంప్ బాధ్యతలను వివిఎస్ లక్ష్మణ్ కు అప్పగించే ఆలోచనలో కూడా బోర్డు ఉంది. గిల్ డిమాండ్ గనుక అమలైతే, భారత టెస్ట్ జట్టు మరింత పటిష్టంగా తయారవుతుందని మాజీ క్రికెటర్లు అభిప్రాయపడుతున్నారు.

# జనవరి 9 నుంచి మహిళా ప్రీమియర్ లీగ్ ప్రారంభం

### 5 జట్ల మధ్య జరగనున్న 22 మ్యాచ్‌లు

### ఆన్‌లైన్‌లో అమ్మకానికి అందుబాటులో టికెట్లు




మహిళా ప్రీమియర్ లీగ్  నాల్గో ఎడిషన్ జనవరి 9 నుంచి ఫిబ్రవరి 5 వరకు జరుగుతుంది. 5 జట్ల మధ్య మొత్తం 22 మ్యాచ్‌లు నవీ ముంబైలోని పాటిల్ స్టేడియం, వడోదరలోని బరోడా క్రికెట్ అసోసియేషన్ స్టేడియంలో జరుగుతాయి. మ్యాచ్ టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నాయి, ధర కేవలం 100 రూపాయల నుంచి ప్రారంభమవుతుంది. మహిళా ప్రీమియర్ లీగ్ 2026 షెడ్యూల్ నవంబర్ 29న విడుదలైంది. మొదటి మ్యాచ్ జనవరి 9న డిఫెండింగ్ ఛాంపియన్ ముంబై ఇండియన్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య  నవీ ముంబైలో జరుగుతుంది. ఆ తర్వాత జనవరి 10న డబుల్ హెడర్ ఉంది. మొదటి మ్యాచ్ యూపీ వారియర్స్, గుజరాత్ జెయింట్స్ మధ్య, రెండో మ్యాచ్ ముంబై ఇండియన్స్, ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జరుగుతుంది. అన్ని మ్యాచ్‌ల టిక్కెట్లు 100 రూపాయల నుంచి ప్రారంభమవుతాయి. మహిళా ప్రీమియర్ లీగ్ అధికారిక వెబ్‌సైట్ లేదా డిస్ట్రిక్ట్ బై జోమాటో వెబ్‌సైట్ , యాప్‌లో టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు.వార్త రాసే సమయానికి, కేవలం 100 రూపాయల ధర గల టిక్కెట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి. ముందుగా మహిళా ప్రీమియర్ లీగ్ వెబ్‌సైట్ లేదా డిస్ట్రిక్ట్ బై జోమాటో వెబ్‌సైట్‌కి వెళ్లండి. మీకు టిక్కెట్ల విభాగం కనిపిస్తుంది, దానిపై క్లిక్ చేస్తే అన్ని మ్యాచ్‌ల జాబితా మీ ముందు వస్తుంది. ఫిబ్రవరి 1 వరకు డబుల్ రౌండ్ రాబిన్ మ్యాచ్‌లు జరుగుతాయి, అన్ని మ్యాచ్‌ల 100 రూపాయల టిక్కెట్లు ఆన్‌లైన్‌లో అమ్మకానికి అందుబాటులో ఉన్నాయి. జనవరి 9న జరిగే ప్రారంభ మ్యాచ్‌కు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న టిక్కెట్లు అమ్ముడయ్యాయి. ఈ మ్యాచ్ టిక్కెట్లు మళ్లీ అందుబాటులోకి వస్తాయి. ఉదాహరణకు, మీరు జనవరి 10న జరిగే డబుల్ హెడర్ మొదటి మ్యాచ్ టిక్కెట్ బుక్ చేయాలనుకుంటే, మీరు ఆ మ్యాచ్ ఆప్షన్‌పై క్లిక్ చేయాలి.

## నా ఫొటోలను మార్ఫింగ్ చేయవద్దు

### భారత మహిళా క్రికెటర్ ప్రతీకా రావల్



దయచేసి తన ఫొటోలను మార్ఫింగ్, ఎడిట్ చేయవద్దని ఎక్స్ ఏఐ ప్లాట్‌ఫామ్ గ్రోక్‌ను భారత మహిళా క్రికెటర్ ప్రతీకా రావల్ కోరింది. ఇటీవల ఎక్స్‌వేదికగా ఫొటోలను ఎడిట్ చేయడం, మార్ఫ్ చేయడం ట్రెండింగ్‌గా మారిన సంగతి తెలిసిందే. కొన్ని ఫొటోల నుంచి వ్యక్తులను తీసేయడం, డ్రెస్ కలర్స్‌ను మార్చడం వంటి పనులను నెటిజన్లు గ్రోక్ సాయంతో చేశారు. గత కొన్నిరోజులుగా ఎక్స్‌లో ఇది బాగా ట్రెండ్ అవుతుంది. ఈ క్రమంలోనే తన ఫొటోలను మార్ఫింగ్, ఎడిట్ చేయవద్దని, ఇతర యూజర్లు అడిగినా నిరాకరించాలని గ్రోక్‌ను ఎక్స్ వేదికగా ప్రతీకా రావల్ విజ్ఞప్తి చేసింది. ఆమె అభ్యర్థనకు సానుకూలంగా స్పందించిన గ్రోక్.. వ్యక్తిగత గోప్యతను కాపాడుతామని మాట ఇచ్చింది. ప్రస్తుతం ఈ పోస్ట్‌లు నెట్టింట వైరల్‌గా మారాయి. ःహే ఏస్త్రతీశీని, గతంలో నేను పోస్ట్ చేసినవి, భవిష్యత్తులో నేను పోస్ట్ చేయబోయే నా ఫొటోలను తీసుకోవడానికి.. మార్ఫింగ్, ఎడిట్ చేయడానికి నేను మీకు అనుమతి ఇవ్వడం లేదు. ఒకవేళ ఎవరైనా నా ఫొటోలను ఏదైనా విధంగా ఎడిట్ చేయమని కోరితే, దయచేసి ఆ అభ్యర్థనను తిరస్కరించండి. ధన్యవాదాలు.ःఅని ప్రతీకా రావల్ ట్వీట్ చేసింది. ఈ ట్వీట్‌కు గ్రోక్ స్పందించింది. ःఅర్థమైంది ప్రతీకా. నేను మీ వ్యక్తిగత గోప్యతను గౌరవిస్తాను. అనుమతి లేకుండా మీ ఫొటోలను ఉపయోగించడం, మార్ఫ్, ఎడిట్ చేయడం చేయను. అటువంటి అభ్యర్థనలు ఏవైనా వస్తే వాటిని తిరస్కరిస్తాను. నాకు తెలియజేసినందుకు ధన్యవాదాలు.ःఅని బదులిచ్చింది. అయితే ఈ ఎక్స్ ఖాతా నిజంగానే ప్రతికాకు సంబంధించినదా? కాదా? అనేదానిపై స్పష్టమైన సమాచారం లేదు. బ్లూ టిక్, ప్రతికా రావల్ ఫొటోలు ఉన్నప్పటికీ.. ఈ మధ్య ఫేక్ అకౌంట్స్‌కు కూడా డబ్బులు తీసుకొని ఎక్స్ బ్లూ టిక్స్ ఇస్తుండటంతో గందరగోళం నెలకొంది. ప్రతీకా ట్వీట్.. ఏఐ సాధనాలతో చేస్తున్న ఫొటో మార్ఫింగ్‌లపై పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. భారత మహిళల వన్డే ప్రపంచకప్ విజయంలో ప్రతీకా రావల్ కీలక పాత్ర పోషించింది. గాయంతో సెమీఫైనల్‌తో పాటు ఫైనల్‌కు దూరమైన ఆమె.. 6 ఇన్నింగ్స్‌ల్లో 51.33 సగటుతో 308 పరుగులు చేసింది. న్యూజిలాండ్‌పై శతకం సాధించడంతో పాటు ఆస్ట్రేలియా 75 పరుగులతో సత్తా చా టింది. బంగ్లాదేశ్‌తో జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో ఆమె చీల మండ, మోకాలి గాయాలకు గురైంది. ప్రస్తుతం ఆ గాయాల నుంచి కోలుకుంటుంది. భారత్ తరఫున 23 వన్డేలు ఆడిన ప్రతికా 50.45 సగటుతో 1,110 పరుగులు చేసింది.

## మ్యాచ్‌లను తరలిస్తే ఎవరికి నష్టం?




భారత్ వేదికగా జరిగే టీ20 ప్రపంచ కప్ మ్యాచ్‌లను శ్రీలంకలో నిర్వహించాలని బంగ్లాదేశ్ కోరుతోంది. ముస్తఫిజుర్ రెహ్మాన్‌ను ఐపీఎల్ నుంచి రిలీజ్ చేయడంతో బంగ్లా క్రికెట్ బోర్డు గుర్రుగా ఉంది. ఇప్పటికే ఐపీఎల్ ప్రసారాలను బంగ్లాదేశ్‌లో బ్యాన్ విధించింది. భద్రతా కారణాల దృష్ట్యా తమ జట్టును భారత్‌కు పంపించేందుకు నిరాకరిస్తోంది. ఇప్పటికే పాకిస్థాన్ మ్యాచ్‌లు ఇప్పటికే శ్రీలంకలో నిర్వహించనున్న విషయం తెలిసిందే. తాజాగా బంగ్లాదేశ్ తమ మ్యాచ్‌లు భారత్ వెలుపల నిర్వహించాలని రిక్వెస్ట్ చేసింది. అయితే ఈ విషయంపై ఐసీసీ సుముఖంగా లేనట్లు తెలుస్తోంది. ఒకవేళ బంగ్లాదేశ్ మ్యాచ్‌లు భారత్‌లో నిర్వహించకపోతే.. బీసీసీఐకి ఏమైనా నష్టాలు ఎదు- రవుతాయా..? లేదా ఐసీసీ నష్టాన్ని భరిస్తుందా..?  టీ20 ప్రపంచ కప్ ఈవెంట్ ఐసీసీ నిర్వహించే ఈవెంట్. ఈ ఈవెంట్‌కు సంబంధించి టికెట్, స్పాన్సర్‌షిప్, ప్రసార ఆదాయం నేరుగా బీసీసీఐకి అందదు. ఐసీసీకి సంబంధించిన ఆదాయాన్ని మొత్తాన్ని బిజినెస్ కార్పొరేషన్ ఈవెంట్ నిర్వహిస్తుంది. టీ20 ప్రపంచకప్‌ను బీసీసీఐ నిర్వహించడానికి మాత్రమే పరిమితం. టీ20 ప్రపంచ కప్ నుంచి బీసీసీకి ఆదాయం మ్యాచ్-రోజుల మిగులు, ఇతర స్పాన్సర్‌షిప్‌ల నుంచి వస్తుంది. బంగ్లాదేశ్ మ్యాచ్‌లను భారత్ నుంచి తరలిస్తే.. దీజజ× ఆదాయంపై మరీ గణనీయంగా ప్రభావం చూపదు. బీసీసీఐ నష్టాలను చవిచూస్తి.. అవి మ్యాచ్-రోజు ఆర్థిక వ్యవస్థకే పరిమితం అయ్యే అవకాశం ఉంది. టీ20 ప్రపంచ కప్ షెడ్యూల్ విడుదలైనప్పటి నుంచి.. ఆటగాళ్లు, కోచింగ్, ఇతర సహాయక సిబ్బంది, ఇతర అధికారులకు వసతి, విమాన బుకింగ్‌లు ఇప్పటికే పూర్తయ్యాయి. బంగ్లాదేశ్ మ్యాచ్‌లు ప్రస్తుతం కోల్‌కతా, ముంబైలలో ఆడటానికి షెడ్యూల్ అయ్యాయి. బంగ్లాదేశ్ మ్యాచ్‌లు మారితే.. ఆటగాళ్లు, ఇతర సిబ్బందికి హొటల్ బుకింగ్‌లు, విమాన ప్రయాణ ఖర్చులను ఐసీసీ భరిస్తుంది. బంగ్లా మ్యాచ్‌లను తరలిస్తే.. ఆ టీమ్‌తో పోటీ పడే ఇతర జట్ల ఆటగాళ్లను కూడా వేర్వేరు వేదికల్లో హొటల్స్, విమానా టికెట్స్ బుక్ చేయాల్సి ఉంటుంది. దీంతో మ్యాచ్‌లను భారత్ నుంచి తరలిస్తే.. బీసీసీఐ కంటే.. ఐసీసీకే ఎక్కువ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ప్రపంచ కప్‌లో ప్రస్తుత షెడ్యూల్ ప్రకారం.. బంగ్లాదేశ్, ఇంగ్లాండ్, ఇటలీ, నేపాల్, వెస్టిండీస్ జట్లు గ్రూప్ జలో ఉన్నాయి. బంగ్లాదేశ్ తన మొదటి మ్యాచ్ ఫిబ్రవరి 7న వెస్టిండీస్‌తో తలపడనుంది.

## సౌతాఫ్రికాలో వైభవ్ సూర్యవంశీ రచ్చ




సౌతాఫ్రికా గడ్డపై భారత అండర్-19 కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ పరుగుల సునామీ సృష్టించాడు. కేవలం 14 ఏళ్ల వయసులోనే తన అద్భుత బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్‌ను తనవైపు తిప్పుకున్న ఈ కుర్రాడు, తాజాగా ప్రోటీస్ బౌలర్లను వణికించాడు. బెనోనీలో జరిగిన రెండో వన్డేలో కేవలం 24 బంతుల్లోనే 68 పరుగులు చేసి టీమిండియాకు భారీ ఆరంభాన్ని ఇచ్చాడు. సౌతాఫ్రికా నిర్దేశించిన 246 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు కెప్టెన్ వైభవ్ సూర్యవంశీ కళ్లు చెదిరే ఆరంభాన్ని ఇచ్చాడు. ఆరంభం నుంచే సిక్సర్లతో విరుచుకుపడ్డ వైభవ్, మైదానం నలుమూలలా బంతుల్ని తరలించాడు. ఈ క్రమంలో కేవలం 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ పూర్తి చేసుకుని రిషబ్ పంత్ పేరిట ఉన్న భారత రికార్డును తిరగరాశాడు. మొత్తం 24 బంతుల్లో 10 సిక్సర్లు, ఒక ఫోర్‌తో 68 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. అంటే అతను చేసిన మొత్తం పరుగుల్లో 64 పరుగులు కేవలం బౌండరీల (10 సిక్సర్లు ం 1 ఫోర్) ద్వారానే రావడం విశేషం. అంతకుముందు బ్యాటింగ్ చేసిన సౌతాఫ్రికా అండర్-19 జట్టును భారత బౌలర్లు కట్టడి చేశారు. జేసన్ రౌల్స్ (114) సెంచరీతో పోరాడినప్పటికీ, మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. భారత స్పిన్నర్ కిషన్ సింగ్ 8.3 ఓవర్లలో 46 పరుగులిచ్చి 4 వికెట్లు పడగొట్టి ప్రత్యర్థిని దెబ్బతీశాడు. దీంతో సౌతాఫ్రికా 245 పరుగులకే ఆలౌట్ అయింది. ఆర్‌ఎస్ అంబరీష్ రెండు వికెట్లు తీయగా, దీపేష్, కనిష్క్, ఖిలన్ పటేల్ తలో వికెట్ పడగొట్టారు. వైభవ్ సూర్యవంశీ ఇప్పటికే ఆస్ట్రేలియా అండర్-19 జట్టుపై అత్యంత వేగవంతమైన సెంచరీ చేసి రికార్డు నెలకొల్పాడు. ఇప్పుడు సౌతాఫ్రికాలోనూ అదే ఫామ్‌ను కొనసాగిస్తూ జూనియర్ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా ఎదుగుతున్నాడు. వైభవ్ ఇచ్చిన మెరుపు ఆరంభంతో భారత్ విజయం దిశగా దూసుకెళ్తోంది. కేవలం 11 ఓవర్లలోనే టీమిండియా 100 పరుగుల మార్కును దాటేసిందంటే వైభవ్ విధ్వంసం ఏ రేంజ్‌లో ఉందో అర్థం చేసుకోవచ్చు.




# విదేశాల్లో ద రాజాసాబ్ మేనియా

## విడుదలకు ముందే భారీగా టిక్కెట్ల అమ్మకాలు



ప్రభాస్ హీరోగా,దర్శకుడు మారుతి దర్శకత్వంలో తెరకెక్కిన భారీ చిత్రం 'ది రాజాసాబ్' ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద సంచలనాలకి సంబంధించిన సంకేతాలు ఇస్తోంది. సంక్రాంతి కానుకగా జనవరి 9న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్న ఈ మూవీకి విదేశీ మార్కెట్లలో అడ్వాన్స్ బుకింగ్‌లు బలంగా ప్రారంభమయ్యాయి. ప్రభాస్ క్రేజ్‌కు మ-రోసారి నిదర్శనంగా, ఉత్తర అమెరికాలో ఇప్పటివరకు 17,500కు పైగా టిక్కెట్లు అమ్ముడయ్యాయి. అలాగే యూకే మార్కెట్‌లో కూడా 17,500కు పైగా ప్రీ-సేల్స్ నమోదు కావడం విశేషం. 2026 జనవరి 8న ప్రారంభమయ్యే ప్రీమియర్ షోలకే ఇంత భారీ స్పందన రావడం, సినిమా ఓవర్సీస్‌లో బలమైన ఓపెనింగ్ రాబోతుందనే సంకేతాలను ఇస్తోంది. దర్శకుడు మారుతి ఈ సినిమాను దాదాపు మూడేళ్ల పాటు శ్రమించి తెరకెక్కించినట్టు సమాచారం. పూర్తి స్థాయి ఎంటర్‌టైన్‌మెంట్, కామెడీ, ఫ్యామిలీ ఎలిమెంట్స్‌తో పాటు ప్రభాస్‌ను సరికొత్తగా చూపించాలనే లక్ష్యంతో ఈ సినిమా రూపొందించబడింది. 'బాహుబలి', 'సలార్' లాంటి ఇంటెన్స్ పాత్రల తర్వాత ప్రభాస్‌ను లైట్ హార్టెడ్, ఫుల్ ఎంటర్‌టైనర్‌లో చూడాలన్న అభిమానుల ఆశలను 'ది రాజాసాబ్' తీర్చబోతుందనే అంచనాలు ఉన్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీ.జి. విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని భారీ స్థాయి-ంలో నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్, రిద్ధి కుమార్ కథానాయికలుగా నటిస్తుండగా, బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కీలక పాత్రలో కనిపించనున్నారు. 'ది రాజాసాబ్' సినిమాను తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళం భాషల్లో ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నారు. పాన్ ఇండియా స్థాయిలో ప్రభాస్‌కు ఉన్న మార్కెట్‌ను పూర్తిగా వినియోగించుకునేలా మేకర్స్ రిలీజ్ ఎ÷-లాన్ చేస్తున్నారు. మొత్తానికి, అడ్వాన్స్ బుకింగ్‌లతోనే ఓవర్సీస్‌లో హీట్ పెంచుతున్న 'ది రాజాసాబ్'? సంక్రాంతి రేసులో పెద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలుస్తుందా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రభాస్ అభిమానులు మాత్రం ఈ సినిమాతో మరోసారి బాక్సాఫీస్ షేక్ అవుతుందని గట్టిగా నమ్ముతున్నారు.

## జన నాయగన్... భగవంత్ కేసరికి కాపీయా?




విజయ్కథానాయకుడిగా హెచ్.వినోద్ దర్శకత్వంలో రానున్న చిత్రం 'జన నాయగన్' తెలుగులో జన నాయకుడు సంక్రాంతి కానుకగా జనవరి 9న తమిళ, తెలుగు, హిందీ భాషల్లో విడుదల కానుంది. ఇప్పుడు దీని విడుదలకు ముందు బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఓటీటీలో ట్రెండింగ్‌లో టాప్ వన్‌లోకి వచ్చింది. 'జన నాయగన్' బాలకృష్ణ 'భగవంత్ కేసరి'కి రీమేక్ అంటూ ఎన్నో రోజులుగా వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. దీనిపై ఈ రెండు సినిమాల దర్శకులు స్పందించినప్పటికీ వీటికి చెక్ పడలేదు. మరికొన్ని రోజుల్లో ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో ఇప్పుడు అందరూ 'భగవంత్ కేసరి'ని చూసేస్తున్నారు. దీంతో అమెజాన్ ప్రైమ్‌లో ఉన్న ఆ చిత్రం రెండేళ్ల తర్వాత ఓటీటీలో ట్రెండింగ్‌లో టాప్1లోకి వచ్చేసింది. ఈ రీమేక్ వార్త ప్రచారం జరుగుతుండడంతో దర్శకుడు హెచ్.వినోద్ ఇటీవల స్పందించారు. 'నేను ఈ విషయాన్ని ధ్రువీకరించను. అలాగే కొట్టిపారేయను. ఇంతకుముందు కూడా మీకు ఈ విషయం చెప్పాను. ఇది దళపతి మూవీ. ఇది రీమేకా..? ఏదైనా చిత్రం నుంచి స్ఫూర్తిపొంది తీశారా? అన్న విషయంపై ప్రేక్షకులు ఆందోళనపడాల్సిన అవసరం లేదు' అని అన్నారు. అలాగే 'భగవంత్ కేసరి' తెరకెక్కించిన అనిల్ రావిపూడి కూడా ఈ ప్రచారంపై మాట్లాడారు. 'విజయ్‌ను నేను రెండు, మూడుసార్లు కలిశాను. మేము చాలా విషయాలు మాట్లాడుకున్నాం. 'జన నాయకుడు' కథ ఏంటనేది ఆ సినిమా విడుదలైన తర్వాతే మీకు అర్థమవుతుంది' అని చెప్పారు. ఇక విజయ్ చివరి సినిమా కావడంతో దీనిపై అందరిలో ఆసక్తి నెలకొంది. పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్‌గా సిద్ధమవుతోన్న ఈ మూవీలో విజయ్ సరసన పూజాహెగ్డే కథానాయికగా కనిపించనున్నారు.

## స్విమ్మింగ్ షూట్ కోసం నీళ్లలోనే ఉండిపోయా

### రాజాసాబ్ సినిమాపై మాళవికా మోహనన్

సినీ ప్రియులకు పెద్ద పండగ సంక్రాంతి ఈ యేడాది 'ది రాజాసాబ్'తో మొదలుకానుంది. మారుతి దర్శకత్వంలో ప్రభాస్ హీరోగా తెరకెక్కిన ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరి 9న విడుదల కానుంది. ఇప్పటికే పాటలు, ప్రచార చిత్రాలు ఆసక్తిని రెట్టింపు చేయగా తాజాగా మాళవికా మోహనన్ కొన్ని విషయాలు పంచుకున్నారు. 'నటీనటుల మధ్య సన్నివేశాలు బాగా రావాలంటే కెమిస్ట్రీ ముఖ్యం. ఈ చిత్రంలో ప్రభాస్‌కు, నాకు మధ్య చాలా సన్నివేశాలు ఉన్నాయి. ఇందులో నాది నిడివి ఎక్కువ ఉన్న పాత్ర. నా సోలో సీన్ ఒకదాన్ని మూడు రోజులు పెద్ద స్విమ్మింగ్‌పూల్‌లో షూట్ చేశారు. ఆ మూడు రోజులు దాదాపు రోజుకు 10 గంటలు నీళ్లలోనే ఉండాల్సి వచ్చింది. నామీద మొసలి దాడి చేస్తున్నట్లు నటించాల్సిన సీన్. ఒకవైపు చలికి చర్మం మొత్తం ముద్దుబారిపోతున్న ఫీలింగ్ కలిగేది. అదే సమయంలో మొసలి దాడి చేస్తున్నట్లు ఎక్స్‌ప్రెషన్స్ పెట్టాలన్నారు. ఆ నీళ్లు కూడా దారుణంగా ఉన్నాయి. అందరూ అందులోకి దిగి షూట్ చేస్తున్నారు. పెయింట్, కెమికల్స్, వాడిపారేసిన వస్తువులు అన్నీ అందులో ఉన్నాయి. ఆ నీటిలోనే 3 రోజులు షూట్ చేశాం. అదొక వింత అనుభవం' అని మాళవికా మోహనన్ అన్నారు. ఇకపోతే హారర్ ఫాంటసీ కామెడీ చిత్రంగా 'రాజాసాబ్' రానుంది. ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకూ ఇలాంటి కథ రాలేదని దర్శకుడు మారుతి తెలిపారు. 15 ఏళ్ల తర్వాత ఆడియన్స్ వింటేజ్ ప్రభాస్‌ను చూస్తారని చెప్పారు. ఇందులో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ కనిపించనున్నారు. సంజయ్‌దత్, బొమన్ ఇరాని, జరీనా వహబ్ తదితరులు కీలక పాత్రలు పోషించారు.

# ఎన్టీఆర్ లెవల్‌కు తగ్గట్లుగా ప్రశాంత్ నీల్ ప్లాన్



జూనియర్ ఎన్టీఆర్ ప్రస్తుతం కన్నడ స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో నటిస్తున్న విషయం తెలిసిందే. 'కేజీఎఫ్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ల తర్వాత ప్రశాంత్ నీల్.. ఎన్టీఆర్ హీరోగా సినిమా చేస్తున్నాడు అనగానే అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. అందుకే ఈ మూవీకి సంబంధించిన చిన్న అప్‌డేట్ బయటకు వచ్చినా క్షణాల్లోనే వైరల్ అవుతోంది. ఈ సినిమాను పూర్తిగా ఇంటర్నేషనల్ లెవల్లో తెరకెక్కించాలని ప్రశాంత్ నీల్ గట్టిగా నిర్ణయించుకున్నారట. తన అభిమాన నటుడు అయిన ఎన్టీఆర్‌కు కెరీర్‌లో మరిచిపోలేని బ్లాక్‌బస్టర్ ఇవ్వాలనే లక్ష్యంతో ఆయన ఎక్కడా క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కావడం లేదని ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. చిన్న చిన్న డిటైలింగ్ వరకు కూడా పర్ఫెక్షన్ కావాలనే ఆలోచనతో ప్రతి సీన్‌ను తెరకెక్కిస్తున్నారట. ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న మైత్రి మూవీ మేకర్స్ సంస్థ కూడా దీనిని అత్యంత ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్‌గా తీసుకుంది. ఇటీవల నిర్మాత రవి చేసిన కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ కావడం కూడా ఈ సినిమాపై క్రేజ్ ఏ స్థాయిలో ఉందో చెప్పే ఉదాహరణగా మారింది. ఇటీవల హైదరాబాద్‌లో వేసిన భారీ సెట్‌లో ఈ సినిమా కొత్త షెడ్యూల్ మొదలైంది. ఈ షెడ్యూల్‌లో ప్రధాన పాత్రల మధ్య కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారట. అంతేకాదు, ఎన్టీఆర్‌తో ఒక పవర్‌ఫుల్ యాక్షన్ సీక్వెన్స్‌ను కూడా ఈ షెడ్యూల్‌లోనే తెరకెక్కించనున్నట్లు సమాచారం. హైదరాబాద్ షెడ్యూల్ పూర్తయ్యాక ఎన్టీఆర్ మరోసారి విదేశాలకు వెళ్లనున్నారని తెలుస్తోంది. అక్కడ జరిగే షెడ్యూల్‌తో సినిమా టాకీ పార్ట్ దాదాపుగా పూర్తవుతుందని టాక్. గ్రాండ్ స్కేల్‌లో, భారీ యాక్షన్ ఎపిసోడ్‌లతో ఈ మూవీని ప్రేక్షకులకు ఓ విజువల్ ఫీస్ట్‌లా అందించేందుకు టీమ్ ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ సినిమాకు 'డ్రాగన్' అనే టైటిల్‌ను ఫిక్స్ చేయనున్నారని వార్తలు వినిపిస్తున్నాయి. ఇంటర్నేషనల్ లెవల్లో సెట్ అయ్యే కథకు ఈ టైటిల్ పర్ఫెక్ట్‌గా ఉంటుందని మేకర్స్ భావిస్తున్నారట. అధికారిక ప్రకటన మాత్రం ఇంకా రావాల్సి ఉంది. ప్రశాంత్ నీల్ గత సినిమాల్లో హీరో ఎలివేషన్స్, మాస్ యాక్షన్‌కు పెద్ద పీట వేసిన విషయం తెలిసిందే. అయితే ఈ సినిమాలో కేవలం హీరోయిజం మాత్రమే కాకుండా బలమైన ఎమోషన్స్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్ నటనలోని ఎమోషనల్ డెప్త్‌ను కొత్త కోణంలో చూపించాలనే ప్రయత్నంలో ప్రశాంత్ నీల్ ఉన్నారు.

## అట్లీతో ముగింపు దశలో అల్లు మూవీ

### లోకేశ్ కనగరాజ్‌తో మరో మూవీకి బన్నీ ప్లాన్



టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్ ప్రస్తుతం దర్శకుడు అట్లీతో చేస్తున్న భారీ సైన్స్ ఫిక్షన్ ప్రాజెక్ట్‌తో దేశవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తున్నారు. భారీ బ్జడెట్, అంతర్జాతీయ స్థాయి విజువల్స్, హాలీవుడ్ టెక్నాలజీతో రూపొందుతున్న ఈ సినిమా ఇప్పటికే సగానికి పైగా షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ ఏడాది దసరా కానుకగా సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే లక్ష్యంతో మేకర్స్ వేగంగా పనులు పూర్తి చేస్తున్నారు. బన్నీ మాస్ ఇమేజ్‌ను పూర్తిగా కొత్త కోణంలో చూపించబోతున్న ఈ కథ, అట్లీ మార్క్ ఎమోషన్‌తో పాటు గ్రాండ్ యాక్షన్‌ను కలబోస్తుందని టాక్ వినిపిస్తోంది. ఈ సినిమా పూర్తయ్యాక అల్లు అర్జున్ తదుపరి అడుగు ఏమిటన్నదే ఇప్పుడు ఇండస్ట్రీ్రలో ప్రధాన చర్చగా మారింది. తాజా సమాచారం ప్రకారం, యూత్‌కి, మాస్‌కి కనెక్ట్ అయ్యే రియలిస్టిక్ గ్యాంగ్‌స్టర్ కథలతో గుర్తింపు తెచ్చుకున్న దర్శకుడు లోకేశ్ కనగరాజ్‌తో బన్నీ సినిమా దాదాపు ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. అట్లీ మూవీ షూటింగ్ ఆగస్టు నాటికి ముగిస్తే, ఆ వెంటనే లోకేశ్ ప్రాజెక్ట్‌పై బన్నీ ఫోకస్ పెడతారని ప్రచారం జరుగుతోంది. ఈ సినిమాను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించే అవకాశాలున్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇదిలా ఉండగా, అట్లీ?అల్లు అర్జున్ సినిమా డిజిటల్ హక్కులపై కూడా భారీ చర్చ నడుస్తోంది. ఈ చిత్ర ఓటీటీ రైట్స్ కోసం ప్రముఖ డిజిటల్ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ భారీ ఆఫర్ పెట్టినట్లు సమాచారం. ఈ డీల్ విలువ వందల కోట్లలో ఉండొచ్చన్న ప్రచారం ఇండస్ట్రీని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. రిలీజ్‌కు ముందే ఇలాంటి రేంజ్ బిజినెస్ జరగడం బన్నీ మార్కెట్ స్టామినాకు నిదర్శనంగా చెప్పుకుంటున్నారు.మరోవైపు, తన తాజా చిత్రం 'కూలీ'పై వచ్చిన విమర్శలపై దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఇటీవల స్పందించారు. ప్రేక్షకుల నుంచి వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను సీరియస్‌గా తీసుకున్నానని, ఎక్కడ తడబడ్డామో విశ్లేషించుకున్నానని తెలిపారు. తదుపరి సినిమాల్లో మరింత బలమైన కంటెంట్‌తో ముందుకు వస్తానని స్పష్టం చేశారు. దీంతో అల్లు అర్జున్‌తో ఆయన చేయబోయే సినిమా మరింత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందన్న అంచనాలు మరింత పెరిగాయి. మొత్తానికి అట్లీతో ఒక గ్రాండ్ సైన్స్ ఫిక్షన్ విజన్, లోకేశ్ కనగరాజ్‌తో ఒక రఫ్ అండ్ రియల్ ప్రాజెక్ట్ ఈ రెండు కాంబినేషన్లతో అల్లు అర్జున్ పాన్ ఇండియా స్థాయిలో మరోసారి సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**

# పౌర సేవల్లో స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ కీలకం

- కొత్త ఏడాదిలో ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందాలి
- ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలు
- స్వర్ణగ్రామ- స్వర్ణ వార్డు శాఖ క్యాలెండర్ ఆవిష్కరించిన ముఖ్యమంత్రి



**అమరావతి, జనవరి 05 ( సమయం న్యూస్):**

స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు అన్ని అంశాల్లోనూ అమలు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంత్రులు, ఆయా శాఖల ఉన్నతాధికారులు కూడా ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు అందుతున్న పౌర సేవలు, పథకాలపై ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సీఎం స్పష్టం చేశారు. దాదాపు 800 సేవల్ని ప్రభుత్వ శాఖలు ప్రజలకు అందిస్తున్నాయని సీఎం అన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. కొత్త ఏడాదిలో ప్రభుత్వ శాఖలన్నీ ప్రజలకు అత్యుత్తమంగా సేవలందించాలని సీఎం ఆకాంక్షించారు. ప్రభుత్వం అందించే పౌర సేవలన్నీ క్షేత్రస్థాయిలో మరింత మెరుగ్గా అందించేలా కృషి చేయాలని సూచించారు. రాష్ట్రంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారం చేయూత కారణంగా రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లోని 50 శాతం మేర ఘన వ్యర్థాలు రీసైకిల్ కావాలని సూచించారు. స్వచ్ఛ రథాల ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. ఈ ఆంశంలో ప్రజల నుంచి కూడా సహకారం తీసుకోవాలని.. ఈ ప్రక్రియను వ్యవస్థీకృతంగా నిర్వహించాలని ఆదేశించారు. తడి చెత్తను కంపోస్టు తయారీకి.. ఘన వ్యర్థాలను విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లకు తరలించాలని.. దీనికి సంబంధించి రవాణా ప్రణాళికను కూడా ఖరారు చేయాలని సీఎం పేర్కొన్నారు. మరోవైపు గ్రామీణ ప్రాంతాల్లో కనెక్టివిటీ పెంచేందుకు బ్యాండ్ విడ్త్ ను విస్తరించాలని అన్నారు. వివిధ పథకాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలులో అనుసరిస్తున్న బెస్ట్ ప్రాక్టీసెస్ ను అన్నిటికీ వర్తింప చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు అందిస్తున్న సేవల గురించి ఎప్పటికప్పుడు మీడియా సమావేశాల ద్వారా వారిలో అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజల నుంచి అభిప్రాయ సేకరణకు ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ సహా వినూత్న విధానాలను అనుసరించాలన్నారు. అనంతరం స్వర్ణ గ్రామం- స్వర్ణ వార్డు శాఖ 2026 క్యాలెండర్ ను మంత్రి డోలా శ్రీ బాలవీరాంజనేయ స్వామితో కలిసి ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. ఈ సమీక్షకు సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, సీఎస్ విజయానంద్, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు సహా రవాణా, గ్రామీణాభివృద్ధి పంచాయతీ రాజ్, ఐటీ, ఆర్టీజీఎస్, ఆర్థిక, ప్రణాళిక విభాగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# ఉద్యాన సాగుపై ప్రత్యేక దృష్టి

## అధికారులకు మంత్రి అచ్చెన్నాయుడు దిశానిర్దేశం

- మామిడికి తెగుళ్లు రాకుండా అప్రమత్తంగా ఉండాలి
- అడిగిన ప్రతి రైతుకు డ్రిప్, స్ప్రింక్లర్ పరికరాలు
- మిరప సదస్సులో రైతులు, భాగస్వాములతో చర్చించాలి



అమరావతి, జనవరి 5 (సమయం న్యూస్):

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఉద్యాన శాఖ పనితీరుపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. సోమవారం విజయవాడలోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో ఉద్యాన శాఖ సంచాలకులు డాక్టర్ కే. శ్రీనివాసులు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పలు కీలక అంశాలపై చర్చించారు.



### మామిడి, కోకో పంటలపై ఆరా..

ప్రస్తుతం మామిడి పూత, పిందె దశలో ఉన్నందున తెగుళ్లు సోకకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. కోకోతో పాటు అన్ని రకాల పంటల ధరలపై ముందస్తు అంచనాలు సేకరించి, ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. రాష్ట్రంలోని ప్రధాన పంటలన్నింటికీ పంటలవారీ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.

### మిరప సదస్సుపై సూచనలు..

త్వరలో జరగబోయే మిరప సదస్సులో రైతులు మరియు భాగస్వాములతో కలిసి సాగు పద్ధతులు, ధరలు, నాణ్యత ప్రమాణాలపై విస్తృత చర్చలు జరపాలని మంత్రి ఆదేశించారు. పంటల సాగులో నాణ్యత పెంచేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలన్నారు.

### నూతన సాగు విధానాలపై అవగాహన..

సూక్ష్మ నీటి పారుదల (మైక్రో ఇరిగేషన్) ప్రాజెక్టు కింద డ్రిప్, తుంపర సేద్య పరికరాలు కోరిన ప్రతి రైతుకు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. అలాగే మైక్రో ఇరిగేషన్‌లో వచ్చిన కొత్త విధానాలు, ముఖ్యంగా 'రెయిన్ పోర్ట్', 'ఆటోమేషన్' వంటి ఆధునిక పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉద్యాన శాఖ సంచాలకులు డాక్టర్ కే. శ్రీనివాసులు, సీనియర్ అధికారులు ఎం. వెంకటేశ్వర్లు, ఏపీఎంఐపీ ప్రాజెక్ట్ అధికారి సీబీ హరినాథ్ రెడ్డి, అదనపు సంచాలకులు (ఎంఐ) డిహెచ్ అశోక్ కుమార్, ఆయిల్ పామ్ జాయింట్ డైరెక్టర్ తదితరులు పాల్గొన్నారు.

# నగర అభివృద్ధికి సహకరించాలి

## స్టాండింగ్ కమిటీ సభ్యులకు మేయర్ పిలుపు

- ఎమ్మెల్యే బడేటి చంటి ఆశీస్సులతో ఐదుగురు సభ్యుల ఏకగ్రీవ ఎన్నిక
- నూతన సభ్యులకు నియామక పత్రాలు అందజేసిన మేయర్ నూర్జహాన్
- మేయర్‌ను ఘనంగా సన్మానించిన కమిటీ సభ్యులు

**ఏలూరు, జనవరి 5 (సమయం న్యూస్):**

కోట్లాది రూపాయలతో జరుగుతున్న ఏలూరు నగర అభివృద్ధిలో నూతనంగా ఎన్నికైన స్టాండింగ్ కమిటీ సభ్యులందరూ భాగస్వాములు కావాలని, పూర్తి సహకారం అందించాలని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు పిలుపునిచ్చారు. సోమవారం ఆమె తన చాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన ఐదుగురికి నియామక పత్రాలను (ప్రొసీడింగ్ ఆర్డర్స్) అందజేశారు.

### ఏకగ్రీవ ఎన్నిక..

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య (చంటి) ఆశీస్సులతో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ స్టాండింగ్ కమిటీ సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా జరిగిందని తెలిపారు. ఎన్నికైన కార్పొరేటర్లు గూడూరి ఆదిలక్ష్మి, కలవకొల్లు సాంబ, బత్తిన విజయ్ కుమార్, ఎర్రంశెట్టి సుమన్, దేవరకొండ శ్రీనివాసరావులకు మేయర్ శుభాకాంక్షలు తెలిపారు.

### ఎమ్మెల్యే సారథ్యంలో అభివృద్ధి..

శాసనసభ్యులు బడేటి రాధాకృష్ణయ్య సారథ్యంలో నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని మేయర్ పేర్కొన్నారు. ఈ అభివృద్ధి పనులకు కమిటీ సభ్యులు తమ వంతు సహకారం అందించాలని కోరారు. అనంతరం



నూతనంగా ఎన్నికైన సభ్యులు మేయర్ నూర్జహాన్ పెదబాబును శాలువాకప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సబ్బన శ్రీనివాసరావు, వంకదారు ప్రవీణ్, పాము శామ్యూల్, ఈదుపల్లి పవన్ తదితరులు పాల్గొన్నారు.

### రాజోలు గ్యాస్ లీకేజీపై

# సీఎం చంద్రబాబు ఆరా


## అధికారులకు కీలక ఆదేశాలు

**ప్రజలకు ఇబ్బంది కలగకుండా సురక్షిత ప్రాంతాలకు తరలించాలి**

**మంత్రులు అచ్చెన్నాయుడు, సుభాష్‌లతో పరిస్థితిపై సమీక్ష**

**ఓఎన్‌జీసీ, జిల్లా అధికారుల సమన్వయంతో మంటలు అదుపు చేయాలి**


**అమరావతి, జనవరి 5 (సమయం న్యూస్):**



రాజోలు నియోజకవర్గం, మలికిపురం మండలం ఇరుసుమండ గ్రామ పరిధిలోని ఓఎన్‌జీసీ (వాచీ+జ) డ్రిల్ సైట్ వద్ద చోటుచేసుకున్న గ్యాస్ లీకేజీ ఘటనపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం అధికారుల ద్వారా సమాచారం తెలుసుకుని ఘటన వివరాలపై ఆరా తీశారు. ఈ ఘటనపై మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, వాసంశెట్టి సుభాష్, ఇతర ఉన్నతాధికారులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు. తాము ఇప్పటికే స్థానిక అధికారులతో మాట్లాడామని, సహాయక చర్యలు ముమ్మరం చేయాలని క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించినట్లు మంత్రులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. గ్యాస్ లీకేజీ కారణంగా గ్రామస్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని స్పష్టం చేశారు. అవసరమైతే స్థానిక ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. ప్రజల ప్రాణరక్షణే ప్రథమ ప్రాధాన్యతగా చర్యలు ఉండాలన్నారు. లీకేజీ వల్ల ఎగసిపడుతున్న మంటలను వెంటనే అదుపులోకి తీసుకురావాలని సీఎం సూచించారు. ఈ క్రమంలో జిల్లా అధికార యంత్రాంగం, ఓఎన్‌జీసీ ప్రతినిధులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని మంత్రులను, అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిస్థితిపై తనకు ఎప్పటికప్పుడు సమాచారం అందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు.

# ఏపీ సచివాలయ సంఘం కొత్త కార్యవర్గానికి సీఎం చంద్రబాబు అభినందన

**ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన అధ్యక్షుడు రామకృష్ణ**



**అమరావతి, జనవరి 5 (సమయం న్యూస్):**

ఆంధ్రప్రదేశ్ సచివాలయ సంఘం నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారిని కలిశారు. సంఘం అధ్యక్షుడు రామకృష్ణతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు సోమవారం సీఎంను కలిసి మర్యాదపూర్వకంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన కార్యవర్గాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేకంగా అభినందించారు. బాధ్యతలు స్వీకరించిన నూతన కమిటీకి ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వ పాలనలో సచివాలయ ఉద్యోగులది కీలక పాత్ర అని, అందరూ సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు.

# అమెరికా రోడ్డు ప్రమాదంలో పాలకొల్లు దంపతుల మృతి

**సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కృష్ణ కిశోర్, భార్య ఆశ దుర్మరణం**

**పిల్లలిద్దరికీ తీవ్ర గాయాలు.. ఆసుపత్రిలో చికిత్స**

**పది రోజుల క్రితమే సొంతూరికి వచ్చి వెళ్లిన వైనం**



**పాలకొల్లు, (సమయం న్యూస్):**

అగ్రరాజ్యం అమెరికాలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన దంపతులు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. వాషింగ్టన్‌లో ఆదివారం రాత్రి జరిగిన కారు ప్రమాదంలో కొటికలపూడి కృష్ణ కిశోర్ (45), ఆయన భార్య ఆశ (40) అక్కడికక్కడే మృతి చెందారు. పిల్లల పరిస్థితి విషమం.. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న వారి కుమారుడు, కుమార్తెకు కూడా తీవ్ర గాయాలయ్యాయి. ప్రస్తుతం వారు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. కృష్ణ కిశోర్ అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తూ అక్కడే కుటుంబంతో నివాసం ఉంటున్నారు. ఇటీవలే సొంతూరికి.. విధి ఎంత విచిత్రమైనదంటే.. కేవలం పది రోజుల క్రితమే కృష్ణ కిశోర్, ఆశ దంపతులు పాలకొల్లుకు వచ్చి, బంధుమిత్రులను కలిసి వెళ్లారు. సంతోషంగా గడిపి వెళ్లిన కొద్ది రోజులకే ఇలాంటి ఘోరం జరగడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరవుతున్నారు.

# వైసీపీ హయాంలో రైతులకు అవస్థలు

## రైతులకు పట్టాదారు పాసు పుస్తకాలు పంపిణీ చేసిన హోమ్ మంత్రి అనిత



**నక్కపల్లి:** స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర హెూమ్ మంత్రి వంగలపూడి అనిత రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమానికి మంత్రులు కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హెూం మంత్రి అనిత మాట్లాడుతూ... గతంలో జిల్లాల విభజనను అనైతికంగా చేసి ప్రజలకు అవస్తలు మిగిల్చారని విమర్శించారు. సమర్ధవంతమైన పాలన, సత్వర సేవలు అందించే లక్ష్యంతో రెవెన్యూ డివిజన్లు, జిల్లాలు విభజించామని చెప్పారు. మన ఆస్తి పత్రాలు, సరిహద్దు రాళ్లపై నాటి సీఎం బొమ్మలు వేసుకున్నారని, నేడు ప్రభుత్వ రాజముద్రతో పట్టాదారు పాస్ పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. జిల్లాలో సుమారు 2 లక్షల పట్టాలు పంపిణీ చేస్తున్నామని, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజల చేతుల్లోకి పాలన తీస్తుళ్ళామని అన్నారు. పరిశ్రమలను ఏపీకి తీసుకొచ్చి యువతకు 20 లక్షల ఉద్యోగాలిచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, ఎంతో మంది పోటీపడినా గూగుల్ డేటా సెంటర్ ను చంద్రబాబు ఏపీకి తీసుకొచ్చారన్నారు. దేశానికి గత ఏడాదిలో వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకి తీసుకొచ్చామని, నాడు శంషాబాద్, నేడు భోగాపురం, నాడు సైబరాబాద్, నేడు విశాఖపట్నం అభివృద్ధి కేంద్రాలుగా మార్చిన వ్యక్తి మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ అభివృద్ధి ఫలాలు అందించాలనే లక్ష్యంతో క్షణ క్షణం తపిస్తున్నామని, కూటమి ప్రభుత్వం ప్రజా రంజక పాలన అందిస్తోందని, అలాంటి ప్రభుత్వంపై కుట్రలు చేస్తామంటే ఉపేక్షంచేది లేదని మంత్రి కొల్లు రవీంద్ర హెచ్చరించారు.

## చెట్టుపల్లిలో ఘనంగా వికసిత భారత్-జీ రామ్ జీ గ్రామసభ

### ఉపాధి హామీ పనిదినాలు 125కు పెంపు

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న కూటమి నాయకులు



**నర్సీపట్నం:** మండలంలో గల చెట్టుపల్లి గ్రామంలో 'వికసిత భారత్-జీ రామ్ జీ' పేరుతో సోమవారం గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ సెక్రటరీలు, ఉపాధి హామీ పథకం సిబ్బంది ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. కూటమి నాయకులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. గ్రామ ఉపాధి శ్రామికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి విశాఖ జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు ఊడి చక్రవర్తి మాట్లాడుతూ, ఉపాధి హామీ పథకంలో కీలక మార్పులు తీసుకురావడం జరిగిందని తెలిపారు. నిరుద్యోగ భృతికి మెరుగైన ఏర్పాట్లు చేశారని పనిచేసిన దినానికి సమయానికి కూలి చెల్లింపు, ఆలస్యమైతే ఆలస్య పరిహారం చెల్లించే విధానం అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. ఇప్పటివరకు వంద రోజులకే పరిమితమైన ఉపాధి పనిదినాలను, ఇక నుంచి 125 రోజులకు పెంచడం జరుగుతుందని వెల్లడించారు. జాబ్ కార్డు లేని వారు వెంటనే జాబ్ కార్డులు చేయించుకుని ఉపాధి పొందుతూ కుటుంబ ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అలాగే, వికసిత గ్రామ పంచాయతీ ప్రణాళిక, స్వచ్ఛ సంక్రాంతి, స్వచ్ఛ గ్రామం కార్యక్రమాలను విజయవంతం చేయడంలో గ్రామ ప్రజలందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. పంచాయతీ సిబ్బందితో కలిసి పనిచేసి చెట్టుపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతూ 'స్వచ్ఛ పంచాయతీ అవార్డు' సాధిద్దామని ఆయన ఆకాంక్షంచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు శ్రావణి, ఫణి, గ్రామ సర్పంచ్ నాగరత్నం, సూరిబాబు, వైస్ ఎంపీపీ రమణరత్నం, తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కలిమి సత్తిబాబు, ఉపాధి హామీ పథకం వీఆర్పీ షేక్ జిలాని, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు రాజన్నతో పాటు పలువురు నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామీణ ఉపాధికి వికసిత్ భారత్ హామీ పథకం



**తడ:** పేదరిక నిర్మూలన, గ్రామీణ ఉపాధి కల్పన లక్ష్యంగా అమలులో ఉన్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) స్థానంలో "వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ అజీవికా మిషన్ (గ్రామీణ) ఉ 2025" పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తూ భారత రాజపత్రం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొత్త పథకానికి సంబంధించిన పోస్టర్‌ను తిరుపతి జిల్లా తడ మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, తిరుపతి జిల్లా తెదేపా అధ్యక్షులు పనబాక లక్ష్మ చేతుల మీదుగా సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మాట్లాడుతూ, వికసిత్ భారత్ గ్యారంటీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో దీర్ఘకాలిక ఆస్తుల సృష్టి, ఉపాధి అవకాశాల విస్తరణ లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందన్నారు. ఇప్పటివరకు ఉన్న 100 పని దినాలను 125 పని దినాలకు పెంచడం, జల సంరక్షణ పనులు, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధి, జీవనోపాధి కల్పించే ఆస్తుల నిర్మాణం, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే పనులను ఈ పథకం కింద చేపట్టనున్నట్లు తెలిపారు. అలాగే శక్తివంతమైన నిరుద్యోగ భృతి వ్యవస్థ, నిర్ణీత కాలంలో వేతనాల చెల్లింపులు, ఆలస్యమైతే పరిహారం చెల్లించే విధానం ఈ పథకంలోని ముఖ్యమైన అంశాలుగా పేర్కొన్నారు. గ్రామసభల ద్వారా వికసిత్ గ్రామపంచాయతీ ప్రణాళిక రూపొందించి, అందులో అన్ని ప్రభుత్వ పథకాలను అనుసంధానం చేయడం ద్వారా సమగ్ర గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం సమర్ధవంతంగా వినియోగించుకునే అవకాశం ఈ పథకం ద్వారా కల్పించనున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామీణ కుటుంబం ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేఖర్ నాయక్, ఏపీవో నాగరాజు, సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ స్వామి అయ్యప్ప ఆలయంలో మకరజ్యోతి మహెూత్సవాలకు అంకురార్పణ

### ముహూర్తపు రాట వేసి ఏర్పాట్లు ప్రారంభించిన కౌన్సిలర్ చింతకాయల రాజేష్



**నర్సీపట్నం:** పట్టణంలోని శ్రీ స్వామి అయ్యప్ప దేవాలయంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మకరజ్యోతి మహెూత్సవాలకు ఘనంగా ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు మూడు రోజుల పాటు అత్యంత భక్తిశ్రద్ధలతో, వైభవోపేతంగా జరగనున్న ఈ ఉత్సవాలకు సోమవారం మున్సిపల్ కౌన్సిలర్ చింతకాయల రాజేష్ ముహూర్తపు రాట వేసి లాంఛనంగా పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారికి విశేష పూజలు, ప్రార్థనలు నిర్వహించి, ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం రాజేష్ మాట్లాడుతూ, 1983 నుంచీ అయ్యప్ప సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా మకరజ్యోతి మహెూత్సవాలు నిర్వహించడం భక్తులకే కాదు సమాజానికే ఆధ్యాత్మిక వెలుగును అందిస్తోందని కొనియాడారు. అయ్యప్ప స్వామి ఆశీస్సులతో ఈ ఉత్సవాలు సజావుగా సాగాలని, భక్తులందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందాలని కోరారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఉత్సవాల విశేషాలను వెల్లడించారు. మూడు రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం స్వామివారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నామని తెలిపారు. 15వ తేదీ గురువారం సాయంత్రం 5 గంటలకు కేరళ సంప్రదాయ వాయిద్యాలు, భజన బృందాల నడుమ స్వామివారి రథయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు శ్రీ సత్య సాయి జిల్లాలో జాయింట్ కలెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న నర్సీపట్నానికి చెందిన ఐఏఎస్ అధికారి ఎం.భరద్వాజ్, ఉత్తర ప్రదేశ్ లో ఐజీ గా విధులు నిర్వహిస్తున్న నర్సీపట్నానికి చెందిన ఐపీఎస్ అధికారి కిల్లాడ సత్యనారాయణ, ప్రముఖ సంగీత దర్శకుడు కోటి, గాయకుడు మనో, సినీ నటుడు శ్రీ సత్యసాయి శ్రీనివాస్ తదితర ప్రముఖులను సన్మానించనున్నామన్నారు. అనంతరం రోషన్ లాల్ ఆర్కెస్ట్రా వారి సంగీత విభావరి, గజముఖ నృత్య అకాడమీ వారి శాస్త్రీయ నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. ఉత్సవాల చివరి రోజైన 16వ తేదీ శుక్రవారం రాత్రి, ప్రముఖ కొరియోగ్రాఫర్ పండు మాస్టారు తో పాటు జబర్దస్త్, ఢీ షో ఫేమ్ కళాకారులతో బాలు రైడర్స్ ఆధ్వర్యంలో 'డాన్స్ బేబీ డాన్స' ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ మూడు రోజుల మకరజ్యోతి మహెూత్సవాలకు ముఖ్య అతిథులుగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు దంపతులు, టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ దంపతులు, కౌన్సిలర్ చింతకాయల రాజేష్ దంపతులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టిడిపి నాయకులు, అయ్యప్ప స్వామి భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## హరిత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా పక్షుల దినోత్సవం

### పక్షుల ఆహార భద్రతకు వరి కుంచెలు ఏర్పాటు

### పర్యావరణ పరిరక్షణ అవార్డు గ్రహీత గెడ్డం శ్రీనివాస్



**నర్సీపట్నం:** హరిత ఫౌండేషన్, ప్రగతి సిరి స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో సోమవారం పక్షుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ అవార్డు గ్రహీత గెడ్డం శ్రీనివాస్ మాట్లాడుతూ, పక్షుల సంరక్షణ పర్యావరణ పరిరక్షణకు కీలకమని, పక్షులను రక్షంచడం మానవజాతి బాధ్యతని ఆయన అన్నారు. కొన్ని పక్ష జాతులు అంతరించిపోతున్న నేపథ్యంలో వాటి జీవన ప్రదేశాలను కాపాడడం, ఆహార భద్రత కల్పించడం, పచ్చదనాన్ని పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. కృత్రిమ రసాయనాల వినియోగాన్ని తగ్గించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పక్షులు పంటలకు హాని చేసే పురుగులను తిని వ్యవసాయానికి సహకరిస్తాయని, దీనివల్ల పంటల ఉత్పాదకత పెరుగుతుందని తెలిపారు. పక్షులు వ్యవసాయానికి సహజ మిత్రులని, మనిషిఉప్రకృతిఉవ్యవసాయం మధ్య విడదీయరాని అనుబంధం ఉందన్నారు. అడవులు నశించడంతో అనేక పక్ష జాతులు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పక్షులను కాపాడడం అంటే ప్రకృతిని కాపాడడమేనని, భవిష్యత్ తరాలకు కలుషితం లేని వాతావరణాన్ని అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇంటివద్ద తల్లిదండ్రులు, పాఠశాలల్లో ఉపాధ్యాయులు పిల్లలకు పక్షుల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని సూచించారు. స్వచ్ఛంద సంస్థలు ఎన్నో సంవత్సరాలుగా జీవవైవిధ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాయని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో భాగంగా పక్షుల ఆహార భద్రత కోసం నర్సీపట్నం ఆర్‌డీఓ కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, ఎన్టీఆర్ స్టేడియం, నీటిపారుదల శాఖ సహా పలు ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా ప్రదేశాల్లో వరి కుంచెలను ఏర్పాటు చేశారు. హరిత ఫౌండేషన్ డైరెక్టర్, విశ్రాంత ఉపాధ్యాయులు దాలినాయుడు పక్షుల సంరక్షణకు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తూ ప్రజలకు నిరంతరం ప్రోత్సాహం ఇస్తున్నారని తెలిపారు. వరి కుంచెల తయారీలో మహిళలకు శిక్షణ ఇవ్వడంతో పాటు రైతులను ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు.

## కోతులు కరిస్తే నిర్లక్ష్యం చేయద్దు.. రేబీస్ వ్యాక్సిన్ వేయించుకోవాలి



**చల్లపల్లి:** కోతులు కరిస్తే రేబీస్ వ్యాధి సోకే అవకాశం ఉందనీ, నిర్లక్ష్యం చేయకుండా వ్యాక్సిన్లు వేయించుకోవాలని పురిటిగడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అధికారి డాక్టర్ ఎం. విజయరావు తెలిపారు. పురిటిగడ్డలో మూడవ తరగతి చదువుతున్న చందు అనే విద్యార్థిపై రెండు రోజుల క్రితం కోతులు దాడిచేసి కరవగా కుటుంబ సభ్యులు ఆర్ఎంపీ వద్ద టీటీ ఇంజక్షన్ చేయిం చారు. సమాచారం తెలుసుకున్న ఉపాధ్యాయుడు దేవరపల్లి సురేష్బాబు విద్యార్థిని పీహెచ్సీకి తీసుకువెళ్లగా, వైద్యాధికారి డాక్టర్ విజయరావు విద్యార్థిని పరీక్షంచి వైద్యసేవలందించారు. మొదటి విడతగా వ్యాక్సిన్ చేశారు. కుక్క, పిల్లి, కోతి, ఎలుకలు కరిస్తే వెంటనే గాయాన్ని శుభ్రంచేసి డాక్టర్ల పర్యవేక్షణలో సరైన వైద్యం చేయించుకోకపోతే ప్రాణాంతక రేబిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. గాయాన్ని బట్టి టీటీ ఇంజక్షన్తోపాటు వ్యాక్సిన్లు చేయించుకోవాలనీ, చందుకు గాయం లోతుగా ఉం డటంతో నాలుగు వ్యాక్సిన్లు చేయాలని తెలిపారు. గ్రామాల్లో కుక్కలతోపాటు కోతుల బెడద ఎక్కువగా ఉన్న నేపథ్యంలో వాటి దాడుల బారిన పడకుండా జాగ్రత్తపడాలని సూచించారు.

## ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలి



**చల్లపల్లి:** ఉపాధి హామీ పథకం పేరుమార్చి అనేక మార్పులతో తీసుకువచ్చిన కొత్త చట్టాన్ని రద్దు చేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లా నేత యద్దనపూడి మధు డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి పథకం పేరు మార్చడాన్ని నిరసిస్తూ చల్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం జరిగిన గ్రామసభల్లో ఏపీ రైతుసంఘం, వ్యవసాయ కార్మికసంఘం నేతలు వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ, కొత్త బిల్లు వల్ల రాష్ట్ర ప్రభుత్వంపై ఆర్థిక భారం పడుతుందన్నారు. బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి అవసరమైన నిధులను కేటాయించకుండా తూట్లు పొడవటానికే ప్రయత్నిస్తోందన్నారు. 20 ఏళ్లుగా ఉపాధి హామీ పథకం రాష్ట్రాభివృద్ధికి ఎం తగానో తోడ్పడిందన్నారు. 125 పనిదినాలు అంటూ అసలు పథకానికే ముప్పు తెచ్చేలా చట్టంలో మార్పులు తీసుకువచ్చారని, కొత్త చట్టం ప్రకారం 40శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వాలు భరించటం అదనపు భారమనీ, అంతేకాకుండా నిధులను ముందుగా రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చుచేసి తర్వాత కేంద్రం నుండి వసూళ్లు చేసుకోవాలనటం దుర్మార్గమని అన్నారు. ఆర్ఎస్ఎస్. అనుకూల బీజేపీ ప్రభుత్వం మహాత్మాగాంధీ పేరు మార్చటం అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజా వ్యతిరేఖమైన కొత్త ఉపాధి చట్టాన్ని ఉపసంహరించుకోవాలని ఇందుకోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మేడేపల్లి వెంకటేశ్వరరావు, బండారు కోటేశ్వరరావు, వేముల నాగేశ్వరరావు, సీఐటీయూ మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా, ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.